
‘ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి’

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 139

బుధవారం 9-8-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**సూర్య అదరగొట్టగా...**

మూడో టి20లో వెస్టిండీస్‌పై భారత్ ఘనవిజయం. - 12లో



**ఇన్వెస్టర్ల అప్రమత్తత**

స్వల్ప నష్టాలతో ముగింపు. ఎఫ్ఎంసీజీ, మెటల్ షేర్లలో అమ్మకాలు. - 13లో



**అమెరికా అతలాకుతలం..**

అమెరికాలోని తూర్పు తీర రాష్ట్రాలను భీకర తుపాను వణికిస్తోంది. 10 రాష్ట్రాల్లోని 11 లక్షల నివాసాల్లో అంధకారం అలుముకుంది.

- వివరాలు 6లో



**రాహుల్‌కు మళ్లీ అదే బంగ్లా**

రాహుల్‌కు లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరించడంతో ప్రభుత్వం ఆయనకు మునుపటి 12వ నంబర్ బంగ్లాను తిరిగి కేటాయించింది.

- వివరాలు 6లో

# లోక్‌సభలో గరంగరం

**అవిశ్వాస తీర్మానంపై పార్లమెంట్ దిగువ సభలో ప్రారంభమైన చర్చ.. అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం**


లోక్‌సభలో మాట్లాడుతున్న గౌరవ్ గొగోయ్

- మణిపూర్‌పై ప్రధాని మోదీ మౌనవ్రతాన్ని విచ్ఛిన్నం చేయడానికే అవిశ్వాసం
- కాంగ్రెస్ సభ్యుడు గౌరవ్ గొగోయ్ స్పష్టీకరణ
- పేదల బిడ్డపై అవిశ్వాసమా? అంటూ బీజేపీ ఎంపీల ఆగ్రహం
- మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని విపక్షాల డిమాండ్
- కాంగ్రెస్ తరఫున మాట్లాడేవారి లిస్ట్ నుంచి రాహుల్ పేరు చివరి క్షణంలో తొలగింపు


లోక్‌సభలో మాట్లాడుతున్న కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ సహా విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. వాడీవేడిగా చర్చ జరిగింది. మణిపూర్ హింసపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనవ్రతాన్ని విచ్ఛిన్నం చేయడానికే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని ప్రతిపక్షాలు వెల్లడించాయి. ప్రజల సంక్షేమం కోసం కష్టపడి పనిచేస్తున్న పేదల బిడ్డ నరేంద్ర మోదీపై విశ్వాసం లేదంటూ సభలో ఓటు వేస్తారా? అని అధికార బీజేపీ సభ్యులు ప్రతిపక్షాలపై మండిపడ్డారు. మణిపూర్ హింసాకాండకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని

మిగతా 6వ పేజీలో ▶

**ఐక్యతను పరీక్షించుకోవడానికే ప్రభుత్వంపై అవిశ్వాసం..**



విపక్ష కూటమిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విసుర్లు

**ఇదీ మణిపూర్ కథ..**

6లో

## చీమల చట్నీ.. గోంగూర..



- భిన్నంగా ఆదివాసీల ఆహారపు అలవాట్లు
- గోంగూర, చింతపండు ప్రధాన ఆహారం
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

14లో

## 70% మార్కులు వస్తేనే!

- జేపీఎస్‌ల క్రమబద్ధీకరణపై ప్రభుత్వ నిర్ణయం
- మార్కులు రాని వారికి మరో ఆరు నెలల గడువు

2లో

## కమీషన్ రూ.500 పెంపు



- రేషన్ డీలర్లపై సర్కార్ వరాల జల్లు
- కమీషన్‌ను మెట్రిక్ టన్నుకు రూ.900 నుంచి రూ.1,400కు పెంచుతూ నిర్ణయం
- కారుణ్య నియామకం కింద వారసులకు డీలర్‌షిప్

5లో

## విలాసానికి సై..

- లగ్జరీ గృహాల ధరల్లో అత్యధిక వృద్ధి
- హైదరాబాద్ అన్నింట్లో ఆల్‌టైమ్ రికార్డు
- అనరాక్ గ్రూప్ తాజా అధ్యయనంలో వెల్లడి

2లో


NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE

Venc*bb CHICKEN

సూచించిన నేటి గుడ్డు & చికెన్ కరీంనగర్ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్డు రిటైల్ ధర ₹ 53 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 86 | డ్రెస్డ్ స్కిన్‌తో | 157 |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 108 | స్కిన్‌లెస్ | 178 |

Conditions Apply


## ఇదండీ సంగతి



# సహపంక్తి భోజనం.. రాత్రి బస

- ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఏఐసీసీ పిలుపు
- ‘గిరిజన, ఆదివాసీ సంరక్షణ హస్తం’ పేరుతో తండాలు, గూడేల్లోకి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు
- బీఆర్‌ఎస్ మోసాలు, కాంగ్రెస్ ప్రణాళిక వివరించడమే ఎజెండా



సాక్షి, హైదరాబాద్: గిరిజన ఆదివాసీలను ఆకట్టుకునే దిశలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పిలుపు మేరకు బుధవారం పార్టీ రాష్ట్ర నాయకత్వం తండాలు, గూడేల్లో బస చేయనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలంలోని రెండు లేదా మూడు తండాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని టీపీసీసీ పిలుపునిచ్చింది. ‘గిరిజన ఆదివాసీ సంరక్షణ హస్తం’పేరుతో చేపట్టనున్న ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ఆదివాసీలు, గిరిజనులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన మోసాలను వివరించడంతో పాటు భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయే మేలు, చేపట్టబోయే ఇతర కార్యక్రమాల గురించి నేతలు వివరించనున్నారు.

**నివాళి.. నృత్య ప్రదర్శనలు.. నిద్ర**

బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కొమురం భీం, సేవాలాల్ మహరాజ్, ఇందిరాగాంధీ చిత్రపటాలకు నేతలు పూలమాలలు

మిగతా 3వ పేజీలో ▶

## సీసీఎస్ వడ్డీకి ఆర్టీసీ ఎసరు!



- వాడేసుకున్న సహకార పరపతి సంఘం నిధులపై రూ.400 కోట్ల వడ్డీ లెక్కించని ఆర్టీసీ
- ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియ నివేదికలో అసలు మొత్తాన్నే పేర్కొన్న సంస్థ
- తప్పుపడుతున్న కార్మిక సంఘాలు

➤ ఆర్టీసీ యాజమాన్యం మాకు రూ. 903 కోట్లు (తాజా అంచనా రూ. 1,070కోట్లు) బకాయి పడింది. ఇందులో వడ్డీ కూడా ఉంది.

➤ ఆర్టీసీపై కోర్టు ధిక్కార కేసు దాఖలు సందర్భంగా సమర్పించిన నివేదికలో సీసీఎస్

➤ సీసీఎస్‌కు రూ. 969 కోట్లు చెల్లించాం. మరో రూ. 638 కోట్లు (తాజా అంచనా రూ. 670 కోట్లు) చెల్లించాల్సి ఉంది.

➤ అదే కేసులో హైకోర్టుకు నివేదికలో ఆర్టీసీ యాజమాన్యం

2లో


## బాసర ట్రిపుల్ ఐటీలో మరో విద్యార్థి ఆత్మహత్య



- క్లాసులకు హాజరైన రెండో రోజే ఉరేసుకుని..
- రెండు నెలల క్రితం ఓ విద్యార్థిని బలవన్మరణం
- వరుస ఘటనలపై ఆందోళన

- వివరాలు 5లో

## 16 నుంచి మైనారిటీలకు రూ. లక్ష సాయం



- మొదటి దశలో పది వేల మంది లబ్ధిదారులకు పంపిణీ
- ఈ కార్యక్రమానికి రూ. 400 కోట్లు కేటాయింపు: హరీశ్

- వివరాలు 2లో

# మీరే నిలుస్తారు.. మనమే గెలుస్తాం!

- పార్టీ నేతలకు కేటీఆర్ భరోసా
- ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతున్న బీఆర్‌ఎస్
- కేసీఆర్ కార్యాచరణను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరిస్తున్న మంత్రి
- జిల్లాల వారీగా సమావేశాలు


సిరిసిల్లలో వెజ్ మార్కెట్ పక్కన స్కూల్ పిల్లలతో సరదాగా ముచ్చటిస్తూ వారికి ఫ్లయింగ్ కిస్ ఇస్తున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యాచరణకు మరింత పదును పెట్టాలని భారత్ రాష్ట్ర సమితి భావిస్తోంది. అసెంబ్లీ ఆఖరి విడత సమావేశాలు కూడా ముగియడంతో ఏడాది చివరలో జరిగే ఎన్నికలపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించనుంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాల వారీగా మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సంయుక్త భేటీలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇటీవలి కాలంలో ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సమావేశమై దిశా నిర్దేశం చేశారు. అయితే తాజాగా 2 రోజుల క్రితం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు భేటీ అయ్యారు. ఎన్నికల దిశగా వచ్చే 2 నెలల పాటు

మిగతా 3వ పేజీలో ▶

మీరు దయతలిస్తే మళ్లీ గెలుస్తా!: కేటీఆర్ 3లో




## క్లుప్తంగా...

### గోల్కొండలో స్వాతంత్య్ర దినోత్సవం

**పకడ్బందీ ఏర్పాట్లకు సీఎస్ ఆదేశం**



సాక్షి, హైదరాబాద్: గోల్కొండ కోటలో స్వాతంత్య్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ఉత్సవ ఏర్పాట్లపై మంగళవారం డీజీపీ అంజనీ కుమార్‌తో కలిసి ఆమె సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 15న ఉదయం 10.30 గంటలకు గోల్కొండలో ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ పతాకావిష్కరణ చేస్తారని పేర్కొన్నారు. అంతకుముందు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అమరవీరుల స్మారక స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తారని తెలిపారు. అమర వీరుల స్మారక స్తూపం వద్ద ఆర్మీ అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు.

### నేడు నిజామాబాద్ ఐటీ హబ్ ప్రారంభం

**ఇప్పటికే 15 కంపెనీలతో ఒప్పందం.. టాస్క్ ద్వారా ఉద్యోగుల నియామకం**

సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్‌లో నిర్మించిన 'ఐటీ హబ్'ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ బుధవారం ప్రారంభించనున్నారు. ఈ హబ్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనేక టెక్నాలజీ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే 15 కంపెనీలు ఒప్పందం కుదుర్చుకొని ఉద్యోగులను కూడా నియమించుకున్నాయి. జూలై 21న తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) నిర్వహించిన ఉద్యోగ మేళా ద్వారా నిరుద్యోగ యువత, విద్యార్థుల్లో నైపుణ్యం కలిగిన వారికి నియామక పత్రాలు కూడా అందజేశారు. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు ఐటీ రంగాన్ని విస్తరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వరంగల్, కరీంనగర్, ఖమ్మం, సిద్దిపేట, మహబూబ్‌నగర్‌లో ఐటీ హబ్‌లను ప్రారంభించిన విషయం తెలిసిందే. త్వరలో నల్లగొండ ఐటీ హబ్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

### అవిశ్వాస చర్చలో తెలంగాణ ప్రగతిని వివరిస్తాం

**బీఆర్ఎస్ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి**



సాక్షి, న్యూఢిల్లీ: దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ ఎంపీ డాక్టర్ జి.రంజిత్ రెడ్డి విమర్శించారు. అందుకే ఎన్డీఏ ప్రభుత్వంపై తమ పార్టీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిందని తెలిపారు. మంగళవారం కేంద్రంపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ ప్రారంభమైన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు విశ్వాసం కోల్పోయారని, మణిపూర్‌లో పెద్ద ఎత్తున అల్లర్లు జరుగుతుంటే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణకు కేంద్రం నుంచి ప్రతి అంశంలోనూ రిక్తహస్తమే ఎదురైందని ఆరోపించారు. అన్ని రాష్ట్రాల్లో జిల్లాకో నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేసి తెలంగాణకు ఒక్క పాఠశాల కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి ఒక్క మెడికల్ కళాశాల కూడా మంజూరు చేయలేదన్నారు.

### పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

**జంతర్‌మంతర్ వేదికగా ధర్నా**

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్‌ల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీలకు కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బీసీల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా ధర్నా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావ్ అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, లాల్‌కృష్ణ, బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ అధ్యక్షుడు అంజి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని కోరారు. బీసీ విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలని, జనాభా గణనలో కులాల వారీ లెక్కలు తీయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు.

### 10న నూతన పింఛన్ విధానం వ్యతిరేక ర్యాలీ

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ రైల్వేలో నూతన పింఛన్ పథకాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 10న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో మహా ర్యాలీ నిర్వహించనున్నట్లు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ (ఎన్‌ఎఫ్‌ఐఆర్) ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా చేరే కార్మికులకు నూతన పింఛన్ విధానం వల్ల నష్టం జరుగుతుందన్నారు. రైల్వేలోనూ పాత పింఛన్ విధానం అమలు చేయాలని మాజీ కేంద్ర మంత్రులు ఖర్గే, సురేశ్‌ప్రభులు నివేదిక ఇచ్చినా కేంద్రం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మహా ర్యాలీ అనంతరం ప్రధానిని కలుస్తామని చెప్పారు.

# విలాసానికి సై

**లగ్జరీ గృహాల ధరల్లో అత్యధిక వృద్ధి**

**హైదరాబాద్ అన్నింట్లో ఆల్‌టైమ్ రికార్డు**

**అనరాక్ గ్రూప్ తాజా అధ్యయనంలో వెల్లడి**

**హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు ఇలా** (చదరపు అడుగుకు/ రూ.లలో)

| | 2018 | 2023 |
|---|---|---|
| లగ్జరీ ఇళ్లు | 7,450 | 10,580 |
| మధ్యతరగతి | 6,050 | 7,120 |
| అందుబాటు గృహాలు | 3,750 | 4,310 |



సాక్షి, హైదరాబాద్

రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ కొత్త రికార్డులు సృష్టిస్తోంది. కోకాపేటలో ఎకరం భూమికి రూ.100 కోట్లు.. మోకిలాలో గజానికి రూ.1,0,5000 ధర పలికిన విషయం తెలిసిందే. తాజాగా లగ్జరీ గృహాల ధరల వృద్ధిలోనూ మరో మైలురాయి సాధించింది. దేశంలోని ప్రధాన మెట్రోనగరాలతో పోలిస్తే భాగ్యనగరంలో విలాసవంతమైన ఇళ్ల ధరలు 42శాతం మేర పెరిగాయి. రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర ఉండే ఈ ప్రీమియం యూనిట్ల రేట్లు గత ఐదేళ్లలో హైదరాబాద్‌లో రికార్డుస్థాయిలో పెరిగాయని అనరాక్ గ్రూప్ తాజా అధ్యయనంలో వెల్లడైంది.

### విలాసవంతమైన ఇళ్లలో ఇలా...


హైదరాబాద్‌లో 2018లో విలాసవంతమైన ఇళ్ల ధరలు చదరపు అడుగుకు రూ.7,450గా ఉండగా, 2023 నాటికి ఏకంగా రూ.10,580కి పెరిగింది. ఇదే సమయంలో బెంగళూరు, ముంబై నగరాలలో లగ్జరీ ఇళ్ల ధరలు 27 శాతం మేర మాత్రమే పెరిగాయి. కరోనా తర్వాత నుంచే లగ్జరీ గృహాల సరఫరా, డిమాండ్ పెరగడమే ఈ వృద్ధికి కారణమని అనరాక్ గ్రూప్ చైర్మన్ అనూజ్‌పూరి తెలిపారు. 2018లో బెంగళూరులో ప్రీమియం ఇళ్ల ధరలు చదరపు అడుగుకు రూ.10,210గా ఉండగా, ఇప్పుడది రూ.12,970కి పెరిగింది. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో రూ.23,119 నుంచి రూ.29,260కి చేరింది.

### రెండోస్థానంలో హైదరాబాద్

ఏడు ప్రధాన నగరాల్లో రూ.40 లక్షలలోపు ధర ఉండే సరసమైన గృహాల విలువలు 15 శాతం మేర పెరిగాయి. 2018లో సగటు ధర చదరపు అడుగుకు రూ.3,750గా ఉండగా, ఇప్పుడది రూ.4,310కి పెరిగింది. అఫర్డబుల్ కేటగిరీలో ఎన్సీఆర్‌లో అత్యధికంగా 19 శాతం మేర ధరలు పెరిగాయి. ఈ విభాగంలో ధరల వృద్ధిలో హైదరాబాద్ రెండోస్థానంలో నిలిచింది. ఐదేళ్లలో మన నగరంలో 16 శాతం మేర ధరలు పెరిగాయి. అందుబాటు గృహాల ప్రారంభ ధర చదరపు అడుగుకు రూ.4 వేలుగా ఉంది.

### మధ్యతరగతిలోనూ మనమే టాప్

ఐదేళ్ల కాలంలో టాప్–7 నగరాల్లో రూ.80 లక్షల నుంచి రూ.కోటిన్నర మధ్య ధర ఉండే మధ్యతరగతి విభాగంలోని ఇళ్ల విలువల్లో 18 శాతం మేర వృద్ధి చెందాయి. 2018లో సగటు ధర చదరపు అడుగుకు రూ.6,050లుగా ఉండగా, ఇప్పుడది రూ.7,120కి పెరిగింది. ఈ విభాగంలోనూ అత్యధికంగా 23 శాతం ధరల వృద్ధి హైదరాబాద్‌లోనే నమోదైంది. మన నగరంలో మిడ్‌సైజ్ గృహాల ప్రారంభ ధర చదరపు అడుగుకు రూ.5,780గా ఉంది.




### దేశంలోని సగటు చూస్తే..

**2018 నుంచి 2023 నాటికి దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో సరసమైన గృహాల విలువలు సగటున 15 శాతం మేర పెరిగితే, విలాసవంతమైన గృహాల విలువ 24 శాతం వృద్ధిగా నమోదైంది. రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర కలిగిన ఇళ్ల ధరలు చదరపు అడుగుకు సగటున 2018లో 12,400గా ఉండగా, 2023 నాటికి 15,350కి పెరిగింది.**

# సీసీఎస్ వడ్డీకి ఆర్టీసీ ఎసరు!

- వాడేసుకున్న సహకార పరపతి సంఘం నిధులపై రూ.400 కోట్ల వడ్డీ లెక్కించని ఆర్టీసీ
- తప్పుపడుతున్న కార్మిక సంఘాలు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగుల ఆర్థిక అవసరాలను తీర్చే ఆర్టీసీ సహకార పరపతి సంఘం (సీసీఎస్) నిధులను ఇన్నాళ్లూ ఎడాపెడా సొంతానికి వాడేసుకున్న ఆర్టీసీ యాజమాన్యం తీరా ఇప్పుడు తిరిగి చెల్లించాల్సి వచ్చేసరికి వాడుకున్న మొత్తంపై వడ్డీ ఎగ్గొట్టాలని చూస్తోంది. అందుకే వడ్డీని కలపకుండా సీసీఎస్ బకాయిలను చూపుతోంది. ఈ పరిణామం సీసీఎస్ నుంచి రుణాల కోసం దరఖాస్తు చేస్తున్న దాదాపు 9 వేల మంది కార్మికుల్లో గుబులు రేపుతోంది.

**అంత మేర నష్టపోవాల్సిందేనా..**

రాష్ట్రం విడిపోవడానికి ముందు ఎండీగా పనిచేసిన ఓ అధికారి అత్యవసరం కింద సీసీఎస్ నుంచి కొంత మొత్తాన్ని వాడగా ఆ తర్వాత అది అలవాటుగా మారింది. రాష్ట్రం విడిపోయే నాటికి కొన్ని రూ.కోట్లను యాజమాన్యం వాడేసింది. అలా వాడిన మొత్తంపై లెక్కించిన వడ్డీలో విభజన తర్వాత టీఎస్ఆర్టీసీకి రూ. 7 కోట్లు పంచారు. 2014లో రూ. 7 కోట్ల వడ్డీ బకాయి ఉంటే ఆ తర్వాత రూ. వందల కోట్ల మొత్తాన్ని వాడుతూ కొంత మేర తిరిగి చెల్లిస్తూ, మళ్లీ వాడుతూ.. ఇలా రూ. 400 కోట్లకు వడ్డీ బకాయిలు చేరుకున్నాయి. ఇప్పుడు ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం నేపథ్యంలో సీసీఎస్‌కు చెల్లించాల్సిన బకాయిల్లో వడ్డీ మొత్తాన్ని చేర్చకుండానే నివేదిక రూపొందించడం పెద్ద చర్చకు దారితీస్తోంది. యాజమాన్యం తీరు వల్ల కొన్ని వందల మందికి కావాల్సిన రుణాలకు సరిపోయే రూ. 400 కోట్లను సీసీఎస్... తద్వారా తాము నష్టపోవాల్సిందేనా అన్న ఆవేదన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది.

**వడ్డీ చెల్లించకుంటే ఊరుకోం..**

కార్మికులు, ఉద్యోగులు వారి జీతాల నుంచి ప్రతి నెలా 7 శాతం మొత్తం జమ చేయడం ద్వారా ఏర్పడ్డ నిధి అది. ఆ నిధిని ఆర్టీసీ యాజమాన్యం వాడేసుకొని ఇప్పుడు దానిపై రూ. 400 కోట్ల వడ్డీ ఎగ్గొడతామంటే కార్మికలోకం ఊరుకోదు. దాన్ని నయాపైసాతో సహా చెల్లించాల్సిందే. – అశ్వత్థామరెడ్డి, ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్

**కార్మికులను బలిపశువులను చేయటమే**

ఏదైనా కారణాలతో సీసీఎస్‌ను మూసేసి అందులోని మొత్తాన్ని కార్మికులకు వారి వాటా ప్రకారం పంచాల్సి వస్తే రూ. 400 కోట్లను ఎలా చూపుతారు? అంతమేర కార్మికులకు తక్కువగా చెల్లించడం తప్ప ఏముంటుంది. అంటే కార్మికులను బలిపశువు చేసినట్టే కదా. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆర్టీసీ ఆ వడ్డీ మొత్తాన్ని సీసీఎస్‌కు జమ చేయాల్సిందే. – వీఎస్ రావు, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి

# వైద్యులకు ప్రొటోకాల్ హోదా ఇవ్వాలి

- వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి
- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ వైద్యులకు వాహన సౌకర్యం కల్పించాలని, వారికి ప్రొటోకాల్ హోదా ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ సంఘం ప్రతినిధులు డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ బొంగు రమేశ్, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, డాక్టర్ నరహరి, డాక్టర్ అజ్మీరా రంగ, డాక్టర్ ఉమాకాంత్ తదితరులు మంగళవారం వైద్య ఆరోగ్యశాఖలోని ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ రమేశ్ రెడ్డిని కలిశారు. ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో ఉన్న వైద్యులకు నిర్ణీత కాల వ్యవధి పదోన్నతులు కల్పించాలని, ఆరేళ్లు పూర్తి చేసుకున్న వారికి డిసిగ్నేటెడ్ డిప్యూటీ సివిల్ సర్జన్, పన్నెండేళ్లు పూర్తి చేసుకున్న వారికి డిసిగ్నేటెడ్ సివిల్ సర్జన్లుగా హోదా కల్పించాలన్నారు. అన్ని జిల్లాలకు రెగ్యులర్ డీఎంహెచ్‌వోలను నియమించాలని కోరారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోలకు ఎమర్జెన్సీ అలవెన్స్ కల్పించాలని అన్నారు. డీఎంహెచ్‌వోలకు కనీస వయస్సు 50 ఏళ్లుగా నిర్ణయించడం విడ్డూరమని పేర్కొన్నారు. వైద్యులకు, వైద్య ఆరోగ్య సిబ్బందికి గృహ నిర్మాణం కొరకు ప్రత్యేక రాయితీ కల్పించాలని కోరారు.

# 120 టీఎంసీలు తరలించేలా 'పాలమూరు' పనులు!

- సుప్రీంకోర్టులో కేంద్రం, కృష్ణా బోర్డుల సంయుక్త అఫిడవిట్
- 7.15 టీఎంసీల తాగునీటి పనులకు మాత్రమే అనుమతి
- ఈ మేరకు తరలించుకోవాలనుకున్నా 67.97 టీఎంసీలు ఎత్తిపోయాలి
- ఇప్పటికే ప్రాజెక్టు డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపాం



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద తాగునీటి అవసరాలకు కేవలం 7.15 టీఎంసీలు అవసరం కాగా, శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు 2 టీఎంసీలు చొప్పున 60 రోజుల్లో 120 టీఎంసీల తరలింపునకు వీలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున నిర్మాణ పనులు కొనసాగిస్తోందని కృష్ణా బోర్డు సుప్రీంకోర్టుకు నివేదించింది. శ్రీశైలం నుంచి తరలించుకోవడానికి ప్రతిపాదించిన నీటి పరిమాణంతో పోల్చితే తాగునీటి అవసరాలు చాలా స్వల్పమేనని పేర్కొంది. 7.15 టీఎంసీల తాగునీటిని తరలించుకోవాలనుకున్నా ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన అన్ని జలాశయాల్లోకి కలిపి 67.97 టీఎంసీలను ఎత్తిపోయాల్సి ఉంటుందని పేర్కొంది. వాస్తవ తాగునీటి అవసరాల కంటే తరలించే జలాలు ఎక్కువ అని తెలియజేసింది. ఈ మేరకు తనతో పాటు కేంద్ర జలశక్తి శాఖ తరఫున కృష్ణా బోర్డు తాజాగా అఫిడవిట్ దాఖలు చేసింది.

**3.4 టీఎంసీలకే 65 టీఎంసీలు నింపాలి**

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా మొత్తం 6 రిజర్వాయర్లను ప్రతిపాదించగా, చివరి కేపీ లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ పనులను ఇంకా ప్రారంభించలేదు. తొలి 5 రిజర్వాయర్లలో పూర్తి నిల్వ సామర్థ్యం మేరకు మొత్తం 65.17 టీఎంసీలను నింపిన తర్వాతే, ఈ ఐదింటి కింద తాగునీటి అవసరాలకు ప్రతిపాదించిన మొత్తం 3.4 టీఎంసీలను (కేపీ లక్ష్మీదేవిపల్లి కింద తాగునీటి అవసరాలు 4.11 టీఎంసీలు) తరలించుకోవడానికి వీలు కలిగే రీతిలో ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని సుప్రీంకోర్టుకు బోర్డు తెలిపింది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని ప్రాజెక్టు విషయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

**అఫిడవిట్‌లోని ప్రధానాంశాలు..**

- పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను రూ.55,086 కోట్లతో ప్రభుత్వం చేపట్టింది.
- దీని కింద అంజనగిరి (8.51 టీఎంసీలు), వీరాంజనేయ (6.55 టీఎంసీలు), వెంకటాద్రి (16.74 టీఎంసీలు), కరుమూర్తిరాయ (17.34 టీఎంసీలు), ఉద్దండాపూర్ (16.03 టీఎంసీలు), కేపీ లక్ష్మీదేవిపల్లి (2.80 టీఎంసీల) రిజర్వాయర్లను ప్రతిపాదించింది.
- ఈ ఎత్తిపోతల ద్వారా తరలించే 120 టీఎంసీల్లో తాగునీటికి కేటాయించింది 7.15 టీఎంసీలు. ఇప్పటికే 65.17 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో అంజనగిరి, వీరాంజనేయ, వెంకటాద్రి, కరుమూర్తిరాయ, ఉద్దండాపూర్ రిజర్వాయర్లను.. 120 టీఎంసీలు తరలించేలా ఎత్తిపోతలు, కాలువల వ్యవస్థను పూర్తి చేసింది. ఆరో రిజర్వాయర్ కేపీ లక్ష్మీదేవిపల్లి వద్ద ఇప్పటిదాకా పనులు చేపట్టలేదు. ఇప్పటిదాకా పూర్తయిన ఐదు రిజర్వాయర్ల కింద తాగునీటి అవసరాల కోసం కేటాయించింది 3.40 టీఎంసీలే.
- పోలవరం ద్వారా కృష్ణా డెల్టాకు మళ్లించే గోదావరి జలాలకుగానూ కృష్ణా జలాల్లో అదనంగా దక్కే 45 టీఎంసీలకు, చిన్న నీటిపారుదల విభాగంలో మిగులుగా ఉన్న 45 టీఎంసీలను జతచేసి.. 90 టీఎంసీలతో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను చేపట్టామంటూ తెలంగాణ ప్రభుత్వం డీపీఆర్‌ను సమర్పించింది. కానీ ఈ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు లేవు. నీటి కేటాయింపులపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ చేస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టు డీపీఆర్‌ను మదింపు చేయలేమని గతంలోనే తిప్పి పంపాం. పనులు ఆపాలని గతంలో బోర్డు సమావేశాల సందర్భంగా తెలంగాణను కోరాం.

**కేసు నేపథ్యం ఇదీ...:** పర్యావరణ అనుమతి తీసుకోకుండా చేపట్టిన పాలమూరు, డిండి ఎత్తిపోతల పనులను ఆపాలంటూ ఎన్జీటీ గతంలో ఆదేశించింది. అయినా ప్రభుత్వం పనులు ఆపకపోవడంతో ఎన్జీటీ రూ.920.85 కోట్ల జరిమానా విధించింది. దీనిపై రాష్ట్రం సుప్రీంను ఆశ్రయించగా ఎన్జీటీ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. అలాగే తాగునీటి కోసం 7.15 టీఎంసీలను తరలించేలా పాలమూరు ఎత్తిపోతల పనులకు 2023 ఫిబ్రవరి 17న అనుమతిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. అదే సమయంలో ఎత్తిపోతలను తమ అనుమతి ప్రకారమే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందో లేదో చెప్పాలని కేంద్రాన్ని, కృష్ణా బోర్డును ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం, బోర్డు అఫిడవిట్ దాఖలు చేశాయి. వాస్తవానికి ఈ నెల 4న కేసు విచారణ జరగాల్సి ఉండగా అక్టోబర్ 6కి వాయిదా పడింది.

# 16 నుంచి మైనారిటీలకు రూ.లక్ష సాయం

- మొదటి దశలో పది వేల మంది లబ్ధిదారులకు పంపిణీ
- ఈ కార్యక్రమం అమలుకు రూ.400 కోట్లు కేటాయింపు
- ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: మైనార్టీల సంక్షేమంలో భాగంగా ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయం కార్యక్రమాన్ని అమలు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. మొదటి దశలో భాగంగా ఎంపిక చేసిన 10 వేల మంది లబ్ధిదారులకు ఈ నెల 16 నుంచి రూ.లక్ష చెక్కుల పంపిణీ ప్రారంభించాలన్నారు. ఈ పథకానికి ఇప్పటికే రూ. 270 కోట్లు కేటాయించగా, ఇప్పుడు మరో రూ.130 కోట్లు కేటాయించామని, దీంతో మొత్తం రూ. 400 కోట్లకు చేరిందన్నారు. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు మైనార్టీల సమస్యలపై చర్చించేందుకు సచివాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, గంగుల, తలసాని, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, సీఎస్ శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, మైనారిటీ శాఖ కార్యదర్శి ఉమర్ జలీల్ పాల్గొన్నారు. మైనారిటీలకు రూ.లక్ష సాయం, ఓవ ర్సీస్ స్కాలర్‌షిప్స్, శ్మశాన వాటికలకు స్థలాల కేటాయింపు, గౌరవ వేతనం పొందే ఇమామ్, మౌజం సంఖ్య పెంపు, క్రిస్టియన్ శ్మశాన వాటికలు, ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్ తదితర అంశాలపై చర్చించారు.

**అన్ని వర్గాల అభివృద్ధికి....**

రాష్ట్రంలో మైనారిటీలతోపాటు అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుందని హరీశ్‌రావు చెప్పారు. శ్మశానవాటికలకు 125 ఎకరాల కేటాయింపు, గౌరవ వేతనం పొందే ఇమామ్‌లు–మౌజంల సంఖ్య పెంపుపై ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో జనాభా దామాషా ప్రకారం లబ్ధిదారుల ఎంపిక సాగాలని, మైనారిటీల జనాభా ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. శ్మశానవాటికలు, ఈద్గాల భూముల కోసం వచ్చిన వినతులను క్రోడీకరించాలని, ఈ దిశగా పనులు వేగవంతం చేయాలని చెప్పారు. ఒవైసీ పహాడీ షరీఫ్ దర్గా ర్యాంప్ పనులు, దర్గా బర్హనా షా అద్దెల సవరణ, క్రిస్టియన్ శ్మశానవాటికలు, గ్రాంట్ ఇన్ ఎయిడ్, ఇతర పనులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలన్నారు.

# 'దళితబంధు' రెండోవిడత ఎంపికలో పారదర్శకత

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



సాక్షి, హైదరాబాద్: దళితబంధు రెండో విడత లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సచివాలయంలోని తన చాంబర్‌లో హోంమంత్రి మహమూద్‌అలీతో కలిసి రెండోవిడత దళితబంధు అమలు, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి నగరానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ రెండోవిడత అమలులో భాగంగా ఒక్కో నియోజకవర్గ పరిధిలో 1100 మంది చొప్పున లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. దళితబంధుకు వారం రోజుల్లోనే దరఖాస్తులు అధికారులకు అందజేయాలని, వచ్చిన దరఖాస్తులపై రెండుమూడు రోజుల్లోనే సమగ్ర విచారణ చేసి అర్హులైన వారిని ఎంపిక చేయాలని, ఎలాంటి విమర్శలకు తావివ్వొద్దని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. డిమాండ్ ఉన్న యూనిట్‌లను ఎంపిక చేసుకొనే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. దళితబంధు కింద కొనుగోలు చేసిన వాహనాలకు సంబంధించిన స్టిక్కర్లు తొలగిస్తున్నారని, వాటిని తొలగించకుండా చూడాలని పలువురు ఎమ్మెల్యేలు సమావేశం దృష్టికి తీసుకురాగా, స్టిక్కర్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు సురభివాణీదేవి, రహ్మత్‌బేగ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, కౌసర్ మొహినొద్దీన్, బలాల, మొజాం ఖాన్, ముంతాజ్ అహ్మద్‌ఖాన్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి, కలెక్టర్ అనుదీప్ పాల్గొన్నారు.

# గిరిజనాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పోడు భూముల పట్టాల పంపిణీలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానం
- సీఎం కేసీఆర్ పాలన గిరిజనులకు స్వర్ణయుగం: మంత్రి సత్యవతి రాథోడ్



సాక్షి, హైదరాబాద్: గిరిజనాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పోడు భూముల పట్టాల పంపిణీలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. గిరిజనులను రైతులుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, కేసీఆర్ పాలన గిరిజనులకు స్వర్ణయుగమన్నారు. గిరిజన రిజర్వేషన్ 10 శాతం పెంచడంతో గిరిజనులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరిగాయని పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆమె ఒక ప్రకటనలో గిరిపుత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా గిరిజనుల వెనుకబాటును తొలగించాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ఆదివాసులకు అన్ని మౌలిక వసతులు కల్పించడానికి రూ.కోట్లలో నిధులు మంజూరు చేస్తోందని వెల్లడించారు. ప్రతి తండానూ గ్రామ పంచాయతీగా గుర్తించి.. 'మా తండాలో మా రాజ్యం'అనే గిరిజన ప్రజల కలను సాకారం చేసిందన్నారు. గిరిజనులకు పాలనాధికారం కల్పించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. అటవీ భూములను సాగు చేసుకుని బతుకుతున్న గిరిపుత్రులను కేసీఆర్ ఆ భూములకు యజమానులని చేశారని, 4.06 లక్షల ఎకరాలకు గాను 1.51 లక్షల పోడు రైతులకు పట్టాలను అందజేశామన్నారు. గురుకుల పాఠశాలలను ప్రారంభించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. మేడారం జాతరకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నదని మంత్రి వివరించారు.

# విద్యుత్ బకాయిలపై కఠిన చర్యలు వద్దు

**కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

సాక్షి, హైదరాబాద్: ఏపీకి చెల్లించే విద్యుత్ బకాయిల విషయంలో తెలంగాణపై కఠిన చర్యలు తీసుకోవద్దని కేంద్రాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ అంశంపై ఆగస్టు 24న పూర్తి విచారణ చేపట్టి, ఆదేశాలు జారీ చేస్తామని వెల్లడించింది. విచారణను వాయిదా వేసింది. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఏపీ సరఫరా చేసిన విద్యుత్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ.6,756.92 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని గత వారం కేంద్రం పార్లమెంట్‌లో పేర్కొంది. ఆర్‌బీఐలోనే తెలంగాణ ఖాతా నుంచి బకాయి మొత్తాన్ని మినహాయించుకొని ఏపీకి చెల్లించే ప్రయత్నం చేస్తున్నట్టు వెల్లడించింది. దీంతో కేంద్రం కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ వేసింది.

# 70 శాతం మార్కులు వస్తేనే.!

- జేపీఎస్‌ల క్రమబద్ధీకరణపై ప్రభుత్వ నిర్ణయం
- మార్కులు రాని వారికి మరో ఆరు నెలల గడువు
- ఆ తర్వాత మరోమారు మదింపు
- బేషరతుగా రెగ్యులర్ చేయాలి.. లేదంటే పోరాటం: టీపీఎస్ఏ




సాక్షి, హైదరాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్) రెగ్యులరైజేషన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మెలిక పెట్టింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకమై, నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరు మదింపులో 70 శాతం మార్కులు వచ్చిన వారినే క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా మంగళవారం మెమో జారీ చేశారు. ఈ అధికారిక మెమోను అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపారు. జేపీఎస్‌ల పనితీరును మదింపు చేసేందుకు జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని, ఈ కమిటీలు ఆయా జిల్లాల్లోని జేపీఎస్‌ల పనితీరును సమీక్షించి మార్కులు ఇస్తున్నాయని, కమిటీలు ఇచ్చే రిపోర్టుల్లో 70శాతం, అంతకన్నా ఎక్కువ మార్కులు వచ్చిన వారిని క్రమబద్ధీకరిస్తూ నియామక ఉత్తర్వులు అందజేయాలని ఈ మెమోలో స్పష్టం చేశారు. ఒకవేళ 70శాతం మార్కులు రాకపోతే ఆయా జేపీఎస్‌లకు మరో ఆరునెలల గడువు ఇవ్వాలని, అప్పుడు మరోమారు పనితీరు మదింపు చేసి అప్పటి నివేదికల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

**ఆ మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి**

జిల్లా స్థాయిలో ఆయా కమిటీల మదింపు నివేదికలను గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, పనితీరు సంతృప్తిగా ఉన్న జేపీఎస్‌లకు ఇచ్చే నియామక ఉత్తర్వులను కూడా ఇదే యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ బాధ్యతలను జిల్లా అదనపు కలెక్టర్ల (స్థానిక సంస్థలు)కు అప్పగించారు. అర్హత పొందిన జేపీఎస్‌లకు ఇవ్వాల్సిన నియామక ఉత్తర్వులకు సంబంధించిన ముసాయిదాను కూడా ఈ మెమోతో జతచేసి జిల్లాలకు పంపారు.

**ప్రభుత్వ నిర్ణయం విడ్డూరం: టీపీఎస్ఏ**

పనితీరు మదింపులో 70శాతం మార్కులు వచ్చిన వారిని మాత్రమే క్రమబద్ధీకరిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు విడ్డూరంగా ఉన్నాయని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ (టీపీఎస్ఏ) వ్యాఖ్యానించింది. డైరెక్ట్‌గా రిక్రూట్ అయి మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న జేపీఎస్‌లను అందరినీ బేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని టీపీఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.మధుసూదన్‌రెడ్డి, ఇ. శ్రీనివాస్‌లు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన మెమో అనేక గందరగోళాలకు తావిస్తోందని, తమ డిమాండ్ ప్రకారం అందరినీ బేషరతుగా రెగ్యులరైజ్ చేయకుంటే పోరాటానికి దిగాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

## క్లుప్తంగా...

### రాష్ట్రాన్ని మరో మణిపూర్ చేస్తారా?: సీతక్క



జవహర్‌నగర్: మణిపూర్‌లో కొందరు మహిళలపై అల్లరిమూకలు లైంగిక దాడులకు పాల్పడిన తరహాలో తెలంగాణను మరో మణిపూర్‌గా నిరూపించాలని రాష్ట్ర ప్రభుత్వం అనుకుంటోందా? అని ములుగు ఎమ్మెల్యే సీతక్క నిలదీశారు. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం రాత్రి ఇంటికి వెళ్తున్న ఓ మహిళను నడిరోడ్డుపై ఓ వ్యక్తి వివస్త్రను చేసిన నేపథ్యంలో బాధితురాలిని సీతక్క మంగళవారం పరామర్శించారు. ఆమెకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ మహిళల రక్షణపై మంత్రులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తే ఎమ్మెల్యేలు చప్పట్లు కొడుతున్నారని విమర్శించారు. ఈ ఘటన జరిగి 24 గంటలు గడిచినా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి బాధితురాలిని పరామర్శించకపోవడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు.

### పురోగతిలో 'యాదాద్రి థర్మల్' పనులు: ఆర్కే సింగ్

సాక్షి, న్యూఢిల్లీ : తెలంగాణలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పనులు పురోగతిలో ఉన్నాయని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ తెలిపారు. 800 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ఐదు యూనిట్లు ఇప్పటికే పూర్తి కావాలని ఆయన స్పష్టం చేశారు. తొలి రెండు యూనిట్లు డిసెంబర్ 2023 నాటికి, మూడో యూనిట్ సెప్టెంబర్ 2024 నాటికి, నాలుగో యూనిట్ ఆగస్టు 2024 నాటికి, ఐదో యూనిట్ ఏప్రిల్ 2025 నాటికి పూర్తవుతాయని బీజేపీ సభ్యుడు లక్ష్మణ్ ప్రశ్నకు మంగళవారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

### త్వరలోనే దళిత మేధావులతో సమావేశం

**టీపీసీసీ ఎస్సీసెల్ కార్యవర్గ సమావేశంలో నిర్ణయం**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని దళితవర్గాల సంక్షేమం.. అభివృద్ధికి ఏం చేయాలి? ఈ వర్గాల సహకారాన్ని కాంగ్రెస్ పార్టీ కోసం ఎలా తీసుకోవాలి? అనే అంశాలపై త్వరలోనే దళిత విద్యార్థిసంఘాలు, మేధావులు, ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేయాలని టీపీసీసీ ఎస్సీ సెల్ నిర్ణయించింది. ఈ మేరకు గాంధీభవన్‌లో జరిగిన ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ముందుగా మాజీ ఎంపీ నంది ఎల్లయ్య, ప్రజాకవి గద్దర్‌కు నివాళులర్పించారు.

### కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి.. బీఆర్ఎస్ పాలనలో అగాధం

**టీపీసీసీ అధికార ప్రతినిధి అయోధ్యరెడ్డి**

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ హయాంలో అభివృద్ధి జరిగేదని, బీఆర్ఎస్ పాలనలో అగాధం, అంధకారం మాత్రమే మిగులుతున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి బోరెడ్డి అయోధ్యరెడ్డి అన్నారు.



మంగళవారం ఇక్కడి గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి బొజ్జా సంధ్యారెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ద్రోహులను పక్కన కూర్చో బెట్టుకుని ఇంకా తెలంగాణ సెంటిమెంట్ పేరిట లబ్ధి పొందాలన్న బీఆర్ఎస్ ఆలోచన ను ప్రజలు తిరస్కరిస్తారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమైన పదవుల్లో ఉన్న వారంతా టీడీపీ వారేనని చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేసి ఆయనపై విమర్శలు చేయడానికే అసెంబ్లీని పరిమితం చేశారని విమర్శించారు.

### నేడు మహారాష్ట్రకు బీఆర్ఎస్ బృందం

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు, లోక్‌సభ సభ్యుడు బీబీ పాటిల్ నేతృత్వంలోని పార్టీ ప్రతినిధి బృందం బుధవారం ఆ రాష్ట్రంలో పర్యటించనుంది. ఈనెల ఒకటో తేదీన పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ పర్యటించిన సాంగ్లి జిల్లా ఇస్లాంపూర్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ ప్రతినిధి బృందం మరోమారు ఇస్లాంపూర్‌ను సందర్శించి అక్కడ జరిగే రైతుల సమావేశంలో పాల్గొననుంది. సీఎం కేసీఆర్ ఈ సమావేశంలో పాల్గొనాలని భావించినా చివరి నిమిషంలో వాయిదా పడింది. బుధవారం ఇస్లాంపూర్‌లో జరిగే సమావేశంలో పలువురు షెత్కారి సంఘటన్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరనున్నారు.

### నేతకార్మికుల బీమా వయోపరిమితి పెంపు హర్షణీయం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం నేత కార్మికుల బీమా వయోపరిమితిని 75 ఏళ్లకు పెంచడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో తాము చేనేత బీమా కోసం కొనసాగించిన ఉద్యమాల్లో ఇదే అంశాన్ని తెలియజేశామన్నారు. గత 9 ఏళ్లలో రాష్ట్రంలో మృతి చెందిన 400 మంది నేతన్నల కుటుంబాలకు 10 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా, శాశ్వత గృహ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

# మీరు దయతలిస్తే మళ్లీ గెలుస్తా!

**సిరిసిల్లలో మంత్రి కేటీఆర్**
- ఎన్నికల్లో మందు, డబ్బులు పంచడం నాకు రాదు
- మీరు గెలిపిస్తే ఓ తమ్ముడిగా, అన్నగా, బిడ్డలా సేవ చేస్తా
- ఈ తొమ్మిదేళ్లు సంక్షేమానికి స్వర్ణయుగం
- పసిబిడ్డ నుంచి పండుముసలి వరకు సర్కారు సాయం



సిరిసిల్ల కలెక్టరేట్‌లో బీసీ బంధు చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు

సిరిసిల్ల టౌన్/ సిరిసిల్ల: 'ఓట్ల సమయంలో మందు, డబ్బులు పంచడం నాకు రాదు. అలాంటి అలవాటు నాకు లేదు. రాబోయే ఎన్నికల్లో సిరిసిల్ల ప్రజలు దయతలిస్తే మళ్లీ గెలుస్తా. అప్పుడు కూడా ఓ తమ్ముడిగా.. అన్నగా.. బిడ్డగా నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తా. బీద, బిక్కిలను కడుపులో దాచుకుని పనిచేస్తా..'అని రాష్ట్ర మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. పేదల గోసలు ఎరిగిన కేసీఆర్ లాంటి నాయకుడిని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీసీ బంధు పథకాన్ని మంత్రి ప్రారంభించారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని 600 మందికి ఈ పథకం కింద చెక్కులు పంపిణీ చేశారు. వేములవాడలో ఆలయ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రమేశ్‌ బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.

**బీసీ బంధు నిరంతర ప్రక్రియ**

'రాష్ట్రంలోని అర్హులైన పేదవారు అడగకపోయినా సీఎం కేసీఆర్ వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుంచారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీ అయిన పసిబిడ్డ నుంచి పండు ముసలి వరకు అందర్నీ ఆదుకుంటున్నారు. కేసీఆర్ కిట్టు నుంచి ఆసరా పెన్షన్ల వరకు అన్ని విధాలా ఆదుకునే మనసున్న ఏకైక వ్యక్తి సీఎం కేసీఆర్. గడిచిన 9 ఏళ్లు సంక్షేమానికి స్వర్ణయుగంలా మారింది. బీసీ బంధు పథకాన్ని ప్రతి నియోజకవర్గంలో 300 మందికి అందిస్తున్నాం. ఈ పథకంలో రూ.లక్ష లబ్ధి పొందిన 14 బీసీ కులాల పేదలు మళ్లీ ఆ డబ్బులను చెల్లించాల్సిన పని లేదు. ఎందుకంటే ఇది రుణం కాదు. కేవలం కులవృత్తులను ప్రోత్సహించేందుకు ఇస్తున్న గ్రాంట్ మాత్రమే. అర్హులందరికీ అందించే వరకు ఈ పథకం కొనసాగుతుంది. శతాబ్దాల పేదరికాన్ని పోగొట్టేందుకే సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల మంది ఆడపిల్లలకు కల్యాణ లక్ష్మి అందించి వారి పెళ్లిళ్లకు సాయం చేశాం. రైతుబంధు, రైతు బీమా, నేతన్నలకు బీమా పథకాలను అమలు చేస్తున్నాం. చేసిన పనులు చెప్పుకుంటూ పోతే ఒడవదు. మళ్లీ ఎన్నికల్లో ప్రతిపక్షాల వాళ్లు ఓట్లు అడగడానికి వస్తే.. మాకు ఎంతో చేసిన బీఆర్ఎస్‌ను కాదని మీకు ఓట్లు ఎందుకు వేయాలని నిలదీయండి. రాష్ట్రంలోని ఏ ఒక్క పేదవర్గాన్ని వదిలిపెట్టకుండా ప్రభుత్వం సాయం చేస్తూ వారి బతుకులను బాగు చేస్తుంది. గృహలక్ష్మి పథకంలో అర్హులకు ఇళ్లను మంజూరు చేస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది..'అని కేటీఆర్ హామీ ఇచ్చారు.

**వచ్చే నెలలో మెడికల్ కాలేజీ ప్రారంభం**

'వచ్చే నెలలో సిరిసిల్లలో మెడికల్ కాలేజీని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభిస్తారు. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో 150 మంది డాక్టర్లు నిరంతరం అందుబాటులో ఉంటారు. అన్ని రోగాలకు ప్రత్యేక వైద్యులతో మెరుగైన వైద్యం అందుతుంది. చిన్న రోగం నుంచి క్యాన్సర్ వరకు ఉచితంగా వైద్యసేవలు జిల్లాలో పేద ప్రజలకు అందుతాయి..'అని మంత్రి చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళాచక్రపాణి, రామతీర్థం మాధవి పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు 'ఒక్కటే'

- పార్లమెంట్ సాక్షిగా ఒక్కటైన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్‌కు ప్రధాని నరేంద్రమోదీ సూచన



మంగళవారం ఢిల్లీలో ప్రధాని మోదీని కుటుంబ సభ్యులతో కలిసిన లక్ష్మణ్

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీని ఎదుర్కొనేందుకు తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటయ్యాయన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బీజేపీ ఎంపీ డా.కె.లక్ష్మణ్‌కు ప్రధాని నరేంద్రమోదీ సూచించారు. ఈ రెండుపార్టీలు ఒక్కటే అన్నది పార్లమెంట్ సాక్షిగా బహిర్గతమైందన్నారు. త్వరలో తెలంగాణలో జరగబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని మోదీ దిశానిర్దేశం చేశారు. మంగళవారం ప్రధాని మోదీని లక్ష్మణ్ కుటుంబసమేతంగా కలిశారు. రాజ్యసభలో తెలంగాణకు సంబంధించి వేస్తున్న ప్రశ్నలు, పాల్గొంటున్న చర్చలు బాగుంటున్నాయని ప్రశంసించారు. ఈ రెండు పార్టీలే లక్ష్యంగా పని చేయడంతోపాటు తెలంగాణ కోసం కేంద్రప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు, అందిస్తున్న నిధులకు సంబంధించిన వివరాలను ప్రజలకు వివరించేలా అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ప్రధాని ఆదేశించారు. వీటితో పాటు ఓబీసీ మోర్చా పనితీరుపై ఆరా తీశారు. తెలంగాణలో ప్రజలు బీజేపీ వెంట ఉన్నారన్న మోదీ, ధీటుగా పనిచేస్తే అధికారంలోకి వస్తామని భరోసా ఇచ్చారు. త్వరలో తెలంగాణలో విస్తృతంగా పర్యటించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నట్టు ఆయన తెలిపారు.

# ఇక కేసీఆర్ ప్రభుత్వానికి వీడ్కోలే

- అసెంబ్లీ సమావేశాల ముగింపే నిదర్శనం
- 3 రోజుల్లోనే సమావేశాలను ఎందుకు ముగించారో సీఎం చెప్పాలి
- మిత్రపక్ష ఎంఐఎంకు స్పీకర్ ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారు?
- బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చట్టసభలపై విశ్వాసం సన్నగిల్లిందని, అందుకు మొన్నటి సమావేశాలే సాక్ష్యమని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల ముగింపు తీరుతో కేసీఆర్ ప్రభుత్వానికి ఇక వీడ్కోలు లభించినట్లేనని వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో ఉన్నప్పుడు వర్షాకాల సమావేశాలు కనీసం 15 రోజులు జరిగేవని, ఏడాదిలో 65 రోజులపాటు సమావేశాలు నిర్వహించేవారని గుర్తుచేశారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది బడ్జెట్ సమావేశాలు 11 రోజులు జరిగితే వర్షాకాల సమావేశాలు మూ డు రోజులే జరిగాయన్నారు. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ సమావేశాలు కేవలం 14 రోజులేనన్నారు. ఎన్ని రోజులైనా అసెంబ్లీ సమావేశాలు జరపడానికి సిద్ధంగా ఉన్నా మన్న సీఎం కేసీఆర్... మూడు రోజుల్లోనే సమావేశాలను ఎందుకు ముగించారో ప్రజలు ఆలోచించాలని కోరారు.

**ప్రతిపక్షాలను స్పీకర్ పట్టించుకోలేదు..**

స్పీకర్ కనీస సంప్రదాయాలను పాటించలేదని, అధికార పార్టీ మాట్లాడుతున్నప్పుడు ఎన్ని గంట లైనా మాట్లాడే అవకాశం ఇచ్చి ప్రతిపక్షాల వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఈటల ఆరోపించారు. సీఎం స్వయంగా ఎంఐఎంను మిత్రపక్ష పార్టీగా పేర్కొన్నాక స్పీకర్ దానికి ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

**వరద మృతులకు నివాళి ప్రకటించలేదు..**

వరదల వల్ల 41 మంది చనిపోతే ప్రభుత్వం అసెంబ్లీలో వారి ప్రస్తావన లేదా సంతాపం ప్రకటించలేదని ఈటల విమర్శించారు. రాష్ట్రంలో రైతు చనిపోతే రూ.4 లక్షలు ఇస్తున్నామని కేసీఆర్ చెబుతున్నారని, అందులో రూ. 3 లక్షలు కేంద్రమే ఇస్తోందన్నారు. వరదల్లో చనిపోయిన కుటుంబాలకు రూ. 10 లక్షలు, ఇల్లు మునిగిన వారికి రూ. 25 వేలు, షాపులకు రూ. 50 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అమ్ములపొదిలో అస్త్రాలు ఉన్నాయని చెపుతున్న కేసీఆర్ గత ఎన్నికల హామీలను ముందుగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు ఇంద్రసేనారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, తుర్క నరసింహ, రాణి రుద్రమ పాల్గొన్నారు.

# మీరే నిలుస్తారు.. మనమే గెలుస్తాం!

▶ మొదటి పేజీ తరువాయి

అనుసరించాల్సిన కార్యాచరణను వివరించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సిట్టింగులకే టికెట్ వస్తుందని, గెలవడం కూడా ఖాయమని కరీంనగర్ జిల్లా భేటీలో నేతలకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. అదే సమయంలో ఎవరికి టికెట్ ఇవ్వాలో పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌కు స్పష్టత ఉందని చెప్పారు. ప్రతి ఓటరు ఏదో ఒక రీతిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లబ్ధిదారేనన్న విషయాన్ని గమనించి, అందుకు అనుగుణంగా ఆత్మీయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో అద్భుతమైన పథకాలు ఉన్నాయని, అయితే వాటిని వివరించాల్సిన బాధ్యత పార్టీ నేతలపైనే ఉందన్న విషయం గమనించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వచ్చే రెండు నెలల పాటు క్షేత్ర స్థాయిలోనే ఉండాలని కేటీఆర్ ఆదేశించినట్లు సమాచారం. కేసీఆర్ రూపొందించిన ఈ కార్యాచరణ ప్రణాళికను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరించేందుకు కరీంనగర్ తరహాలో జిల్లాల వారీ సమావేశాలు కొనసాగించే యోచనలో కేటీఆర్ ఉన్నట్లు సమాచారం.

**అసమ్మతి గురించి ఆందోళన వద్దు**

నియోజకవర్గాల వారీగా నెలకొన్న రాజకీయ స్థితిగతులు, సొంత పార్టీలో అసమ్మతి నేతలు, కింది స్థాయి నేతల నడుమ విభేదాలు తదితరాలపైనా ఈ భేటీల్లో పోస్ట్‌మార్టం చేస్తారు. ఎన్నికల నాటికి అసమ్మతి సద్దుమణుగుతుందని, అదే సమయంలో ఎమ్మెల్యేలు కూడా బెట్టు చేయకుండా మెట్టు దిగి అందరినీ కలుపుకొనిపోవాలని సూచించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రామగుండం నియోజకవర్గం అసమ్మతి నేతలతో ప్రత్యేకంగా భేటీ అయిన కేటీఆర్.. అదే తరహాలో సమస్య తీవ్రత ఉన్న ఇతర నియోజకవర్గాలపైనా దృష్టి సారిస్తున్నారు. సంబంధిత జిల్లా మంత్రుల ద్వారా అసమ్మతి నేతలను పిలిపించి వారి మనోగతాన్ని, ఇబ్బందులను తెలుసుకుని పరిష్కరించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడే నాటికి పార్టీలో అంతర్గత అసమ్మతికి చెక్ పెట్టడం ద్వారా బీఆర్ఎస్ యంత్రాంగాన్ని ఏకతాటిపైకి తేవడం లక్ష్యంగా కేటీఆర్ కార్యాచరణను అమలు చేస్తున్నారు.

## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయకుంటే సహించేది లేదు

**రెడ్డి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ హెచ్చరిక**



పంజగుట్ట(హైదరాబాద్): రెడ్డి కార్పొరేషన్ ఇప్పటికైనా ఏర్పాటు చేయకపోతే సహించేదిలేదని రెడ్డి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ హెచ్చరించింది. 2018 ఎన్నికల మేనిఫెస్టోలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నిలుపుకోవాలని డిమాండ్ చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ చైర్మన్ గోపు జైపాల్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నవల్ల సత్యనారాయణరెడ్డి, కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డిలు మాట్లాడుతూ...రెడ్డి సామాజిక వర్గంలో కూడా ఎంతోమంది పేదలున్నారని వారి అభివృద్ధి కోసం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## కేంద్రమంత్రి గడ్కరీతో సంజయ్ భేటీ

**కరీంనగర్‌కు రహదారులు, వంతెనల మంజూరుకు వినతి**



సాక్షి, న్యూఢిల్లీ: కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి నిధులతోపాటు వంతెనలు మంజూరు చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో తెలంగాణలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులతోపాటు కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చించారు. కరీంనగర్ నియోజకవర్గంలో సరైన అభివృద్ధి కోసం రహదారులను డబుల్ లేన్‌కు విస్తరించాలని, వంతెనల నిర్మాణాల మెరుగుదల కోసం సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) కింద నిధులు మంజూరు చేయాలని గడ్కరిని సంజయ్ కోరారు.

# సహపంక్తి భోజనం.. రాత్రి బస

▶ మొదటి పేజీ తరువాయి

సమర్పించి నివాళులర్పిస్తారు. తర్వాత గిరిజన సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రదర్శనలు, కళాకారులతో నృత్యాలు, పాటలు పాడించడం లాంటివి నిర్వహించనున్నారు. తండాలు, గూడేల్లోని స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ ఉద్యమకారులను సన్మానించడంతో పాటు అక్కడి గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనాలు చేయనున్నారు. భోజనాల అనంతరం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు లేదా తండా నాయకుడి ఇంట్లో నిద్రించనున్నారు. పార్టీ గిరిజనులు, ఆదివాసీల వెన్నంటే ఉంటుందని చెప్పడమే ఈ కార్యక్రమ లక్ష్యమని, అక్కడి గిరిజనులను ఆకట్టుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని కాంగ్రెస్ పార్టీ నేత ఒకరు వెల్లడించారు.

**13న గాంధీభవన్‌లో సభ: మల్లురవి**

యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) వల్ల ఆదివాసీ గిరిజనులకు తీరని నష్టం జరుగుతుందని, ఆదివాసీలను నిర్మూలించడమే లక్ష్యంగా బీజేపీ ముందుకెళుతోందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవి చెప్పారు. ఈ నెల 13న ఆదివాసీలు, గిరిజనులతో వారి సమస్యలపై గాంధీభవన్‌లో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు టి.బెల్లయ్య నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీలకు హక్కులు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని, వచ్చే ఎన్నికల తర్వాత ఏర్పడబోయే కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళుతుందని అన్నారు.

## బీఎస్పీ అధికారంలోకి వస్తే 33 జిల్లాల్లో 33 సైనిక్ స్కూళ్ల ఏర్పాటు

**ప్రతి విద్యార్థికీ ఖర్చుల కోసం ఏడాదికి రూ.7,500 ఇస్తాం**

- బీఎస్పీ విద్యార్థి మేనిఫెస్టో విడుదల చేసిన ఆర్ఎస్పీ
- హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో బహుజన విద్యార్థి భరోసా సభ



విద్యార్థి మేనిఫెస్టోను విడుదల చేస్తున్న బీఎస్పీ చీఫ్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హన్మకొండ చౌరస్తా, నయీంనగర్: వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ గెలిచి అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 33 సైనిక్ స్కూళ్లు ఏర్పాటు చేస్తామని, ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.7,500 అందిస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హామీనిచ్చారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో మంగళవారం 'బహుజన విద్యార్థి భరోసా'సభలో బీఎస్పీ విద్యార్థి మేనిఫెస్టోను విడుదల చేశారు.

**బీఎస్పీ హామీలివే...**

పూలే విద్యార్థి భరోసా పేరుతో కాలేజీ విద్యార్థులకు అన్ని ప్రభుత్వ రంగ వాహనాల్లో ప్రయాణంలో 50 శాతం రాయితీ కల్పిస్తామని తెలిపారు. ప్రతి మండలం నుంచి వంద మందికి విదేశీ విద్య అందిస్తామని, అందులో 50మంది విద్యార్థినులు ఉంటారని వెల్లడించారు. రాష్ట్రంలోని 10లక్షల మందికి ఉన్నత విద్య కల్పిస్తామని, కేజీ నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు కోడింగ్ భాష నేర్పుతామని హామీనిచ్చారు. 8నుంచి 12 తరగతి విద్యార్థులకు 4వ భాషగా కోడింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నేర్పిస్తామన్నారు. విద్యార్థి, నిరుద్యోగ ఆత్మహత్యలు లేకుండా కార్యాచరణ రూపొందిస్తామని, విద్యార్థులకు ఉద్యోగాలు రాకపోతే కాంట్రాక్టర్లను చేస్తామని వాగ్దానం చేశారు. శ్రీకాంతాచారి పేరు తో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, పేపర్ లీకేజీలు లేకుండా చర్యలు చేపడతామని, పూర్ణ, ఆనంద్ క్రీడా స్ఫూర్తితో ప్రతి జిల్లాలో అంతర్జాతీ య ప్రమాణాలతో క్రీడా స్టేడియాలను నిర్మిస్తామని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. అసెంబ్లీ జరుగుతుండగా గద్దర్ మరణ వార్త తెలిసినా సీఎం కేసీఆర్ కనీసంగా స్పందించలేదని, సంతాప తీర్మానం చేయలేదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు.

# కేసీఆర్ కుటుంబం అనుభవిస్తున్నదంతా.. కాంగ్రెస్ పెట్టిన భిక్షే

- ఆ పార్టీని అడ్డం పెట్టుకొని రాష్ట్ర, కేంద్ర పదవులు పొందలేదా.?
- కేసీఆర్‌కు రాజకీయ సమాధి కట్టడమే నా లక్ష్యం... ఇదే నా శపథం
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధ్వజం



సాక్షి, న్యూఢిల్లీ: సీఎం కేసీఆర్ కుటుంబం ఇప్పుడు అనుభవిస్తున్నదంతా కాంగ్రెస్ పార్టీ భిక్షనే.. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ చేరదీయకుంటే కేసీఆర్ సహా ఆయన కుటుంబం మొత్తం ఇప్పుడు బిచ్చమెత్తుకుంటూ ఉండేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు. అధికారం కోసం పొత్తులు పెట్టుకొని కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రి పదవులు పొందలేదా..? 1996లో టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణకు వ్యతిరేకంగా 610 జీవో పై, జోనల్ విధానం రద్దు చేయాలని మాట్లాడిన విషయం కేసీఆర్ మరిచిపోయారా..? అని ప్రశ్నించారు. తెలంగాణకు కేసీఆర్ చేసిన ద్రోహంపై చర్చించేందుకు అమరవీరుల స్థూపం వద్ద చర్చకు తాను సిద్ధమని తాను వస్తారో, కేటీఆర్‌ను పంపుతారో హరీశ్‌ను పంపుతారో తేల్చుకోవాలని సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఢిల్లీలోని తన నివాసంలో మంగళవారం రేవంత్ మీడియాతో మాట్లాడారు.

**తెలంగాణ కోసం నిలబడ్డా**

తెలంగాణ ఉద్యమానికి రేవంత్‌కు సంబంధంలేదంటూ ఎలా అంటారని, తానెప్పుడూ తెలంగాణకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. చంద్రబాబుతో ఉన్నా తెలంగాణ కోసం నిఖార్సుగా నిలబడ్డానని రేవంత్ తెలిపారు. తను తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన మాటలు ఉంటే బయటపెట్టాలని సీఎం కేసీఆర్, కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్‌ను నమ్మి వచ్చిన విజయశాంతి, ఆలె నరేంద్ర సహా అనేక మందిని మోసం చేసిన సంగతి మరిచిపోయావా? అని ప్రశ్నించారు. తెలంగాణ ద్రోహులతో అంటకాగిన కేసీఆర్ లాంటి వ్యక్తి మరొకరు పుట్టరన్నారు. కేసీఆర్ రాజీనామా చేసిన ప్రతీసారి ఎలక్షన్.. కలెక్షన్.. సెలెక్షన్ అనే విధానంతోనే ముందుకు వెళ్లారని విమర్శించారు.

**లిక్కర్, నిక్కర్ పార్టీలకు ధీటుగా..**

లిక్కర్ పార్టీ, నిక్కర్ పార్టీ ఒక్కటై చేస్తున్న యుద్ధాన్ని కాంగ్రెస్ ధీటుగా ఎదుర్కొంటుందని బీఆర్ఎస్, బీజేపీలనుద్దేశించి వ్యాఖ్యానించారు. ఆ రెండు పార్టీలతో యుద్ధం వ్యూహాత్మకంగా చేయాలని గద్దర్ తన చివరి రోజుల్లో తనకు సూచించారని రేవంత్ తెలిపారు.

**బట్టలతో తిరిగి వెళ్లేవారా?**

గద్దర్ మరణాన్ని రాజకీయం చేయొద్దనే తాము విజ్ఞత ప్రదర్శించామనీ అందుకే కేసీఆర్‌కు బట్టలు, కేటీఆర్‌కు డ్రాయర్ మిగిలాయని రేవంత్ వ్యాఖ్యానించారు. తెలంగాణ సమాజం కోసం అహర్నిశలు పరితపించిన గద్దర్ మరణ వార్త తెలిసినా అసెంబ్లీలో సీఎం కేసీఆర్ నివాళులు అర్పించలేదన్నారు. గద్దర్ అంత్యక్రియలను సైతం ప్రభుత్వ లాంఛనాలతో ఇష్టంతో చేయలేదనీ.. ప్రజలకు భయపడి చేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి పిండం పెట్టడం... కేసీఆర్‌కు రాజకీయ సమాధి కట్టడమే తన లక్ష్యమని... ఇదే తన శపథమని రేవంత్‌రెడ్డి తెలిపారు. కేటీఆర్‌కు ఫామ్‌హౌజ్‌తో, డ్రగ్స్‌తో, ఓ హీరోయిన్‌తో సంబంధం లేకుంటే తను మాట్లాడకుండా ఉండాలని కోరుతూ ఎందుకు హైకోర్టుకు ఎందుకు వెళ్లారో చెప్పాలని రేవంత్ నిలదీశారు.

## 53.98 లక్షల ఇళ్లకు నల్లాలు: నీతి అయోగ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం గ్రామీణ ప్రాంతాల్లోని 53.98 లక్షల గృహాలకు నల్లాలు(ట్యాప్)ల ద్వారా రక్షిత మంచినీరు సరఫరా అవుతోందని నీతి అయోగ్ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం 15 ఆగస్టు 2019లో ప్రవేశపెట్టిన జల్ జీవన్ మిషన్‌కు ముందు తెలంగాణలో కేవలం 15.98 లక్షల గృహాలకు(29.05%) మాత్రమే తాగునీటి సరఫరా జరిగేదని వెల్లడించింది. ఆ తరువాతనే వేగం పుంజుకున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఒక పరిశోధనా పత్రాన్ని ఫ్యాక్ట్‌షీట్ పేరిట వెల్లడించింది. ఆగస్టు 11 నాటికి వంద శాతం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుందని పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా నీటి సరఫరాను పరీక్షించడానికి 76 లేబరేటరీలు ఏర్పాటు చేశారని వివరించింది. ప్రజలు ఏ క్షణమైనా ఈ లేబరేటరీల్లో నీటి నాణ్యత పరీక్షలు చేసుకోవచ్చని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం 2024 నాటికి దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని గృహాలకు సురక్షిత తాగునీటి సరఫరా అందించాలని లక్ష్యంగా పెట్టుకుందని వివరించింది. ఈ మేరకు 2019 ఆగస్టు 15న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రకటనను గుర్తు చేసింది. దేశ వ్యాప్తంగా రూ.3.60 లక్షల కోట్లతో ఈ తాగునీటి పథకాన్ని ప్రారంభించినట్లు నీతి అయోగ్ వివరించింది.

## వైద్య విధాన పరిషత్‌లో 3,124 కాంట్రాక్టు ఉద్యోగాలు

**ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ**

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో 3,124 మందిని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, మినిమం టైం స్కేల్ పద్ధతుల్లో నియమించేందుకు ఆర్థిక శాఖ అనుమతి జారీచేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు వీరి సర్వీసులను వినియోగించుకునేందుకు అనుమతినిస్తున్నట్లు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం 968 మందిని కాంట్రాక్టు, 2,029 మందిని ఔట్‌సోర్సింగ్, 127 మందిని మినిమం టైం స్కేల్ పద్ధతిలో నియమించుకునే అధికారం వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు ఇచ్చారు. ఇందులో సెక్యూరిటీ గార్డులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీస్ సబార్డినేట్‌లు, డార్క్ రూం అసిస్టెంట్లు, ఎక్స్‌రే అటెండెంట్ల నుంచి సివిల్ అసిస్టెంట్ సర్జన్ల వరకు ఉన్నారు.





నీ అహాన్ని వదులుగా ఉండే దుస్తుల్లా ధరించు.
– బౌద్ధ ధర్మం



సాక్షి
బుధవారం, 9 ఆగస్టు 2023

# భద్రత ఉన్నట్టేనా?

చిరకాలంగా చెబుతున్న, వింటున్న మాట ఇప్పుడు కార్యరూపంలోకి వస్తోంది. ఐరాసలోని 194 దేశాల్లో దాదాపు 137 దేశాల తర్వాత ఎట్టకేలకు భారత్ సైతం వ్యక్తిగత డిజిటల్ డేటా భద్రత (డీపీడీపీ) చట్టాన్ని తీసుకొచ్చే ఘట్టంలో చివరి మజిలీకి చేరుకుంది. అయిదేళ్ళలో అనేక ముసాయిదాలు, మార్పులు చేర్పుల తర్వాత తాజా డీపీడీపీ బిల్లు – 2023ను లోక్‌సభ సోమవారం ఆమోదించింది. ఇంతకాలంగా డేటా భద్రత విషయంలో సరైన చట్టం, వ్యవస్థ లేని భారత్ ఆ లోటును ఇక పూరిస్తోంది. అయితే కేంద్ర ప్రభుత్వానికి మినహాయింపులపై గత నవంబర్ నాటి ప్రతిపాదిత బిల్లులోనే నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేసినా, అవే అంశాలు కొత్త బిల్లులోనూ చోటుచేసుకోవడం విడ్డూరం. ప్రైవేట్ సంస్థలు వ్యక్తుల డేటా నిర్వహణలో పాటించాల్సిన అంశాలపై కఠినమైన అంశాలు పొందుపరిచిన ఈ బిల్లులో అసలంటూ కొంత మంచి ఉన్నా, కేంద్రానికి తిరుగులేని సెన్సార్ అధికారాలు దఖలు చేయడం లాంటి చెడూ చోటుచేసుకోవడమే విషాదం.

పౌరులకు వ్యక్తిగత గోప్యత హక్కు ఉందంటూ తొమ్మిది మంది సుప్రీమ్ కోర్ట్ న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 2017లోనే నొక్కిచెప్పింది. అది అంతర్జాతీయ ప్రమాణంగా నిలిచి, డిజిటల్ యుగంలో గోప్యత హక్కుకు తలెత్తిన సవాళ్ళను ముందుకు తెచ్చింది. ఈ హక్కుపై జరిగిన విస్తృత చర్చ ప్రతిఫలమే తాజా డీపీడీపీ బిల్లు. 2017లోనే కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ఓ నిపుణుల సంఘాన్ని నియమించింది. తర్వాత 2021 డిసెంబర్‌లో 'డేటా భద్రత బిల్లు' (డీపీబీ) విడుదలైంది. అనేక అభ్యంతరాలు రావడంతో 2022 ఆగస్టులో కేంద్ర ఐటీ మంత్రి పార్లమెంట్‌లో ఆ బిల్లును ఉపసంహరించుకొని, నవంబర్‌లో 'డీపీడీపీ' ముసాయిదాను పౌరసమాజ సంప్రతింపులకు ఉంచారు. గమ్మత్తేమిటంటే, జనాభిప్రాయాలను ప్రభుత్వం బహిర్గతం చేయలేదు సరికదా సమాచార హక్కు చట్టం కింద కోరినా తోసిపుచ్చింది. తీరా ఏడాది తర్వాత ఏ ప్రాతిపదికన కొత్తగా మార్పుచేర్పులు చేశామన్నది చెప్పకుండానే పాలకులు 2023 డీపీడీపీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. లోక్‌సభలో మెజారిటీ ఉంది గనక సులభంగా ఆమోదమూ పొందారు.

వ్యక్తిగత డేటాను ఇతరులు యథేచ్ఛగా వాడే వీలులేకుండా చూడడం ఈ బిల్లు ప్రధానోద్దేశం. తీరా బిల్లు చూస్తే, అసలు ఆ భద్రత విషయంలోనే రాజీ పడ్డారనిపిస్తుంది. కార్పొరేట్లు గనక సున్నితమైన డేటాపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, ఇప్పటి దాకా ఐటీ చట్టం కింద వారు బాధితులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉండేది. తీరా ఇప్పుడీ బిల్లులోని ఓ క్లాజు వల్ల ఆ ఊరట కూడా బాధితుడికి లేకుండా పోతోంది. ఇంకా విచిత్రమేమంటే, డేటా భద్రతకు భంగం కలిగిందని వీధికెక్కినవారిపైనే జరిమానా వేయచ్చు. పస లేని ఆరోపణ చేస్తే రూ. 10 వేల దాకా జుల్మానా వేయవచ్చు. ఫిర్యాదు చేయదలచిన వారికి ఇదో అడ్డంకి. నిజానికి, డేటా ఉల్లంఘనలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఈ ఏడాది జూన్‌లో కోవిన్ పోర్టల్ నుంచి టీకాలేసుకున్న వారి వ్యక్తిగత వివరాలు టెలిగ్రామ్ యాప్‌లో దర్శనమిచ్చాయి. అలాగే, జూలైలో 12 వేల మంది బ్యాంక్ ఉద్యోగుల గోప్యమైన రికార్డులూ టెలిగ్రామ్‌లో తిరిగాయి. ఇంత జరుగుతున్నా ప్రభుత్వానికీ, అధికారులకూ ఈ డేటా వినియోగం, ఉల్లంఘనల్లో అయిదు అంశాల ప్రాతిపదికన ఈ బిల్లులో మినహాయింపులు దక్కాయి. మునుపటి బిల్లులోనూ మినహాయింపులున్నా తాజా బిల్లులో వాటిని విస్తరించడం గమనార్హం.

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్టు... దాదాపు రెండు దశాబ్దాల క్రితం 2005లో వచ్చిన సమాచార హక్కు చట్టానికి ఈ కొత్త బిల్లులోని అంశాలు తూట్లు పొడిచే ప్రమాదం ఉందనేది ఒక విశ్లేషణ. పౌరుల గోప్యత హక్కును కాపాడడం మాట దేవుడెరుగు, సమాచార హక్కును ఇది నీరు గారుస్తోందని విమర్శకుల మాట. ఈ డీపీడీపీ బిల్లు దెబ్బతో ప్రభుత్వం నుంచి సమాచార సేకరణలో పారదర్శకత తగ్గిపోయి, ప్రభుత్వ – ప్రైవేట్ సంస్థల ప్రయోజనాలకు ప్రజల డేటా మరింత పారదర్శకమవుతుందనేది వారి అభిప్రాయం. అలాగే, వ్యక్తిగత డేటాకూ, సున్నితమైన వ్యక్తిగత డేటాకూ మధ్య తేడాను సైతం ఈ బిల్లు గుర్తించకపోవడంతో సున్నితమైన డేటాకు అదనపు భద్రత లేకుండా పోతోంది. ఇక, సమాచారాన్ని సృష్టించే జనరేటివ్ కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీకి సంబంధించిన నియంత్రణల ఊసు ఈ బిల్లులో లేదు. వ్యక్తిగత గోప్యతకు సంబంధించి చట్టం తేవడానికే సుదీర్ఘకాలం తీసుకున్న మన ప్రభుత్వాలు ఏఐ విషయంలోనూ అదే పద్ధతి అవలంబిస్తే కష్టమే. కాబట్టి, ఏఐ నియమ నిబంధనల రూపకల్పనకు తక్షణం నడుం బిగించాల్సి ఉంది.

డేటా భద్రత బిల్లు కింద ఏర్పాటుచేసే 'డేటా ప్రొటెక్షన్ బోర్డ్' సైతం వట్టి పర్యవేక్షక సంస్థ. అదీ పూర్తిగా ప్రభుత్వ అజమాయిషీ కిందే నడుస్తుంది. ఛైర్మన్ సహా సభ్యులందరినీ కేంద్రమే నియమిస్తుంది. వెరసి, పాలకుల చేతిలో కీలుబొమ్మగా బోర్డు స్వతంత్రత, అధికారాలు అన్నీ పరిమితమే. తద్విరుద్ధంగా యూరప్ వగైరాల్లో డేటా భద్రత చట్టాలు, దాని కావలి సంస్థలు బలంగా ఉన్నాయి. ఫ్రాన్స్‌లో అంగీకార విధానాల్ని ఉల్లంఘించినందుకు గూగుల్‌పై అక్కడి కావలి సంస్థ 5 కోట్ల యూరోల జరిమానా వేయగలగడమే నిదర్శనం. డేటా భద్రతకు మించిన అసలు సమస్య... విచ్చలవిడిగా సాగుతున్న డేటా సేకరణను అరికట్టడం! అంతర్జాతీయ నిపుణుల మాట సైతం అదే. మన దేశంలోని ఈ ప్రబల సమస్యపై ఇప్పటికీ చర్చే జరగకపోవడం విషాదం. అలాగే, అవగాహన, డిజిటల్ అక్షరాస్యత అంతంత మాత్రమైన దేశంలో, ఊపిరి సలపని పనిభారమున్న న్యాయవ్యవస్థ మధ్య నిజంగా గోప్యతకు హాని కలిగినా ఈ బిల్లుతో పౌరులు న్యాయం పొందగలరా?

# మనుగడకు మరపు మంచిదే!

విశ్లేషణ



ఎం. రాజీవ్ లోచన్

**దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఏమిటంటే... మతం పేరుతో రెచ్చగొట్టేవారు, లేదా ఒక మతానికి చెందినవారికి అన్యాయం జరుగుతోందని వాదించేవారు మాత్రమే కనిపిస్తున్నారు. ఒక మతానికి సంబంధించిన చెడును కప్పిపెట్టేందుకు, లేదా ఇంకో మతంలోని చెడును ఎత్తిచూపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనివల్ల ఫలితం శూన్యం. కొన్ని తప్పులను కప్పిపుచ్చే ప్రయత్నంలో చరిత్ర పుస్తకాలను తిరగరాయడం, లేదంటే ఎక్కువ చేసి చూపడం వల్ల ఒరిగేది ఏమీ లేదు. ఊహించుకున్న తప్పులను మళ్లీ మళ్లీ తవ్వుకోవాలనుకునేవారు... మునుపటి తరాల తాలూకు కక్షలను కొనసాగించే అవకాశాలే ఎక్కువ. గతంలోని కొన్ని గుర్తుంచుకోవడం, కొన్నింటిని వదిలేయడం ద్వారా మాత్రమే దేశాల నిర్మాణం జరుగుతుంది.**

హరియాణాలోని మేవాత్, నూహ్‌లో జరుగుతున్న ఘర్షణలు చూస్తుంటే... పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి ప్రతాప్ సింగ్ ఖైరాన్ గుర్తుకొస్తారు. 1950లలో ఖైరాన్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. పాకిస్తాన్ నుంచి వస్తున్న ముస్లిం కుటుంబాలను మేవాత్‌లోకి రానివ్వమని సూచనప్రాయంగా చెప్పిన వారిని ఉద్దేశిస్తూ చేసిన హెచ్చరిక అది. దేశ విభజన నేపథ్యంలో ఈ కుటుంబాలు పాక్‌కు వెళ్లాయి. 1950ల మధ్య కాలానికి చాలామంది మళ్లీ తమ స్వస్థలాలకు వచ్చేశారు. వేలమంది మేవాతీ ముస్లిం కుటుంబాలకు తమ సొంత ఆస్తులు మళ్లీ దక్కేలా ఖైరాన్ చర్యలు తీసుకున్నారు. "గతం తాలూకు శత్రుత్వాన్ని మరచిపోండి. మీ బాధలపై ఆధారపడి బతక్కండి" అని విభజన కారణంగా చెలరేగిన విద్వేష బాధితులైన సిక్కులు, హిందువులకు ఖైరాన్ పదే పదే చెప్పేవారు.

కొన్ని గుర్తుంచుకోవడం, కొన్నింటిని వదిలేయడం ద్వారా మాత్రమే దేశాల నిర్మాణం జరుగుతుంది. గతాన్ని గుర్తుంచుకోలేని వారు ఆధారం లేనివారవుతారు. బానిస బతుకులు బతికినవారు కూడా ఉజ్వల భవిష్యత్తును కాంక్షించే సందర్భంలో తమ మూలాలను తరచిచూస్తారు. లేదంటే మూలాలను కల్పించుకుంటారు. అదే సమయంలో గతాన్ని ఏమాత్రం మరచిపోనివారు లేదా ఊహించుకున్న తప్పులను మళ్లీ మళ్లీ తవ్వుకోవాలనుకునేవారు... మునుపటి తరాల తాలూకూ కక్షలను కొనసాగించే అవకాశాలే ఎక్కువ.

మన పాత తరాలు నిర్దిష్ట సామాజిక కూర్పుల్లో బతికాయి. ఈ కూర్పులు సాధారణంగా చాలా చిన్నస్థాయిలో ఉండేవి. ముఖాముఖి పరిచయాలు, ఒకరంటే ఇంకొకరికి నమ్మకం వంటివి ఈ కూర్పు తాలూకూ లక్షణాలు. చాలా ప్రాథమిక గుర్తింపుల ఆధారంగా ఈ నిర్మాణం జరిగింది. ఈ కూర్పులో లేనివారితో వ్యవహారం ప్రమాదకరమన్నది వారి అవగాహన. రూపురేఖల్లేని ఆధునికత అస్తిత్వంలోకి రావడంతో ఈ అవగాహనలన్నీ మారిపోయాయి.

ఇద్దరు వ్యక్తుల మధ్య ఒక బంధం ఏర్పడేందుకు చాలా సులువైన మార్గం ముఖాముఖి మాటలు, వ్యవహారాలే. ఇలాంటి బంధాలు, తద్వారా ఏర్పడ్డ సామాజిక వర్గాలు సహజంగానే చిన్న సమూహాలుగానే ఉంటాయి. ఇతరులపై వీరి ప్రభావమూ పెద్దగా కనిపించదు. అయితే జాతి, రాష్ట్రమన్న భావనలు ఆవిర్భవించిన తరువాత, ఆధునిక సమాజం తన మునుపటి దానికంటే విస్తృత స్థాయికి చేరేందుకు అవకాశం కల్పించిన ప్రాథమిక బంధాల విలువ తగ్గిపోయింది.

ఆధునిక ప్రపంచ చరిత్ర మొత్తం గతకాలపు అస్తిత్వాలను అణచిపెట్టడం, రూపురేఖల్లేని వ్యవస్థల నిర్మాణమనే చెప్పాలి. ఈ వ్యవస్థలే వ్యక్తులు తమ ప్రాథమిక అస్తిత్వాల బంధాలను తెంచుకుని స్వేచ్ఛగా ఉండేందుకు వీలు కల్పించాయి. అలాగే పాతకాలపు సామాజిక కట్టుబాట్లు మనుషులను తమ బానిసలుగా చేసుకోకుండా నిలువరించాయి. ఈ వ్యవస్థలన్నింటికీ ఆధారం 'నేషన్ స్టేట్'. (క్లుప్తత కోసం ప్రభుత్వం అనుకుందాం.) పాతకాలపు సామాజిక ఏర్పాట్లకు కాకుండా ప్రభుత్వ వ్యవస్థకు లొంగిన వ్యక్తులు నేషన్ స్టేట్‌లో ప్రాథమిక భాగస్వాములు. బల ప్రయోగంతో నేషన్ స్టేట్‌ను ఏర్పాటు చేయడం అసాధ్యం.



ఇది మనదన్న భావన కల్పించడం బలం వల్ల సాధ్యం కాదు. సహజసిద్ధంగా మనుషుల అంతరాంతరాళాల నుంచి పుట్టుకు రావాల్సిన ఫీలింగ్ అది. ఆసక్తికరమైన ఇంకో విషయం ఏమిటంటే, నేషన్ స్టేట్‌కు, వ్యక్తికి మధ్య బంధం బలపడటంలో వ్యక్తులు కనుమరుగు అవుతారన్న భయముంటుంది. ఈ భయంతోనే చాలామంది ఉదారవాదులు కూడా అందరి మంచిని పణంగా పెట్టి మరీ పాత కాలపు సామాజిక కూర్పులవైపు మొగ్గు చూపుతూంటారు. పాతకాలపు సామాజిక ఏర్పాట్లలో శక్తిమంతమైనది మతం అన్నది మరచిపోరాదు.

ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు వ్యవస్థీకృతమైన మతం ఉపయోగపడుతుంది. ఒక పరమార్థం, ఒక నమ్మకాన్ని కూడా ప్రజలకు ఇచ్చే మతం ఎప్పుడూ ప్రభుత్వం తదితర వ్యవస్థలకు గట్టి పోటీదారు. భారత్‌లో ప్రభుత్వ వ్యవస్థలకు సవాళ్లు రాజకీయపరమైన ఇస్లాంతో ముడిపడి ఉన్నాయి. ఇరవయ్యవ శతాబ్దపు తొలినాళ్లలో దేశంలోని ఇస్లామిస్టులు స్వయం పాలన పొందాలంటే అమెరికా సంయుక్త రాష్ట్రాల మాదిరిగానే మతం ఆధారంగా దేశాల నిర్మాణం జరగాలని కాంక్షించారు. ఇస్లాం పవిత్ర గ్రంథం ఖురాన్‌ను అసలు చదవనే లేదని గర్వంగా చెప్పుకొనే మౌలానా మొహమ్మద్ అలీ 'ద కామ్రేడ్' వార్తా పత్రికలో ఒక కథనం రాస్తూ ఇదే అంశాన్ని ప్రతిపాదించారు. అయితే ఇది దేశ విభజనకు దారితీసే స్థాయిలో ముస్లింలలో వేర్పాటువాదాన్ని సృష్టిస్తుందని ఆయన ఊహించలేకపోయారు.

వాస్తవం ఏమిటంటే, భారత్‌లో ఇష్టమైన మతాన్ని ఆచరించే స్వేచ్ఛపై ఎప్పుడూ నియంత్రణ లేదు. విభజన ఘర్షణల తరువాత కూడా రాజ్యాంగ మండలి చర్చల్లో మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రశ్న ఉత్పన్నమైనప్పుడు దేశం అందరిదీ కాబట్టి మత స్వేచ్ఛ కూడా దానంతట అదే వచ్చినట్లేనని అనుకున్నారు. మత ప్రచారమన్న విషయానికి వస్తే మండలి సభ్యులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. హిందూ మతంలో మతమార్పిడన్న భావన లేదనీ, మత ప్రచారానికి అనుమతిస్తే హిందూమతం అంతమైపోతుందనీ వాదించారు. దీనిపై ఇతర సభ్యులు పాకిస్తాన్ ఏర్పాటును ఉదాహరణగా చూపుతూ, ఇండియాలో ముస్లింలకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయ సంస్కృతి, వారసత్వంపై ఉన్న అపోహలను తొలగించాలంటే మత ప్రచార హక్కును కల్పించవచ్చునని అభిప్రాయపడ్డారు. చివరకు ఇదే కార్యాచరణకు వచ్చింది.

దేశంలో ప్రస్తుతం, మతం పేరుతో రెచ్చ గొట్టేవారు లేదా ఒక మతానికి చెందినవారికి అన్యాయం జరుగుతోందని వాదించేవారు మాత్రమే కనిపిస్తున్నారు. ఒక మతానికి సంబంధించిన చెడును కప్పిపెట్టేందుకు లేదా ఇంకో మతంలోని చెడును ఎత్తి చూపేందుకు ప్రయత్నాలు జరిగాయి. కొన్ని తప్పులను కప్పిపుచ్చే ప్రయత్నంలో చరిత్ర పుస్తకాలను తిరగరాయడం లేదా ఎక్కువ చేసి చూపడం వల్ల ఒరిగిందేమీ లేదు. ఒక్కసారి ప్రజలు నిర్ణయించుకుంటే... వాస్తవాలను మరుగున బెట్టి లేదా అబద్ధాలు చెప్పడం ద్వారా వారిని మార్చలేము.

ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం యూరప్ చరిత్రను అర్థం చేసుకుని భారతదేశం కొన్ని పాఠాలు నేర్చుకోవాలి. దేశంలోని వైవిధ్యతపై విపరీతమైన నిబద్ధత కలిగి ఉండటం గురించి ముందుగా అర్థం చేసుకోవడం మంచిది. వైవిధ్యత మనకు మాత్రమే సొంతమని అనుకుంటూ ఉంటాం. కానీ చరిత్ర మొత్తమ్మీద ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ ఈ వైవిధ్యత ఉందన్నది మరచిపోతూంటాం. మనకు ఇది నమ్మబుద్ధి కాకపోవచ్చు. కానీ యూరప్‌లో చాలా శతాబ్దాలపాటు తమ మతగ్రంథాలను సొంతంగా చదివే స్వేచ్ఛ ఉండాలా, వద్దా? అన్న విషయంపైనే గొడవలు జరిగేవి. మతగురువులు మత గ్రంథాలపై ఇచ్చే వివరణ సరిపోతుందన్నది ఒక వర్గం వాదన. ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకోవడం, సమాజ స్థాయి విస్తరించడంతో యూరోపియన్లు ఇలాంటి గొడవల నుంచి దూరం జరిగేందుకు కొన్ని దారులు వెతుక్కున్నారు. మరి యుగాల కాలం కొనసాగిన పగలేమయ్యాయి? ఒక వర్గం మరోదానిపై చేసిన చారిత్రక తప్పిదాల మాటేమిటి? ఆధునిక దేశం ఒకటి ఏర్పడిన తరువాత వాటన్నింటిని పట్టించుకోలేదు లేదా మరచిపోయారు. ఇలా అన్ని తెలిసి కూడా వాటిని మరచిపోవడం లేకపోతే ఇరు వర్గాలకు అనువైన మార్గంలో ముందుకు పోయేందుకు మరో దారి లేనేలేదు!

వ్యాసకర్త చరిత్రకారులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### వెన్ను విరగనుంది!



భారత ప్రభుత్వం ఈశాన్యంలోని మణిపూర్‌లో జరుగుతున్న మాదక ద్రవ్యాల వ్యాపారపు వెన్ను విరుస్తుందని నేను ఏ సంకోచం లేకుండా చెప్పగలను. అఫ్గానిస్తాన్‌కు ప్రత్యామ్నాయం కోసం వెతుకుతున్న రాజకీయ నేతలు, తీవ్ర వాదులు, విదేశీ శక్తులు ఎవరైనా సరే దాని పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

– సేవియో రోడ్రిగ్స్, సంపాదకుడు

### ఇదొక అపవాదు



నిజంగానే భారత ప్రభుత్వం మణిపుర్‌లో మాదక ద్రవ్యాల వ్యాపారాన్ని సాగనీయదలుచుకోకపోతే, ఆ వ్యాపారంలో ఉన్నవారికి పోషకుడిగా ఉన్న ముఖ్యమంత్రి ఇంకా ఎందుకు పదవిలో ఉన్నట్టు? డ్రగ్స్ పేరుతో ఒక మైనారిటీ తెగను పరిహాసం చేయడం తగదు.

– లాల్మిన్ కిప్‌జెన్, పోస్ట్ డాక్టోరల్ ఫెలో

### బుల్‌డోజర్ న్యాయమా?



ఇంతకు ముందు ఏ ప్రభుత్వమైనా 'జాతులను నిర్మూలిస్తున్న దన్న' అపవాదును కోర్టుల ద్వారా ఎదుర్కొన్నదా? బుల్ డోజర్ల ద్వారా ఇళ్లను కూల్చడాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకుంటున్న తమ అక్రమ విధానం గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించుకోవాలి.

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

### నిజాలు తేలాలి!



సుప్రీంకోర్టుకు తగిన ప్రశంసనీయ అసమ్మతిని చూపుతూ కశ్మీరీ హిందువుల మారణకాండ కేసులను తిరిగి తెరవాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. యాసీన్ మాలిక్ గ్రూపు క్రూరంగా చంపిన న్యాయమూర్తి నీల్‌కంఠ్ గంజ్ కేసు మొదటిది.

– ఆనంద్ రంగనాథన్, 'స్వరాజ్య' సంపాదకవర్గం

### భయపెడుతున్నారు...



నేను 'మహమ్మారులను' ఎందుకు ప్రశ్నిస్తున్నానని కొందరు అడుగుతున్నారు. నిజంగా ప్రాణాంతకమైతే, అది వ్యాపించదు (చనిపోయినవాళ్లు వ్యాపింపజేయరు). వేగంగా వ్యాపిస్తున్నదంటే, అది ప్రాణాంతకం కాదు.

– అస్మాద్ మాలిక్, సర్జన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

# స్వయంపాలన హక్కే మేలు!

'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం' సందర్భంగా ఆదివాసీలందరూ సమైక్యంగా స్వయం పాలన సాధనకై నినదించాలి. ఆదివాసీ పోరాటాల ఫలితంగా ఐక్యరాజ్య సమితి 1994 ఆగస్టు 9న 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం' జరపాలని పిలుపునివ్వాల్సి వచ్చింది. దీనికి భారతదేశ ఆమోదం, అంగీకారం ఉంది. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కానీ, ఆచరణలో భారత దేశం అధికారికంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరపలేదు. ఆదివాసీలకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, ఆదివాసీ చట్టాలైన 1/70, పీసా, అటవీ హక్కుల చట్టం సరిగా అమలు చేయటం లేదు. ప్రస్తుత బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్రం, తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు మరీ బరితెగించి గిరిజనులను అడవుల రక్షణ పేరిట, అడవుల పెంపకం, 'హరితహారం' పేరిట అడవుల నుండి గెంటి వేయాలని ప్రయత్నిస్తున్నాయి. పార్లమెంట్‌లో పాత అటవీచట్టానికి(1980) సవరణ చేస్తూ బిల్లును ఆమోదింపజేశారు. ఇది అటవీ నివాసులందరి ఉనికికే ప్రమాదం. వీరి స్థానాన్ని కార్పొరేటు కంపెనీలకు పాలకులు కట్టబెట్టనున్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో సాగులో ఉన్న పోడు భూములన్నిటికీ అటవీ నివాసులైన వారందరికీ అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలివ్వలేదు. ఆదివాసీలందరికీ కూడా పూర్తి స్థాయిలో పట్టాలివ్వలేదు. దీనితో ఏ ఒక్క పోడు సాగుదారుడు సంతృప్తిగా లేడు. ఇకనైనా ఆదివాసీ చట్టాల అమలు చేస్తారనే గ్యారంటీ లేదు. ఇప్పటికే జీవో నెం. 3ని రద్దు చేసి ఆదివాసీ యువతీ యువకులకు తీరని అన్యాయం చేశారు.

ప్రభుత్వాలు ఆదివాసీ గిరిజన వ్యతిరేక విధానాలు విడనాడాలి. ఆదివాసీ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు రక్షించాలి. పీసా చట్టం, 1/70 రెగ్యులేషన్, అటవీ హక్కుల చట్టం– 2006ను సమగ్రంగా అమలు చేయాలి. జీవో నం.3ని పునరుద్ధరించాలి. విద్యావంతులైన ఆదివాసీ గిరిజన యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించాలి, అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు సాగుదార్లందరికీ 10 ఎకరాల వరకు పట్టాలివ్వాలి. పోడు సాగుదార్లపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలి. సర్వే చేయని పోడు భూములన్నింటినీ సర్వే చేయాలి. ఆదివాసీ గిరిజనుల విద్య, వైద్యం, ఉపాధికై అవసరమైన నిధులు పెంచి ఖర్చు పెట్టాలి. సాగునీరు, రోడ్లు, విద్యుత్, రక్షిత మంచినీరు ఇవ్వాలనీ పోరాడుతూనే రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు అమలు చేయమనీ, ఆదివాసీ గిరిజనులకు 'స్వయం పాలన' కల్పించాలనీ డిమాండ్ చేస్తూ సమైక్యంగా చైతన్యంతో పోరాడాలి. ఈ సందర్భంగా డా॥ బి. జనార్దనరావు, గుంటి రవి వంటి మేధావులు చెప్పిన విషయం ఇక్కడ గమనార్హం:

"... క్రమేపి ఆదివాసులు తమ పాలనా పరిణితిని సాధించుకోగలిగిన సందర్భంలో ఆయా కేంద్ర ప్రకటిత స్వయంపాలిత ప్రాంతాలే పూర్తిస్థాయి రాష్ట్రములుగా ఏర్పడుటకు కూడా 6వ షెడ్యూల్ వీలు కల్పిస్తుంది. ఫలితంగా కనీసం కొంత మేరకైనా 'ఆదివాసీ అనుకూల పాలనా న్యాయం' జరిగేందుకు వీలుంది." ఈశాన్య రాష్ట్రాల్లో కొంతమేరకు ఈ వ్యవస్థ ఉండటం మూలాన ఆదివాసుల జీవన ప్రమాణం దిగజారలేదు.

– కెచ్చెల రంగారెడ్డి, సీపీఐ (ఎమ్ఎల్) ప్రజాపంథా తెలంగాణ కమిటీ సభ్యులు
(నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం)

# సామాజిక మాధ్యమాలను వాడే తీరు ఇదేనా?

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

'నిజం చెప్పులు వేసుకొనేలోపు, అబద్ధం లోకాన్ని చుట్టి వస్తుంది'నేది ఓ ప్రసిద్ధమైన ప్రాచీన నానుడి. ఇందులో ఏమాత్రం అతిశయోక్తి లేదని అందుబాటులో ఉన్న సామాజిక మాధ్యమాల ప్రసారాలను పరిశీలిస్తే అర్థమవుతుంది. దాదాపు ఓ పాతికేళ్ల క్రితం ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడానికి కొంతమంది రాజకీయ నాయకులు ప్రసార మాధ్యమాలను ప్రభావితం చేస్తున్నారని ప్రముఖ రచయిత 'నామ్ చోమ్‌స్కీ' చెప్పినపుడు, అమెరికాలో అదొక సంచలనం. దానినే 'మాన్యుఫాక్చర్డ్ కన్సెంట్' అని పిలిచారు. అంటే, ప్రజలను ఒప్పించడానికి ఒక అసత్యాన్ని సత్యంగా మార్చే ప్రయత్నం అని అర్థం. ఇప్పుడు అంత ప్రయాస పడాల్సిన అవసరం లేదు. స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్ సేవలు చౌకగా అందుబాటులోకి వచ్చాక అసత్యాలు, నకిలీ సమాచారంతోపాటు సమస్త విషయాలు జనబాహుళ్యానికి క్షణాల్లో అందుబాటులోకి వచ్చేస్తున్నాయి.

ఇటీవల మణిపుర్‌లో ఇరువురు మహిళల్ని నగ్నంగా చేసి వారిని ఊరేగించి ఆపై వారిపై అత్యాచారం చేసిన దుర్ఘటన సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగు చూసి యావత్ దేశాన్ని కుదిపేసింది. ప్రజలలో ఆగ్రహం, ఆవేశం, ఆవేదన, నిస్సహాయత వంటి భావోద్వేగాలు సర్వత్రా వ్యక్తమయ్యాయి. ఆ సంఘటనలకు చలించిపోయిన ప్రధాని నరేంద్ర మోదీ ఎట్టకేలకు మౌనం వీడి బాధితులకు అండగా ఉంటామన్న హామీ ఇచ్చారు. నిజానికి, మణిపుర్‌లో జరుగుతున్న దారుణాలు బాహ్య ప్రపంచానికి తెలిశాయంటే అందుకు కారణం సామాజిక మాధ్యమాలే! అలాగని, సామాజిక మాధ్యమాల ద్వారా అందుతున్న సమాచారం అంతా పూర్తిగా నమ్మలేం. ఓ రెండేళ్ల క్రితం మయన్మార్‌లో ఓ యువతిపై జరిగిన దాడిని ఇటీవల మణిపుర్‌లో జరిగినట్లుగా సామాజిక మాధ్యమాలు ప్రచారం చేశాయి. అదేవిధంగా, కొన్నేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో ఒక నకిలీ వార్త కారణంగా ఆ రాష్ట్రంలో అల్లర్లు జరిగాయి. తమిళనాడులో బిహార్‌కు చెందిన వలస కార్మికులపై దాడులు జరిగాయని సామాజిక మాధ్యమాలలో వ్యాప్తిలోకి వచ్చిన వార్తా కథనాలు, దృశ్యాలు పూర్తిగా ఫేక్ (కల్పితం) అని తేలాయి. కానీ, ఆ లోపే జరగాల్సిన నష్టం జరిగింది.

మిగతా దేశాల మాటెలా ఉన్నా, 133 కోట్ల జనాభా గలిగిన భారత దేశంలో 75 కోట్ల స్మార్ట్ ఫోన్లు వినియోగంలో ఉన్నాయని, 80 కోట్ల మంది ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారన్న సమాచారం దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. ఇందులో 6 నుంచి 12 ఏళ్ల లోపు పిల్లలు ఉండటం మరింత ఆందోళన కలిగించే అంశం. కోవిడ్ మహమ్మారి కారణంగా అనివార్యంగా ఆన్‌లైన్ విద్యాబోధన అవసరం అయింది. దాంతో, పిల్లలకు స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లను తల్లిదండ్రులే సరఫరా చేయాల్సి వచ్చింది. స్మార్ట్ ఫోన్ల ద్వారా అన్ని రకాల సామాజిక మాధ్యమాలకు పిల్లలు చేరువయ్యారు, బాగా అలవాటుపడ్డారు. వారిలో కొందరికి ఇదొక వ్యసనంగా మారింది. 'విద్యారంగంలో సాంకేతికత' అనే పేరుతో పిల్లలకు ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు అందించడం వల్ల చదువు, సంస్కారం, వ్యక్తిత్వం నాశనం అవుతున్నాయంటూ ఇటీవల 'యునెస్కో' (ఐక్యరాజ్యసమితి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ) అందించిన 435 పేజీల నివేదిక యావత్ ప్రపంచాన్ని నివ్వెరపర్చింది. అంతేకాదు.. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ డాక్టర్ నాగేశ్వర రెడ్డి చిన్నారుల్లో మానసిక రుగ్మతలకు కారణం స్మార్ట్ ఫోన్లేనంటూ తమ అధ్యయన ఫలితాలను వెల్లడించారు. తక్షణమే స్మార్ట్ ఫోన్లను పిల్లల నుంచి దూరం చేయాలని, డిజిటల్ టెక్నాలజీ వల్ల చదువులు మెరుగుపడ్డాయని చెప్పడానికి బలమైన అధ్యయనమేదీ లేదని పేర్కొంటూనే, సామాజిక మాధ్యమాలలో వెల్లువలా వచ్చి పడుతున్న 'కంటెంట్' పసిబుర్రలను పాడు చేస్తున్నదని నిపుణులు పేర్కొంటున్నారు. ఆరంభంలో స్వేచ్ఛాయుత భావ ప్రకటనలకు ఈ సామాజిక మాధ్యమాలు వేదికలుగా ఉపయోగ పడినప్పటికీ, పోనుపోను అభ్యంతరకర దృశ్యాలు, అసత్యాలు, తప్పుడు సమాచారంతో ఇవి మానవ సంబంధాలను దెబ్బతీస్తున్నాయి. ఇదంతా నాణేనికి రెండో వైపు.



సామాజిక మాధ్యమాలను శక్తిమంతంగా తమ ఉన్నతికి ఉపయోగించుకొంటున్నవారూ గణనీయ సంఖ్యలో ఉన్నారు. భారతదేశ జనాభాలో దాదాపు 33 శాతం ప్రజలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటిల్లో ఏదో ఒకటి వాడుతున్నారని తేలింది. కరోనా సమయంలో అందుబాటులోకి వచ్చిన 'జూమ్' సమావేశాల వంటి అనుసంధాన వేదికల ద్వారా వివిధ అభిరుచులు కలిగిన వ్యక్తులు తరచుగా కలవడం, తమ అభిప్రాయాలను పంచుకోవడం, కొత్త విషయాలు తెలుసుకోవడం ఎక్కువైంది. సామాజిక మాధ్యమాల ద్వారా అభివృద్ధి చెందిన వ్యాపార లావాదేవీలను 'సోషల్ కామర్స్'గా వ్యవహరిస్తున్నారు. ఇది వేల కోట్ల రూపాయల టర్నోవర్‌కు చేరిందని అంటున్నారు. దీనిద్వారా నష్టపోతున్న వారూ ఉన్నారు. బిట్‌కాయిన్, ఆన్‌లైన్ గేమ్స్ వల్ల యువతకు ఎక్కువ నష్టం వాటిల్లిందని ఓ అంచనా.

రాజకీయ పార్టీలు తమ భావజాల వ్యాప్తికి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవడం ఎక్కువైంది. ప్రతి రాజకీయ పార్టీకి తప్పనిసరిగా సోషల్ మీడియా వింగ్ పని చేస్తోంది. ఈ విషయంలో తొలుత భారతీయ జనతా పార్టీయే తక్కిన పార్టీల కంటే ముందువరుసలో ఉంది. ప్రారంభంలో అన్ని రాజకీయ పార్టీలు సోషల్ మీడియా ద్వారా తమ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాయి. ఆ తర్వాత ప్రత్యర్థి పార్టీలపైన, ప్రత్యర్థులపైన నెగిటివ్ కాంపెయిన్ మొదలు పెట్టాయి. ఇటీవల అవి శృతి మించుతున్నాయి కూడా! ఇటీవల విదేశాంగ మంత్రి జైశంకర్ దేశ యువతకు కొందరు డబ్బులు ఎరవేసి ఉగ్రవాద ఉచ్చులోకి లాగుతున్నారనీ, అటువంటి నెట్‌వర్క్‌ను ఛేదించడం కేంద్రానికి కష్టంగా మారిందనీ చెప్పారు. అంటే, ఇది ఎంతగా వ్యవస్థీకృతం అయ్యిందో చెప్పకనే చెప్పినట్లయింది. ఇక, సైబర్ వేధింపులు, సైబర్ నేరాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

సామాజిక మాధ్యమాలు కట్టుతప్పుతున్నాయనీ, వాటిని నియంత్రించాలనీ కొందరు చేస్తున్న వాదనలో నిజం పాక్షికమే. నిజానికి కట్టుతప్పుతున్నది వ్యక్తులు, వ్యవస్థలే. 'సామాజిక మాధ్యమాలు' కేవలం సాధనాలు మాత్రమే. వీటిని నియంత్రించడం సాధ్యం కాకపోవచ్చునని డిజిటల్ రంగ నిపుణులు చెబుతున్నది ఆందోళన కలిగించే చేదు నిజం. సామాజిక మాధ్యమాలను నియంత్రించే చట్టాలు వచ్చినట్లయితే, అది అంతిమంగా ప్రజాస్వామ్యానికి కీలకమైన భావప్రకటనా స్వేచ్ఛను హరించివేస్తాయి. అది మరింత ప్రమాదకరం. ఈ రెండింటినీ దృష్టిలో పెట్టుకొని సమతుల్యత సాధించి నకిలీలు, విద్వేషాల్ని, రెచ్చగొట్టే పోస్టింగ్‌లను అరికట్టాలి. ఆ దిశగా కేంద్రం చర్యలు తీసుకోవాలి. సాంఘిక మాధ్యమాలను అసాంఘిక మాధ్యమాలుగా మార్చినట్లయితే జరిగే నష్టాన్ని పూడ్చటం ఎవరివల్లా సాధ్యం కాదు.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.అష్టమి ఉ.8.33 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** భరణి ఉ.6.55 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** సా.6.57 నుండి 8.34 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.41 నుండి 12.31 వరకు, **అమృతఘడియలు:** తె.4.32 నుండి 6.08 వరకు (తెల్లవారితే గురువారం); **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.27.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

# కమీషన్ రూ.500 పెంపు

| రేషన్ డీలర్లపై సర్కార్ వరాల జల్లు | కమీషన్‌ను మెట్రిక్ టన్నుకు రూ.900 నుంచి రూ.1,400కు పెంచుతూ నిర్ణయం | మరో 13 డిమాండ్లపైనా సానుకూల నిర్ణయం | కారుణ్య నియామకం కింద వారసులకు డీలర్‌షిప్ | రైతు, నేత, గౌడన్నల బీమా తరహాలో రూ.5 లక్షల బీమా | రాష్ట్రవ్యాప్తంగా 17,227 మంది డీలర్లకు లబ్ధి |
|---|---|---|---|---|---|

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రేషన్ డీలర్లపై ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. ముఖ్యంగా బియ్యం పంపిణీకి గాను వారికిచ్చే కమీషన్‌ను మెట్రిక్ టన్నుకు రూ.900 నుంచి రూ.1,400 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అలాగే డీలర్లు డిమాండ్ చేస్తున్న మరో 13 అంశాలపై కూడా సానుకూలంగా స్పందించింది. రేషన్ డీలర్ల సంఘం జేఏసీ ప్రతినిధులతో మంగళవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సచివాలయంలో చర్చలు జరిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు ప్రభుత్వానికి, రేషన్ డీలర్లకు ఆమోదయోగ్యమైన విధంగా కమీషన్‌ను పెంచడంతో పాటు మరో 13 డిమాండ్లను పరిష్కరిస్తున్నట్లు ఈ సందర్భంగా వారు ప్రకటించారు. కరోనా సమయంలో సేవలందిస్తూ మరణించిన 100 మంది డీలర్ల వారసులకు కారుణ్య నియామకం కింద డీలర్‌షిప్‌ను మంజూరు చేయడం, రాష్ట్రంలో అమలవుతున్న రైతు, నేత, గౌడన్నల బీమా తరహాలో రేషన్ డీలర్లకు రూ.5 లక్షల బీమా వర్తింప చేయడం, ప్రతి డీలర్‌ను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడం, వయోపరిమితి 40 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంపు తదితర 13 అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.200 గా ఉన్న డీలర్ల కమీషన్‌ను దశలవారీగా పెంచుతూ రూ.1400కు చేర్చినట్లు మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు.

**దీర్ఘకాల డిమాండ్లకు పరిష్కారం**

రాష్ట్రంలోని పేదలకు చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యానికి సంబంధించి ప్రస్తుతం డీలర్లకు మెట్రిక్ టన్నుకు రూ.900 చొప్పున కమీషన్ అందుతోంది. దీనిని పెంచాలని గత కొంతకాలంగా డీలర్లు ఆందోళన చేస్తున్నారు. గత నెలలో సమ్మెలోకి వెళ్లేందుకు కూడా ప్రయత్నించారు. అయితే మంత్రి గంగుల ఇచ్చిన హామీ మేరకు గత నెలలో బియ్యం పంపిణీ చేసిన డీలర్లు, ఈ నెలలో తమ సమస్యలు పరిష్కారమైతేనే బియ్యం పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ఉన్నారు. దీంతో ప్రభుత్వం ఈనెల 5 నుంచి ప్రారంభం కావలసిన బియ్యం పంపిణీని 10వ తేదీకి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం మంత్రులు హరీశ్, గంగులతో పాటు డిప్యూటీ స్పీకర్ పద్మారావ్ గౌడ్, రేషన్ డీలర్ల సంఘం గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి డీలర్ల జేఏసీ నేతలతో సమావేశమయ్యారు. కాగా ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రంలోని 17,227 మంది డీలర్లకు లబ్ధి చేకూరనుంది. రాష్ట్రంలో మొత్తం 90.05 లక్షల ఆహారభద్రత కార్డులు ఉన్నాయి. వాటిలో 35.56 లక్షల కార్డులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కార్డులు కాగా మిగతా 54.5 లక్షల కార్డులు కేంద్రం మంజూరు చేసినవి. ఈ కార్డులకు గాను 2.82 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రతినెలా 1.80 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.

**ప్రభుత్వంపై రూ.138.73 కోట్ల భారం**

డీలర్ల కమీషన్‌ను రూ.1,400కు పెంచడం వల్ల ప్రభుత్వంపై సంవత్సరానికి రూ.138.73 కోట్ల భారం పడనుంది. కమీషన్ మొన్నటివరకు రూ.700 ఉండగా రెండు నెలల క్రితం కేంద్రంతో జరిగిన సర్దుబాటు వల్ల రూ.200 పెంచి రూ.900 కమీషన్ ఇవ్వాలని నిర్ణయించింది. రూ.700 ఉన్నప్పుడు రూ.45.36 కోట్ల కేంద్రం వాటా పోగా, రాష్ట్రం వాటా రూ.106.33 కోట్లతో డీలర్లకు మొత్తం రూ.151.69 కోట్లు ఏటా వెచ్చించాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం కమీషన్‌ను రూ.1,400కు పెంచడంతో ఏటా మొత్తం రూ.303.38 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇందులో కేంద్రం వాటా రూ.58.32 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.245.06 కోట్లకు పెరిగింది. అంటే రూ.138.73 కోట్ల అదనపు భారం పడుతోందన్నమాట.



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో కొప్పుల, గంగుల, పద్మారావు, మహమూద్ అలీ తదితరులు

**కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన డీలర్లు**

కమీషన్ పెంపు సహా తమ ఇతర సమస్యలు పరిష్కరించిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రేషన్ డీలర్లు కృతజ్ఞతలు తెలిపారు. తమ వినతులపై సీఎం సానుకూలంగా స్పందించడంపై హర్షం వ్యక్తం చేశారు. మంత్రులు హరీశ్‌రావు, గంగుల, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల కమిషనర్ వి.అనిల్ కుమార్, రేషన్ డీలర్ల జేఏసీ ప్రతినిధులు నాయికోటి రాజు, మల్లిఖార్జున్, రవీందర్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**డీలర్లకు మరికొన్ని ప్రభుత్వ వరాలు**

- → ఎంఎల్ఎస్ పాయింట్‌ల వద్ద కచ్చితమైన తూకం వేసేలా వే బ్రిడ్జిల ఏర్పాటు
- → డీలర్‌షిప్ రెన్యువల్‌ను ఐదేళ్ల కాలపరిమితికి పెంచడం
- → డీలర్ మరణిస్తే అంత్యక్రియల నిర్వహణకు రూ.10 వేల తక్షణ సాయం
- → 1.5 క్వింటాళ్ల వేరియేషన్ (తేడా)ను కేసుల పరిధి నుంచి తీసివేయడం
- → హైదరాబాద్‌లో రేషన్ భవన్ నిర్మాణానికి భూ కేటాయింపు

## క్లుప్తంగా...

### గిరిజనులకు ఎమ్మెల్యే జాజుల సురేందర్ క్షమాపణలు

ఎల్లారెడ్డి (కామారెడ్డి జిల్లా): కాయితీ లంబాడీలను ఎస్టీలుగా గుర్తించాలని కోరుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజుల సురేందర్ అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాన్ని నిరసిస్తూ గిరిజనులు కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి మంగళవారం పిలుపునిచ్చారు. దీంతో గిరిజనులు ఎల్లారెడ్డి పట్టణంలోని బంజారాభవన్‌లో సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించడానికి తరలివెళ్తున్న సమయంలో ఎమ్మెల్యే సురేందర్ బంజారాభవన్‌కు చేరుకుని గిరిజనులతో చర్చించారు. తాను ఎమ్మెల్యేగా పోటీచేసిన సమయంలో డిపాజిట్ డబ్బులను సైతం ఓ తండా వాసులు చెల్లించి ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేశారని గుర్తు చేశారు. అసెంబ్లీలో ప్రస్తావించిన విషయమై గిరిజనుల మనసుకు బాధ కలిగించినట్లయితే తనను క్షమించాలని కోరారు. దీంతో గిరిజనులు శాంతించారు. కార్యక్రమంలో బంజారాసంఘం నాయకులు బాల్యానాయక్, లింబేశ్ నాయక్, గోవింద్ నాయక్‌లు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని గిరిజనులు ముట్టడిస్తారన్న సమాచారం మేరకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను తరలించారు.

### జనాభా దామాషా ప్రకారం మాదిగలకు సీట్లు ఇవ్వాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ



చెన్నూర్: రాష్ట్రంలోని 19 నియోజకవర్గాలలో మాదిగల జనాభా 80 శాతం మేర ఉందని, ప్రధానపార్టీలు ఈ సీట్లను మాదిగలకే కేటాయించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో మంగళవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. హక్కులసాధనే లక్ష్యంగా ఈ నెల చివరివారంలో 30 లక్షలమందితో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో మాదిగ లే కీలకపాత్ర పోషించారని, రాష్ట్రంకోసం ప్రాణత్యాగాలు చేసినవారిలో మాదిగ బిడ్డలే ఎక్కువ ఉన్నారని, పోరాటం చేసి తెలంగాణ సాధించానని చెప్పుకునే కేసీఆర్‌కు నిమ్మరసం ఇచ్చి మాదిగబిడ్డే కాపాడారని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా అధికార బీజేపీ, బీఆర్ఎస్ బిల్లు పెట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. దళితబంధు పథకం 80 శాతం మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

### తనిష్క్ జ్యువెల్లరీ సరికొత్త కలెక్షన్లు

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ జ్యువెల్లరీ తనిష్క్ ఈ పండుగ వేళ సరికొత్త ఆభరణాల కలెక్షన్లతో వినియోగదారుల ముందుకు రానున్నట్లు తెలిపింది. కాకతీయ సామ్రాజ్య వైభవం స్ఫూర్తితో వీటిని రూపొందించనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఆభరణాలు పూర్తిగా కాకతీయ వాస్తుశిల్పం, నమూనాలు, నిర్మాణాలు, డిజైన్లు, ఆ కాలం నాటి అద్భుతమైన సంస్కృతి ప్రతిబింబించేలా ఉంటాయని పేర్కొంది. సంస్థలో చర్చించిన మేరకు సరికొత్త ఆలోచనలతో రావాలని తన భాగస్వాములకు సూచించింది.

## త్వరలో గద్దర్ సంతాప సభ: విమల గద్దర్



సాక్షి, హైదరాబాద్: గద్దర్ అకాల మరణం ప్రతి ఒక్కరినీ దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఆయనను ప్రేమించే ప్రజలందరికీ ఇది బాధాకర సమయమని గద్దర్ సతీమణి విమల గద్దర్ పేర్కొన్నారు. గద్దర్‌పై అభిమానంతో చివరి వీడ్కోలుకు వేలాదిగా తరలివచ్చిన అభిమానులకు అసౌకర్యం కలిగించినందుకు విచారం వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. అంత్యక్రియలకు హాజరై తమను ఓదార్చి, మనోధైర్యాన్ని ఇచ్చిన అన్ని రాజకీయ పక్షాల, ప్రజాసంఘాల నాయకులకు, అభిమానులకు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. త్వరలో గద్దర్ సంతాప సభ నిర్వహిస్తామని, తేదీ, సమయం వేదికను ప్రజలకు తెలియచేస్తామని విమల పేర్కొన్నారు. కాగా, గద్దర్‌కు అత్యంత ఆప్తమిత్రుడు సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ మృతి అత్యంత బాధాకరమని విమల గద్దర్ అన్నారు. ఆయన కుటుంబానికి ఆమె తీవ్ర సంతాపం తెలియజేశారు.

## బాసర ట్రిపుల్‌ఐటీలో మరో విద్యార్థి ఆత్మహత్య

- క్లాసులకు హాజరైన రెండో రోజే ఉరేసుకుని..
- రెండు నెలల కిందట ఓ విద్యార్థిని బలవన్మరణం



బాసర్ ట్రిపుల్ ఐటీలో చేరిన సందర్భంగా తండ్రి జాదవ్ సంతోష్‌తో బబ్లూ

భైంసా, నారాయణఖేడ్: బాసర ట్రిపుల్‌ఐటీలో పీయూసీ-1 చదువుతున్న విద్యార్థి జాదవ్ బబ్లూ మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం నాగాపూర్ గ్రామానికి చెందిన బబ్లూ గతనెల 31న బాసర ట్రిపుల్‌ఐటీలో చేరాడు. నాలుగు రోజులుగా నూతన విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో కూడా పాల్గొన్నాడు. సోమవారం నుంచే విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. పీయూసీ-1లో అడ్మిషన్ పొందిన జాదవ్ బబ్లూ తరగతులకు హాజరైన రెండోరోజే హాస్టల్ బ్లాక్‌లో ఉరేసుకున్నాడు. విద్యార్థి మృతదేహాన్ని అధికారులు అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వ్యక్తిగత సమస్యలతోనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. కాగా ట్రిపుల్ ఐటీలో రెండు నెలల క్రితం జూన్ 14న సిద్దిపేట జిల్లాకు చెందిన బోర లిఖిత అనే విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడిన సంగతి తెలిసిందే.

**నాన్నకు జ్వరం ఎలా ఉందని అడిగిన కొద్దిసేపటికే**

"నాన్నకు జ్వరం ఎలా ఉందని అడిగాడు.. కొద్దిసేపటికే మీ బిడ్డ చనిపోయాడని కళాశాల నుంచి పిడుగులాంటి వార్త విని గుండె పగిలినంత పని అయింది' అని జాదవ్ బబ్లూ తల్లి కన్నీటిపర్యంతమయ్యారు. నా బిడ్డ చక్కగా చదివి ఉన్నతస్థాయికి ఎదుగుతాడనుకుంటే గర్భశోకం మిగిల్చాడని భోరుమని విలపించారు. ఇలా ఎందుకు చేశాడో తెలియదని విలపించారు.

**కాంగ్రెస్ ఆందోళన..**

ట్రిపుల్ ఐటీ విద్యార్థి బబ్లూ ఆత్మహత్య విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు నిర్మల్ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ఆస్పత్రిలోనికి వెళ్లేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఇప్పటికే బాసరలో 20మంది విద్యార్థులు చనిపోయారనీ, ఇంకెంతమంది విద్యార్థులు చనిపోతే పాలకులు స్పందిస్తారని కాంగ్రెస్ నియోజకవర్గ నేత కూచాడి శ్రీహరిరావు ప్రశ్నించారు. విద్యార్థుల ప్రాణాలు పోతుంటే సీఎం కేసీఆర్ నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. కాగా ట్రిపుల్ ఐటీ అధికారులు బబ్లూ మృతదేహాన్ని ఆస్పత్రి వద్ద వదిలేసి వెళ్లిపోయారు. వివరాలు చెప్పేందుకు కూడా అక్కడ ఎవరూ లేకపోవడంతో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. కలెక్టర్ రావాలని నినదించారు. దీంతో కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.

## చదవడం ఇష్టం లేక గోదావరిలో దూకాడు

- కరీంనగర్ బస్టాండులో తప్పించుకుని.. గూడెం గోదావరిలో శవమై తేలి..
- ఇంటర్ విద్యార్థి విషాదాంతం



ప్రశాంత్ (ఫైల్)

దండేపల్లి: కాలేజీలో దింపేందుకు తీసుకెళ్లిన తండ్రి వద్ద నుంచి కరీంనగర్ బస్టాండ్‌లో తప్పించుకున్న ఓ ఇంటర్ విద్యార్థి...మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం వద్ద గోదావరినదిలో శవమై తేలాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దండేపల్లికి చెందిన నానవేని మల్లేశ్ కుమారుడు నానవేని ప్రశాంత్, అలియాస్ గట్టు(19) కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల కాలేజీ నుంచి ఇంటికి వచ్చాడు. మంగళవారం అతన్ని కాలేజీలో దింపేందుకు తండ్రి మల్లేశ్ కరీంనగర్ బయల్దేరాడు. కరీంనగర్ బస్టాండులో దిగగానే ప్రశాంత్ తప్పించుకున్నాడు. కొద్దిసేపు బస్టాండులో అతనికోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. కాలేజీకి వెళ్లి ఆరా తీయగా, కాలేజీకి రాలేదని చెప్పారు. దీంతో ఇంటికే వచ్చాడేమో అని తండ్రి దండేపల్లికి రాగా..ఇంటికి కూడా రాలేదని కుటుంబసభ్యులు చెప్పడంతో ప్రశాంత్‌ను వెదికేందుకు బయటికి వెళ్లాడు. ఇంతలో సాయంత్రం గూడెం గోదావరినదిలో శవం ఉందని తెలియడంతో అక్కడికి వెళ్లి చూడగా, అది ప్రశాంత్‌ది కావడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ప్రశాంత్‌ను గతేడాది దండేపల్లి జూనియర్ కాలేజీలో చేర్పించగా ఫెయిల్ అయ్యాడు. అతన్ని ఆకాలేజీ నుంచి తీసి, ఈయేడాది కరీంగర్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో చేర్పించారు. చదవడం ఇష్టం లేకనే గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబీకులు, బంధువులు భావిస్తున్నారు.

## కస్తూర్బా పాఠశాలలో అగ్నిప్రమాదం

44 మంది విద్యార్థులకు తప్పిన ముప్పు



కాలిపోతున్న విద్యార్థుల పెట్టెలు, బట్టలు

వెంకటాపురం(ఎం): కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో విద్యార్థుల దుస్తులు, పెట్టెలు కాలి బూడిదయ్యాయి. ప్రమాదం జరిగిన గదిలో విద్యార్థులు నిద్రించకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలోని జవహర్‌నగర్ కేజీబీవీలో సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు చోటుచేసుకుంది. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 280 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వారం రోజుల క్రితం కళ్ల కలక వచ్చి సుమారు 230 మంది విద్యార్థులు ఇంటికి వెళ్లారు. మిగతా వారు పాఠశాలలోనే ఉన్నారు. వారు పడుకున్న పక్క గదిలో సోమవారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. టోల్‌గేట్ వద్ద విధులు నిర్వహించుకుని ఇంటికి వెళుతున్న యువకులకు ఆ మంటలు కనిపించాయి. వెంటనే స్థానిక సర్పంచ్ శనిగరపు రమ భర్త రమేశ్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చిన యువకులు అక్కడికి చేరుకున్నారు. రమేశ్ పాఠశాలకు చేరుకుని గదిలో నిద్రిస్తున్న 44 మంది విద్యార్థినులను కిందికి తీసుకువచ్చి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈలోగా అగ్నిమాపక సిబ్బంది వచ్చి పూర్తిగా మంటలను అదుపుచేయడంతో విద్యార్థులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కళ్ల కలక వ్యాధి వచ్చి విద్యార్థులు ఇళ్లకు వెళ్లకపోతే ప్రమాదం జరిగిన గదిలో కూడా చాలామంది నిద్రించేవారని సహచార విద్యార్థులు పేర్కొన్నారు. కాగా, రాత్రి సమయంలో పాఠశాలలో విధులు నిర్వర్తించాల్సిన ఉపాధ్యాయురాలితో పాటు వాచ్‌మన్, ఏఎస్ఎం ఎవరూ విధుల్లో లేకపోవడం గమనార్హం.

## హెల్మెట్లు ధరించి విధులు..





పరిషత్ కార్యాలయం, హెల్మెట్లతో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

జగిత్యాల: జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది భయంభయంగా పనిచేస్తున్నా రు. పునర్విభజనలో భాగంగా 2016లో బీర్‌పూర్‌ను మండలంగా ఏర్పాటు చేశా రు. ప్రభుత్వ భవనాలు లేక అద్దె భవనాల్లో పోలీస్‌స్టేషన్లు, మండల పరిషత్ కా ర్యాలయాలు ఏర్పాటు చేశారు. అయితే, మండల పరిషత్ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడం, ఇటీవల కురిసిన వర్షాలతో పైకప్పు పెచ్చులూడుతున్నాయి. దీంతో అందులో పనిచేస్తున్న సిబ్బంది హెల్మెట్లు ధరించి పనిచేస్తున్నా రు. ఉన్నతాధికారులు స్పందించి సొంత భవనాలు నిర్మించాలని వారు కోరుతున్నారు.

## మా అమ్మాయినే ప్రేమిస్తావా...
# యువకుడిపై హత్యాయత్నం

- పథకం ప్రకారం యువతి ఫోన్ నుంచి మెసేజ్... వచ్చాక దాడిచేసి వ్యవసాయ బావిలో వేసిన వైనం
- చనిపోయాడని వెళ్లిపోయిన నిందితులు... ప్రాణాలతో బయట పడిన యువకుడు

కౌటాల: తన కూతుర్ని ప్రేమించాడనే కోపంతో ఓ యువకుడిని హతమార్చేందుకు యత్నించాడు ఆ యువతి తండ్రి. ఈ ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కౌటాల మండలంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. గుండాయిపేట గ్రామానికి చెందిన ఎల్ములే గణపతి, వనిత దంపతుల చిన్న కుమారుడు ఎల్ములే సాయిరాం కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. గ్రామంలోని సమీప బంధువు, పదో తరగతి చదువుతున్న నాగపూరి శంకర్ కూతురు, సాయిరాం ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం అమ్మాయి ఇంట్లో తెలిసింది.

**బావా కలవాలని ఉంది..అని మెసేజ్ పెట్టి**

సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో 'బావా నిన్ను కలవాలని ఉంది'అని సాయిరాం ఫోన్‌కు యువతి ఫోన్ నుంచి మెసేజ్ వచ్చింది. దీంతో సాయిరాం రాత్రి సమయంలో గ్రామంలోని ఓ షాప్ వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన ముగ్గురు వ్యక్తులు వచ్చి మత్తు మందు కర్చీఫ్‌తో నోటిని మూసివేయడంతో సాయిరాం స్పృహ కోల్పోయాడు. అనంతరం పొలాల్లోకి తీసుకెళ్లి తీవ్రంగా కొట్టారు. తర్వాత గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడేశారు. కాసేపు అక్కడే ఉండి.. చనిపోయాడని భావించి వెళ్లిపోయారు. బావిలో తక్కువ నీరు ఉండడంతో సాయిరాం నీటిలో మునగలేదు. రాత్రి 2 గంటల ప్రాంతంలో యువకుడికి మెలకువ రావడంతో ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు వెంటనే కౌటాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సాయిరాం తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుండాయిపేట్ గ్రామానికి చెందిన నాగపూరి శంకర్, నాగపూరి పంకజ్, నాగపూరి సందీప్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు కౌటాల ఎస్సై మధుకర్ తెలిపారు.

## వాష్ రూంకు వెళ్లొస్తానని...

పరీక్ష కేంద్రం నుంచి వెళ్లిపోయిన అభ్యర్థి.. కేసు నమోదు

సాక్షి, మేడ్చల్ జిల్లా/మేడ్చల్ రూరల్: పరీక్షా కేంద్రం నుంచి నిర్ణీత సమయం కంటే ముందే పారిపోయిన అభ్యర్థిపై మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేశారు. టీఎస్‌పీఎస్సీ మున్సిపాలిటీ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలో అకౌంటెంట్ పోస్టుల భర్తీకి మంగళవారం పరీక్ష జరిగింది. ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు మేడ్చల్ మండలంలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసేందుకు ఆదిలాబాద్ జిల్లా శాంతినగర్‌కు చెందిన మహ్మద్ అసర్ హాజరయ్యాడు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షకు సమయం కేటాయించగా, అసర్ బయో సబ్జెక్ట్‌కు విరామం ఇచ్చిన సమయంలో సాయంత్రం 4:15 నిమిషాలకు టాయిలెట్ కోసం అనుమతి తీసుకొని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతను పారిపోయినట్లు గుర్తించిన చీఫ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఐ నర్సింహారెడ్డి తెలిపారు.


**తెలంగాణ ప్రభుత్వం**
**సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, ట్రైబల్ వెల్ఫేర్ సర్కిల్, వరంగల్**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన**
No.DB2/56/EP-NIT/493 to 494/2023-2024
తేది: 07-08-2023
పనుల సంఖ్య: ఇంతకుముందరి వరంగల్ జిల్లాలో వివిధ మండలాలలో (2) నం.లు, (2) పనుల కోసం మొత్తం వ్యయం: రూ.140.00 లక్షలు, బిడ్ దాఖలు ప్రారంభ తేది: 11-08-2023, ముగింపు తేది: 19-08-2023న మ.3.00 గం.లు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ @ https://tender.telangana.gov.in లో చూడండి. 0870-2957645, (7893235624 PA to SE).
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ట్రైబల్ వెల్ఫేర్, వరంగల్
DIPR RO No.1237-DP/CL/Advt/1/2023-24, Dt: 08.08.2023

**తెలంగాణ ప్రభుత్వం**
**జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ కార్యాలయం, రాజన్న సిరిసిల్ల**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన**
NIT No.24-32/DPRE/RS/Tenders/2023-24 తేది: 02-08-2023
పనుల సంఖ్య (9), రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ఇల్లంతకుంట, వేములవాడ మరియు వీర్నపల్లి మండలాలలోని పనుల కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ.232.14 లక్షలు. బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభ తేది: 09-08-2023. ముగింపు తేది: 16-08-2023. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.tenders.telangana.gov.in నుండి పొందవచ్చును.
సం/- జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్, రాజన్న సిరిసిల్ల
DIPR RO No.1240-DP/CL/Advt/1/2023-24, Dt: 08.08.2023

**పురపాలక సంఘ కార్యాలయం : మంచిర్యాల, జిల్లా : మంచిర్యాల**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**
మంచిర్యాల మున్సిపాలిటీ నందు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు నం. E1/119/MNCL/2023-24/1, తేది: 08-08-2023 ప్రకారం రూ. 295.00 లక్షల నిధులతో, (16) పనులు చేపట్టుటకు గాను అర్హత గల వారి నుండి టెండర్లు కోరబడుచున్నవి. టెండరు తేదీల వివరాలు:

| క్ర.సం. | NIT నం. | డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది | డౌన్‌లోడింగ్ ముగింపు తేది |
|---|---|---|---|
| 01 | E1/119/MNCL/2023-24/ | 09/08/2023 సా॥5.30గం. | 18/08/2023 సా॥5.30గం. |
| 02 | E1/120/MNCL/2023-24/ | 09/08/2023 సా॥5.30గం. | 28/08/2023 సా॥5.30గం. |

తదుపరి వివరములకు కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్, మంచిర్యాల మున్సిపాలిటీ గారిని సంప్రదించు ఫోన్ నం. 9849905886, 9849906721 లేదా www.tender.telangana.gov.in సైట్ నందు చూడవచ్చును.
సం/- కమిషనర్, మంచిర్యాల మున్సిపాలిటీ
DIPR RO No.5172-PP/CL/Advt/1/2023-24, Dt. 08.08.2023

**తెలంగాణ ప్రభుత్వం**
**నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ**
పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్ నం.1, నాగర్‌కర్నూల్ వారి కార్యాలయము, ఫోన్: 9502007771
ఈ క్రింది పనులకు టెండర్లను ఆహ్వానించడమైనది. క్రమ సంఖ్య నెం.: 1, టెండర్ నోటీసు నెం. 08/SE/IC1/NGKL/2023-24, పని పేరు: అచ్చంపేట ఎత్తిపోతల పథకము మొదటి దశ - మట్టి త్రవ్వకము, కాలువ కట్టను ఏర్పాటు చేయుట, సిఎం & సిడి పనుల నిర్మాణం, అప్రోచ్ కాలువ, కాలువల లైనింగ్, పంప్‌హౌజ్‌ల నిర్మాణం మరియు రిజర్వాయర్ నిర్మాణము-57,200 ఎకరాల ఆయకట్టుకు నీరందించడానికి కాలువల ఏర్పాటు చేయడము గురించి. అంచనా విలువ కోట్లలో: రూ.1061.39 కోట్లు. పై పనులకు టెండర్లను స్వీకరించు ప్రారంభ తేది: 14-08-2023 మ.3.30 గం. నుండి. గమనిక: మిగతా వివరములకు www.tender.telangana.gov.in (or) www.eprocurement.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.
సం/- తేది: 07-08-2023, పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్ నెం.1, నాగర్‌కర్నూల్
DIPR RO No.5118-PP/CL/Advt/1/2023-24, Dt: 08.08.2023

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము**
**మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ:: జనగాం జిల్లా**
నెం.A1/220/DHEW/2023 **ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్** తేది: 08.08.2023
జనగాం జిల్లాలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో మహిళా సాధికారత కోసం డిస్ట్రిక్ట్ హబ్‌లో అవసరమైన కంప్యూటర్ పరికరాలు, ల్యాప్‌టాప్, ఫర్నిచర్ మరియు ఇతర అవసరమైన కార్యాలయ సామాగ్రి/ ఇతర పరికరాలు నేయగా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, గ్రౌండ్ ఫ్లోర్, రూమ్ నెంబర్ 86, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము, జనగామ కార్యాలయంకు సరఫరా చేయుటకు టెండర్ ద్వారా అర్హత, అనుభవం కలిగిన యజమానుల నుండి సీల్డ్ టెండర్లను కోరడం జరుగుచున్నది. కావున అర్హత, అనుభవం కలిగిన యజమానులు వివరాలకై జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, గ్రౌండ్ ఫ్లోర్, రూమ్ నెంబర్ 86, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము, జనగాం నందు సంప్రదించి దరఖాస్తు ఫారంలను రూపాయలు 5,000/- (అక్షరాలలో ఐదు వేలు మాత్రమే) జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ, జనగాం వారి పేరు మీద డి.డి.ని సమర్పించి తేది: 10.08.2023 ఉ.10.30 నుండి 17.08.2023 సా.05.00 గం. వరకు దరఖాస్తుఫారంలను పొందగలరు. దరఖాస్తుఫారములను సమర్పించవలసిన ఆఖరు తేది: 19.08.2023 సా.05.00 గం. వరకు. టెండర్లు తెరిచే తేది: 21.08.2023 సా.04.00 గం.కు. ఇ.ఎం.డి. మరియు ప్రాసెసింగ్ ఫీజును చెల్లించని టెండర్ దరఖాస్తును తిరస్కరించబడును. ఇ.ఎం.డి. విషయంలో ఎవరికి మినహాయింపు లేదు.
సం/- జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ, జనగాం
DIPR RO No.5127-PP/CL/Advt/1/2023-24, Dt. 08.08.2023

**తెలంగాణ ప్రభుత్వం**
**వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయము, నల్లగొండ జిల్లా**
లేఖ. సంఖ్య ఎ2/265/2022 **టెండరు ప్రకటన** తేది: 08-08-2023
నల్లగొండ జిల్లాలో నిర్వహించబడుచున్న (46) బి.సి. ప్రీ-మెట్రిక్ మరియు పోస్ట్-మెట్రిక్ వసతి గృహములకు అవసరమైన కిరాణ సామాగ్రిని వసతి గృహములకు సరఫరా చేయుటకు ప్రభుత్వము నుండి గుర్తింపు పొంది ట్రేడ్ లైసెన్స్ కలిగిన ఆసక్తి గల వ్యాపారస్తుల నుండి సీల్డు టెండర్ కోరడమైనది. కిరాణ సామాగ్రిని వసతి గృహములకు సరఫరా చేయుటకు ఆసక్తి గల వారు టెండర్ ప్రాసెసింగ్ ఫీజును (రూ.20,000/-) Dist. BC Development Officer, Nalgonda వారి పేరు మీద డి.డి. రూపములో కావలసిన టెండర్ షెడ్యూల్ ఫారమును జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, కార్యాలయము, నల్లగొండ జిల్లాలో తేది: 10-08-2023 నాడు ఉదయం: 11.00 నుండి తేది: 16-08-2023 మధ్యాహ్నం 2.00 గంటల వరకు పొందవచ్చును. పూర్తి చేసిన టెండర్ ఫారమును తేది: 17-08-2023 నాడు సాయంత్రం 5.00 గంటలలోగా టెండర్ ఫారమును జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, కార్యాలయము, నల్లగొండ జిల్లాలో ఏర్పాటు చేసిన సీల్డ్ కవరు టెండర్ బాక్స్‌లో వేయగలరు. అట్టి టెండర్లను అదనపు కలెక్టర్, (జనరల్) నల్లగొండ గారి కార్యాలయము యందు తేది: 18-08-2023 రోజున ఉదయం 11.00 గంటలకు తెరువబడును. గడువు తరువాత వచ్చిన టెండర్ ఫారములు స్వీకరించబడవు. గమనిక: ఇట్టి టెండర్‌ను వాయిదా వేయుటకు గాని, రద్దు పరచుటకు గాని అదనపు కలెక్టర్, (జనరల్) నల్లగొండ గారికి పూర్తి అధికారము కలదు.
సం/- జిల్లా వె.త.త అభివృద్ధి అధికారి, నల్లగొండ
సం/- అదనపు కలెక్టర్, (జనరల్)/ఛైర్మన్ జిల్లా కొనుగోలు కమిటీ, నల్లగొండ జిల్లా వారి తరపున.
DIPR RO No.5184-PP/CL/Advt/1/2023-24, Dt: 08.08.2023

**EMPLOYEES' STATE INSURANCE CORPORATION (ESIC)**
(Ministry of Labour & Employment, Govt. of India)
52.W/17/20/ARM(C)-RO/2023-PMD తేది: 07/08/2023
**ఇ-టెండర్లు కోరుతూ ప్రకటన**
2023-24 కాలంలో దిగువ తెలిపిన ARM పనుల కోసం సంబంధిత NIT డాక్యుమెంట్‌లో నిర్దేశించిన విధంగా తగిన తరగతి మరియు కేటగిరీతో జాబితాలోగల మరియు అర్హతగల కాంట్రాక్టర్ల నుండి రీజనల్ డైరెక్టర్, ESI కార్పొరేషన్, హైదరాబాద్ వారు CPP పోర్టల్ ద్వారా ఇ-టెండరింగ్ విధానం ద్వారా రెండు బిడ్ల విధానంలో ఆన్‌లైన్ పర్సంటేజ్ రేట్ బిడ్లు కోరుచున్నారు.

| క్ర. సం. | పని పేరు & ప్రదేశం | బిడ్స్ దాఖలుకు చివరి తేది |
|---|---|---|
| 1 | 2023-24 కాలంలో ఆదర్శనగర్, హైదరాబాద్ వద్ద గల ESIC RO & స్టాఫ్ క్వార్టర్స్‌లో సివిల్ పనుల వార్షిక మరమ్మతులు మరియు నిర్వహణ (ARM). ఇ-టెండరు ID No: 2023_ESIC_765324_1 టెండరు విలువ: రూ.29,95,071-00 | 19/08/2023 మ.2:00 గం. |
| 2 | 2023-24 కాలంలో ఆదర్శనగర్, హైదరాబాద్ వద్ద గల ESIC RO & స్టాఫ్ క్వార్టర్స్‌లో ఎలక్ట్రికల్ పనుల వార్షిక మరమ్మతులు మరియు నిర్వహణ (ARM). ఇ-టెండరు ID No: 2023_ESIC_765363_1 టెండరు విలువ: రూ.29,86,118-00 | 19/08/2023 సా.4:00 గం. |
| 3 | 2023-24 కాలంలో జీడిమెట్ల, హైదరాబాద్ వద్ద గల ESI డయాగ్నొస్టిక్ సెంటర్ & BOలో సివిల్ పనుల వార్షిక మరమ్మతులు మరియు నిర్వహణ (ARM). ఇ-టెండరు ID No: 2023_ESIC_765376_1 టెండరు విలువ: రూ.29,52,165-00 | 19/08/2023 సా.5:00 గం. |
| 4 | 2023-24 కాలంలో జీడిమెట్ల, హైదరాబాద్ వద్ద గల ESI డయాగ్నొస్టిక్ సెంటర్ & BOలో ఎలక్ట్రికల్ పనుల వార్షిక మరమ్మతులు మరియు నిర్వహణ (ARM). ఇ-టెండరు ID No: 2023_ESIC_765387_1 టెండరు విలువ: రూ.28,96,765-00 | 19/08/2023 సా.5:00 గం. |
| 5 | 2023-24 కాలంలో ESI హాస్పిటల్, రామచంద్రాపురం, హైదరాబాద్ వద్ద సివిల్ పనుల వార్షిక మరమ్మతులు మరియు నిర్వహణ (ARM). ఇ-టెండరు ID No: 2023_ESIC_765404_1 టెండరు విలువ: రూ.29,98,101-00 | 19/08/2023 సా.5:00 గం. |
| 6 | 2023-24 కాలంలో ESI హాస్పిటల్, RC పురం వద్ద ఎలక్ట్రికల్ పనుల వార్షిక మరమ్మతులు మరియు నిర్వహణ (ARM). ఇ-టెండరు ID No: 2023_ESIC_765418_1 టెండరు విలువ: రూ.28,89,199-00 | 19/08/2023 సా.5:00 గం. |
| 7 | 2023-24 కాలంలో వరంగల్ వద్ద ESI హాస్పిటల్‌లో సివిల్ పనుల వార్షిక మరమ్మతులు మరియు నిర్వహణ (ARM). ఇ-టెండరు ID No: 2023_ESIC_765435_1 టెండరు విలువ: రూ.29,65,272-00 | 19/08/2023 సా.6:00 గం. |
| 8 | 2023-24 కాలంలో వరంగల్, ESI హాస్పిటల్‌లో ఎలక్ట్రికల్ పనుల వార్షిక మరమ్మతులు మరియు నిర్వహణ (ARM). ఇ-టెండరు ID No: 2023_ESIC_765455_1 టెండరు విలువ: రూ.28,77,446-00 | 19/08/2023 సా.6:00 గం. |
| 9 | 2023-24 కాలంలో సిర్పూర్‌కాగజ్‌నగర్ వద్ద ESI హాస్పిటల్‌లో సివిల్ పనుల వార్షిక మరమ్మతులు మరియు నిర్వహణ (ARM). ఇ-టెండరు ID No: 2023_ESIC_765479_1 టెండరు విలువ: రూ.27,51,767-00 | 19/08/2023 సా.6:30 గం. |
| 10 | 2023-24 కాలంలో నిజామాబాద్ వద్ద ESI డయాగ్నొస్టిక్ సెంటర్ మరియు బ్రాంచ్ ఆఫీస్‌లో సివిల్ పనుల వార్షిక మరమ్మతులు మరియు నిర్వహణ (ARM). ఇ-టెండరు ID No: 2023_ESIC_765471_1 టెండరు విలువ: రూ.28,98,601-00 | 19/08/2023 సా.6:00 గం. |
| 11 | 2023-24 కాలంలో ESI హాస్పిటల్, సిర్పూర్ మరియు ESI డయాగ్నొస్టిక్ సెంటర్, నిజామాబాద్‌లో ఎలక్ట్రికల్ పనుల వార్షిక మరమ్మతులు మరియు నిర్వహణ (ARM). ఇ-టెండరు ID No: 2023_ESIC_765484_1 టెండరు విలువ: రూ.28,55,150-00 | 19/08/2023 సా.6:45 గం. |

బిడ్ ఫారాలు మరియు ఇతర వివరాలను వెబ్‌సైట్ www.esic.nic.in/tenders మరియు https://eprocure.gov.in/eprocure/app నుండి పొందవచ్చును.
సం/- రీజనల్ డైరెక్టర్

**తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్**
(తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ)
తెలంగాణ స్టేట్ పోలీస్ హెడ్క్వార్టర్స్ కాంపౌండ్, సైఫాబాద్, హైదరాబాద్-500004
ఫోన్:040-27855008, 040-23230742, ఫ్యాక్స్: 040-23297143, ఇ-మెయిల్: headoffice@tsphcl.com
**ఇ-ప్రొక్యూర్‌మెంట్-టెండరు ప్రకటన-15**
దిగువ తెలిపిన పనుల కోసం టెండరు నం.T79 to T82/2023-24 తేది: 05-08-2023 కోసం సివిల్ పనుల కోసం టెండర్లు కోరబడుచున్నవి: టెండరు నం.లు, జిల్లాలోగల పనులు & మొత్తం ECV (రూ.లక్షలలో) వరుసగా దిగువ విధంగా ఉన్నాయి: T79 & T82-భద్రాద్రికొత్తగూడెం-2-72.33; T80-ఖమ్మం-1-21.45; T81-హైదరాబాద్-1-145.33; ఆన్‌లైన్‌లో షెడ్యూలు లభ్యత: 08-08-2023 నుండి. టెండరు నం.T79 & T80/23-24 కోసం బిడ్ దాఖలుకు ఆఖరి తేది/సమయం: 16-08-2023న సా.5.00 గం.(STN). టెండరు నం.T81 & T82/23-24 కోసం బిడ్ దాఖలుకు ఆఖరి తేది/సమయం: 22-08-2023న సా.5.00 గం. తదుపరి వివరాలను వెబ్‌సైట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చును.
DIPR RO No.5137-PP/CL/ADVT/1/2023-24, Dt:08-08-2023 సం/- చీఫ్ ఇంజనీర్ (FAC)

**పురపాలక సంఘ కార్యాలయము, జగిత్యాల, జిల్లా : జగిత్యాల**
నం.సి.1/2057/MCJ/2023 **ప్రకటన** తేది: 08-08-2023
పురపాలక సంఘ కార్యాలయము, జగిత్యాలకు సంబంధించి పట్టణ నర్సరీల పెంపకం, ట్రీ పార్కుల అభివృద్ధి, హరితహారం కార్యక్రమం మరియు తదితర పనులు పర్యవేక్షించుటకు అవుట్‌సోర్సింగ్ పద్ధతిన హరితహారం కో-ఆర్డినేటర్‌ను నియమించుకొనుటకు ఆసక్తిగల అభ్యర్థుల నుండి తేది: 08-08-2023 నుండి 14-08-2023 వరకు దరఖాస్తులు కోరడమైనది. అర్హతలు: 1) ప్రభుత్వముచే గుర్తించబడిన ఏదేని విశ్వవిద్యాలయం నుండి బి.ఎస్.సి. (అగ్రికల్చర్/హార్టికల్చర్/బోటని/ఫారెస్ట్) డిగ్రీ కలవారు. 2) కంప్యూటర్ పరిజ్ఞానం (డి.ఎస్.ఎ/ పి.జి.డి.సి.ఎ) కలిగి ఉండాలి. 3) 35 సంవత్సరముల లోపు వయస్సు కలవారు. 4) నిర్దేశిత పనులకు సంబంధించిన అనుభవం గల అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడును. 5) జగిత్యాల జిల్లా స్థానికత కలవారు. కావున పైన తెలిపిన అర్హతలు గల అభ్యర్థులు వారి యొక్క బయోడేటా మరియు డిగ్రీ సర్టిఫికెట్స్‌తో పాటుగా మార్కుల మెమోలు మరియు తదితర డాక్యుమెంట్ల యొక్క జిరాక్స్ ప్రతులు జతపరిచి దరఖాస్తులను పురపాలక సంఘ కార్యాలయ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగము నందు తేది:09-08-2023 నుండి 14-08-2023 వరకు సా.5.00 గం.లోగా సమర్పించగలరు. ఇతర వివరాలకై ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగము నందు కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు.
సం/- కమిషనర్, జగిత్యాల మున్సిపాలిటీ
DIPR Ro No.5140-PP/CL/Advt/1/2023-24, Dt.08-08-2023

**శ్రీ కోటమైసమ్మ అమ్మవారి దేవస్థానము**
గ్రా॥ ఇండ్లకోటయ్యగూడెం, మం॥ నిడమనూరు, జి॥ నల్లగొండ, తెలంగాణ.
SRI KOTAMAISAMMA AMMAVARI TEMPLE
Indlakotaiah Gudem (V), Nidamanuru (M), Nalgonda (D)
**టెండరు కమ్ బహిరంగ వేలము ప్రకటన**
లేఖ నెం.: 1/ఎస్.కె.ఎమ్.ఎ.డి/2023-24 తేది: 08-08-2023
ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియపరుచునది ఏమనగా! శ్రీ కోటమైసమ్మ అమ్మవారి దేవస్థానము, ఇండ్లకోటయ్యగూడెం నందు తేది. 18-08-2023 నుండి 17-08-2024 వరకు ఒక సంవత్సర కాలపరిమితికి గాను వివిధ హెచ్-1 టెండరు హక్కులకు ఆసక్తి గల వారి నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూలు పొందినవారు తేది: 17-08-2023, గురువారము రోజున ఉ॥ 11.00 గంటలకు దేవస్థానము నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అట్టి సీల్డు టెండర్లను అదే రోజు మ॥ 12.00 గంటలకు దేవాదాయ శాఖ అధికారి పర్యవేక్షణలో మరియు టెండరుదారుల సమక్షంలో తెరవబడును. క్ర.సం., వేలము వివరములు, డిపాజిట్ (రూ) వరుసగా: 1). కొబ్బరిచిప్పలు సేకరించుకొను హక్కు, రూ. 1,00,000.00, 2) ...
DIPR RO No.5120-PP/CL/ADVT/1/2023-24, Dt. 08-08-2023

**శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానము**
SRI PARVATHI JADALA RAMALINGESWARA SWAMY TEMPLE
Cheruvugattu (V), Narketpally (M), Nalgonda (D) - 508254, Telangana
e-mail: aceocheruvugattu@yahoo.in, Phone: 91000 23701, 702, 703
DIPR RO No.5121-PP/CL/Advt/1/2023-24, Dt. 08.08.2023

## క్లుప్తంగా...

### పురుగులున్న జైలు గదిలో ఇమ్రాన్ ఖాన్

**ఇస్లామాబాద్:** తోషఖానా కేసులో అరెస్టయిన ఇమ్రాన్‌ఖాన్‌ను అటోక్ జైల్లో పురుగులు పుట్రలతో చిమ్మ చీకట్లో ఉన్న ఒక చిన్న గదిలో ఉంచారు. మాజీ ప్రధానమంత్రి అయినప్పటికీ ఆయనకు ఎలాంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించలేదు. ఎలాంటి సదుపాయాలు లేని ఒక చిన్న గదిలో పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పీటీఐ) చైర్మన్ ఇమ్రాన్‌ఖాన్‌ను ఉంచారని ఆయన తరఫున లాయర్ నయీమ్ హైదర్ పంజోతా చెప్పారు. ఆ గదిలో ఈగలు, చీమలు, నల్లులు వంటి పురుగులు ఉన్నాయని చెప్పారు. అదే గదిలో ఒక మూల వాష్ రూమ్ ఉందని చెప్పారు. తన జీవితాంతం ఈ చిన్న గదిలో ఉండడానికి సిద్ధమేనని ఇమ్రాన్‌ఖాన్ చెప్పినట్టుగా ఆ లాయర్ వెల్లడించారు. లాహోర్‌లో ఇమ్రాన్‌ను అరెస్ట్ చేసినప్పుడు ఆయనకు అరెస్ట్ వారెంట్ కూడా చూపించకుండా తలుపులు బద్దలు కొట్టి లోపలికి వచ్చారని ఇమ్రాన్ చెప్పారన్నారు. హైకోర్టులో సవాల్ పిటిషన్ వెయ్యడం కోసం ఇమ్రాన్ ఖాన్ సంతకం తీసుకోవడానికి అటోక్ జైలుకు వెళ్లిన లాయర్ దాదాపుగా గంట 45 నిమిషాలసేపు ఇమ్రాన్‌తో ఉన్నారు. అప్పుడే ఇమ్రాన్ తనని ఉగ్రవాదిని చూసినట్టుగా జైల్లో చూస్తున్నారని గదిలో ఓపెన్ టాయిలెట్ , చిమ్మచీకటి ఉదయం పూట ఈగలు, రాత్రయితే చీమలు వస్తున్నాయని, తనని కలవడానికి కూడా ఎవరికీ అనుమతించడం లేదని తన ఆవేదనంతా చెప్పుకున్నారు. ఇమ్రాన్ ఖాన్‌కు మరో షాక్ తగిలింది. అవినీతి కేసులో దోషిగా తేలడంతో ఐదేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆయనపై అనర్హత వేటు పడింది.

### ఆగస్ట్ 15ను జాతీయ పండుగగా జరుపుకుందాం

**వాషింగ్టన్:** భారత స్వాతంత్య్ర దినం ఆగస్ట్ 15వ తేదీని ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల జాతీయ దినోత్సవం (నేషనల్ డే ఆఫ్ సెలబ్రేషన్ ఆఫ్ ది వరల్డ్స్ టు లార్జెస్ట్ డెమోక్రసీస్)గా జరుపుకునేందుకు ఉద్దేశించిన బిల్లును భారతీయ అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు శ్రీ థానెదార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రవేశపెట్టారు. ఆయనకు సహ కాంగ్రెస్ సభ్యులు బడ్డీ కార్టర్, బ్రాడ్ షర్మన్ సహకరించారు. 'అమెరికా, భారత్‌ల మధ్య బంధం బలమైన భాగస్వామ్యం, ప్రజాస్వామ్య విలువలతో పెనవేసుకుపోయింది. ప్రపంచదేశాల్లో ప్రజాస్వామ్యాన్ని పెంపొందించడంతోపాటు, అభివృద్ధికి తోడ్పడుతున్నాయి'అని తీర్మానం పేర్కొంది. మోదీ జూన్ 22వ తేదీన అమెరికా పర్యటన తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత విస్తృతమయ్యాయని తెలిపింది.

# ఇదీ మణిపూర్ కథ..!

మణిపూర్ చరిత్ర అంటే రాజులు, సంస్థానాలు, ఆక్రమణలు, చొరబాట్లు మాత్రమే కాదు. భిన్న సంప్రదాయాలు, సంస్కృతులు కలిగిన జాతుల కలబోత. విభిన్న తెగల వారు ఒకే చోట సహజీవనం చేసే మణిహారం. మెయిటీలు, కుకీల మధ్య మూడు నెలలుగా జరుగుతున్న ఘర్షణలు రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చాయి. ఈ నేపథ్యంలో మణిపూర్ చరిత్ర అందరిలోనూ ఆసక్తిని పెంచింది.



మణిపూర్ లోయ ప్రాంతంలో మెయిటీలు, నాగా, జొమి ఇలా 124 తెగలు నివసిస్తూ ఉంటే మణిపూర్ కొండల్లో 38 గిరిజన తెగలకు చెందిన వారు ఉన్నారు. వీరిలో కుకీల ప్రాబల్యం ఎక్కువ. ఈ వర్గాల మధ్య ఘర్షణలు ఇప్పుడు కొత్తేం కాదు. గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో మెయిటీలు, కుకీల మధ్య ఉద్రిక్తతలు చెలరేగుతూనే ఉన్నాయి.

### చరిత్రలోకి తొంగి చూస్తే

మణిపూర్‌కు సంబంధించిన చారిత్రక ఆధారాలు క్రీ.శ. 33వ సంవత్సరం నుంచి ఉన్నాయి. అయితే, అంతకు ముందు సైతం ఇంఫాల్ లోయలో మానవ నాగరికత వెల్లివిరిసినప్పటికీ అక్కడ ఉన్న వారంతా మెయిటీ వర్గీయులు అని చెప్పడానికి వీల్లేదు. టిబెట్, బర్మా నుంచి మెయిటీలు వలస వచ్చినట్టుగా చారిత్రక ఆధారాలు ఉన్నాయి. భారత్‌ను సుదీర్ఘకాలం పరిపాలించిన రాజవంశాలలో ఒకటైన నింగ్‌డొ వంశీకులు మణిపూర్ లోయను పాలించారు. మణిపూర్ రాజులు, ప్రజలు 18 వ శతాబ్దం వరకు సనామహిజం అనే దేశీయ మత విశ్వాసాల్ని ఆచరించారు. 15వ శతాబ్దంలో లోయను పాలించిన క్యంబ అనే రాజు విష్ణుమూర్తి దేవాలయాన్ని నిర్మించాడు. అప్పట్నుంచి లోయలోకి బ్రాహ్మణుల రాక ప్రారంభమైంది. అప్పట్లోనే మణిపూర్ లోయను పాలించిన రాజులు హిందువులుగా మారారా అన్న చర్చ ఉంది. అయితే 1704వ సంవత్సరంలో రాజు చరియారోంగ్బా తన కుటుంబంతో సహా హిందూమతంలోకి మారారు. అప్పట్నుంచి ఇంఫాల్ లోయలో హిందువుల ప్రాబల్యం పెరిగింది. నింగ్‌డొ వంశీకులే 1724లో ఈ ప్రాంతానికి మణిపూర్ (మణిమాణిక్యాలకు నిలయం) అని పేరు పెట్టారు.

### కుకీల ప్రస్తావన తొలిసారి ఎప్పుడంటే

కొన్ని వందల శతాబ్దాల కిందటే మణిపూర్ లోయ ప్రాంతంలో మెయిటీల ఉనికి ఉంది. కానీ కుకీల ప్రస్తావన 17వ శతాబ్దంలో తొలిసారిగా తెలిసింది. 1777లో బెంగాల్ గవర్నర్ జనరల్‌గా వారెన్ హేస్టింగ్స్ ఉన్నప్పుడు చిట్టగాంగ్‌లో బ్రిటీషర్లపై ఒక తెగ దాడి సందర్భంగా తొలిసారిగా కుకీల ప్రస్తావన వినిపించింది. బ్రిటీష్ రచనల్లో కుకీలను పాత కుకీలు, కొత్త కుకీలుగా విభజించారు. ఆంగ్లో, బర్మా యుద్ధం (1824–1826) జరిగినప్పుడు బర్మా నుంచి వచ్చినవారే కొత్త కుకీలు అని బ్రిటీష్ రచనల ద్వారా తెలుస్తోందని రచయిత, చరిత్రకారుడు మలేమ్ నింగ్‌తౌజ వెల్లడించారు.

### అప్పట్నుంచే మెయిటీల డిమాండ్

1819లో మణిపూర్‌పై బర్మా దురాక్రమణకు దిగింది. దీంతో మణిపూర్ రాజులు బ్రిటీష్ సాయం కోరారు. అప్పట్నుంచి 1891 వరకు మణిపూర్ తెల్లదొరల సంరక్షణలో ఉంది. తర్వాత సంస్థానాధీశుల చేతికొచ్చింది. సంస్థలన్నీ భారత్‌లో విలీనమయ్యాయి. స్వాతంత్య్రం తర్వాత 1949 సంవత్సరం అక్టోబర్ 15 నుంచి మణిపూర్ అధికారికంగా భారత్‌లో అంతర్భాగమైంది. ఆ సమయంలో మెయిటీలకు ఎస్టీ హోదా ఇవ్వాలన్న చర్చ వచ్చింది. కానీ అది కార్యరూపం దాల్చలేదు.

### కుకీలకు తెల్లదొరల అండ

బ్రిటీష్ పాలకుల అండదండలతో కుకీలు మణిపూర్ కొండప్రాంతాల్లో స్థిరపడ్డారు. నాగా తెగల దాడుల నుంచి లోయ ప్రాంతాలను రక్షించే పనిలో ఉండేవారు. ఓ రకంగా బ్రిటీష్ పాలకుల కిరాయి సైన్యంగా పని చేసేవారు. తెల్లదొరలు తమ వ్యూహంలో భాగంగా ఒక తెగకి వ్యతిరేకంగా మరో తెగని, వారికి వ్యతిరేకంగా ఇంకో తెగవారిని ప్రోత్సహించారు. కొండ ప్రాంతాల్లో కుకీల ప్రాబల్యం పెరిగిపోవడానికి బ్రిటీష్ వారి వ్యూహాలే కారణమని మలేమ్ నింగ్‌తౌజ అభిప్రాయపడ్డారు.

### నేటి ఘర్షణలకు మూలం

మణిపూర్ ఘర్షణలపై కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. లోయ ప్రాంతాల్లో నివసించే మెయిటీలు ఎస్టీ హోదా కోసం డిమాండ్ చేస్తూ ఉంటే కొండప్రాంతంలో ఎస్టీ హోదా ఉన్న కుకీలు తమకు ప్రత్యేక పరిపాలనా యంత్రాంగం కావాలని పట్టుబడుతూ ఉండడంతో మూడు నెలలుగా హింస చెలరేగుతోంది. 1949 తర్వాత మయన్మార్ నుంచి అక్రమ వలసదారులు భారీగా వచ్చి కుకీ సమాజంలో కలిసిపోయారని అదే నేటి ఘర్షణలకు మూలమని రచయిత, చరిత్రకారుడు నింగ్‌తౌజ తెలిపారు. మణిపూర్ చరిత్రతో నేటి ఘర్షణలకు సంబంధం లేదని ఆయన చెబుతున్నారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి నివాసం ఏర్పాటు చేసుకున్న అక్రమ వలసదారుల్ని ఏరివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు కుకీలలో ఆందోళనకు దారి తీస్తున్నాయి. ఈ ఏడాది మార్చిలో మణిపూర్‌కు చెందిన కొన్ని సంస్థలు ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ప్రదర్శన నిర్వహిస్తూ 1951 తర్వాత అక్రమంగా వచ్చిన వలసదారుల్ని రాష్ట్రం నుంచి తరిమివేయాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ కాలంగా ఉన్న ఈ సమస్యలు, సవాళ్లతోనే మణిపూర్ జాతుల సంఘర్షణ సంక్లిష్టంగా మారింది.

– సాక్షి, నేషనల్ డెస్క్



సమావేశానికి విచ్చేస్తున్న మోదీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

# ఐక్యత పరీక్షకే అవిశ్వాసం

- విపక్ష కూటమిపై ప్రధాని విసుర్లు
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ మాదే విజయం
- అవినీతి, బుజ్జగింపు రాజకీయాలను తరిమికొట్టడానికి ఈ నెల 9న 'క్విట్ ఇండియా'

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభలో ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. విపక్ష కూటమిలో ఐక్యతను, ఒకరిపై ఒకరికి నమ్మకం ఉందో లేదో పరీక్షించుకోవడానికే ఈ అవిశ్వాసం పెట్టారని ఎద్దేవా చేశారు. విపక్ష 'ఇండియా' కూటమిలో లుకలుకలు ఉన్నాయని చెప్పారు. మంగళవారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో తమ ఎంపీలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఢిల్లీ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇది సెమీ–ఫైనల్ విజయమని అన్నారు. బీజేపీ రాజ్యసభ సభ్యులకు అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభలో తమకు సంపూర్ణ మెజార్టీ ఉందనే విషయం తెలిసీ కలిసి ఉన్నామో లేదో పరీక్షించుకోవడానికే విపక్ష కూటమి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిందన్నారు. ఢిల్లీ బిల్లుపై రాజ్యసభలో జరిగిన ఓటింగ్‌లో ఆశించిన దానికంటే తమకు ఎక్కువ ఓట్లు వచ్చాయని మోదీ చెప్పారు.

**'సిక్సర్లు' కొట్టాలి**

వరుసగా మూడో పర్యాయం తాను ప్రధాని కావడం తథ్యమని మోదీ పరోక్షంగా తేల్చిచెప్పారు. రైల్వే శాఖ సంబంధిత పనుల కోసం ఎంపీలు ఇక ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉండదని, వారి డిమాండ్లను పరిష్కరించేలా రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చక్కటి ప్రణాళిక తయారు చేశారని వివరించారు. లోక్‌సభ ఎన్నికల ముందు జరగబోతున్న అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ 'సిక్సర్లు' కొట్టాలని బీజేపీ ఎంపీలకు మోదీ పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకులు మరోవైపు వారసత్వ రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాలు, అవినీతి రాజకీయాలు చేస్తున్నారని ప్రధాని మండిపడ్డారు. బంధుప్రీతి, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలను దేశం నుంచి తరిమికొట్టడానికి ఈ నెల 9న జరిగే 'క్విట్ ఇండియా' కార్యక్రమంలో ఎంపీలంతా పాల్గొనాలని కోరారు. అలాగే 'విభజన అకృత్యాల సంస్మరణ దినం' సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ మన లక్ష్యమని, ఇందు కోసం ప్రజలంతా కృషి చేయాలని, ఈ దిశగా ప్రజలతో ప్రతిజ్ఞలు చేయించాలని మోదీ కోరారు.

# రాహుల్‌కు మళ్లీ అదే బంగ్లా

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి లోక్‌సభ సభ్యత్వం తిరిగి పునరుద్ధరించడంతో ప్రభుత్వం ఆయనకు తుగ్లక్ లేన్‌లోని మునుపటి 12వ నంబర్ బంగ్లాను తిరిగి కేటాయించింది. మోదీ ఇంటిపేరు వ్యాఖ్యల పరువు నష్టం కేసులో సూరత్ కోర్టు జైలు శిక్ష విధించడంతో రాహుల్ లోక్‌సభ సభ్యత్వం కోల్పోయారు. దీంతో, అప్పటి వరకు, దాదాపు రెండు దశాబ్దాలపాటు నివాసం ఉన్న తుగ్లక్ లేన్‌లోని ప్రభుత్వ బంగళాను ఖాళీ చేయాల్సి వచ్చింది. సూరత్ కోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో తిరిగి లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరించారు. అదేవిధంగా, ఆయనకు తిరిగి తుగ్లక్ లేన్‌లోని అదే బంగ్లాను మంగళవారం కేటాయించింది. దీనిపై రాహుల్ స్పందిస్తూ..ఈ దేశమే తనకు ఇల్లు అంటూ ట్వీట్ చేశారు.





వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయాన్ని అనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదులో సర్వే చేస్తున్న పురావస్తుశాఖ అధికారులు. మసీదు ఉత్తరం గోడ, గుమ్మటం, పునాది పరిశీలించారు. మసీదు కమిటీ, హిందూ పక్షం సభ్యులు సర్వే సమయంలో అక్కడే ఉన్నారు.

# లోక్‌సభలో గరంగరం

### అవిశ్వాస తీర్మానంపై పార్లమెంట్ దిగువ సభలో ప్రారంభమైన చర్చ

అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే సహా పలువురు విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. దేశంలో సమాఖ్య వ్యవస్థను ప్రధాని మోదీ ధ్వంసం చేస్తున్నారని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగతారాయ్ ఆరోపించారు. శివసేన ఎంపీ, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే సభలో కాసేపు హనుమాన్ చాలీసా పఠించారు. అవిశ్వాస తీర్మానంపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్, సీపీఎం నేత ఎ.ఎం.ఆరిఫ్, బీజేపీ సభ్యుడు నారాయణ్ రాణే, కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ తదితరులు మాట్లాడారు. అవిశ్వాస తీర్మానంపై కాంగ్రెస్ తరఫున మాట్లాడేవారి జాబితాలో తొలుత రాహుల్ గాంధీ పేరును చేర్చారు. కానీ, చివరి క్షణంలో తొలగించారు.

**మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించండి**

మణిపూర్‌లో హింస, సరిహద్దుల్లో చైనా సైనికుల చొరబాట్లపై మోదీ ఎందుకు నోరువిప్పడం లేదని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ఆ పార్టీ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ నిలదీశారు. ప్రధాని మౌనం వీడేలా చేయడానికే కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని చెప్పారు. మంగళవారం సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చను గౌరవ్ గొగోయ్ ప్రారంభించారు. ''ప్రధాని మోదీ మణిపూర్‌ను ఇప్పటిదాకా ఎందుకు సందర్శించలేదు? రాష్ట్రంలో హింసాకాండపై కేవలం 30 సెకండ్లపాటు స్పందించడానికి 80 రోజుల దాకా ఎందుకు వేచిచూశారు? మణిపూర్ ముఖ్యమంత్రిని పదవి నుంచి ఎందుకు తొలగించలేదు?'' అని ప్రశ్నలు సంధించారు.

### రాజధర్మం పాటించడం లేదు



దివంగత ప్రధాని వాజ్‌పేయి 'రాజధర్మానికి' మద్దతుగా నిలిచారు. కానీ, ఇప్పుడు మహిళలను నగ్నంగా ఊరేగించినా మనం రాజధర్మం పాటించడం లేదు. మణిపూర్‌లో జరిగిన అకృత్యాలను ప్రపంచమంతా ఖండించింది. దీనిపై యూరోపియన్ యూనియన్ పార్లమెంట్‌లోనూ చర్చ జరిగింది. ప్రధాని మోదీ వైఖరిని బ్రిటిష్ పార్లమెంట్ సైతం తప్పుపట్టింది. చెడును సంహరించాలన్నదే మా లక్ష్యం. అందుకే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తున్నాం - టి.ఆర్.బాలు, డీఎంకే సభ్యుడు

### అవిశ్వాసానికి సమయం కాదు

ప్రభుత్వంపై విపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ఇది సరైన సమయం కాదు. ప్రధాని మోదీ ప్రపంచ నేతగా ఎదిగారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారబోతోంది. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం అవసరమే లేదు. ప్రతిపక్షాలు ఇలాంటివి మానాలి. - కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి

### విపక్షాలు ఇక ఇంటికే..

''ఇండియా అని పేరుపెట్టుకున్న విపక్ష కూటమిలో జగడాలు ముదురుతున్నాయి. పేదలకు మంచి చేసిన నాయకుడికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానమిది. వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత విపక్షాలు మళ్లీ సభలో అడుగుపెట్టవు. ఎన్డీయే 400కు పైగా సీట్లు లభించడం ఖాయం''

- నిషికాంత్ దూబే, బీజేపీ ఎంపీ

గొగోయ్ ఇంకా ఏం మాట్లాడారంటే...

**తప్పులను అంగీకరించడం మోదీకి ఇష్టం లేదు**

''మణిపూర్‌లో తెగల మధ్య ఘర్షణను, హింసను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర హోంశాఖ, జాతీయ భద్రతా సలహాదారు ఘోరంగా విఫలమయ్యారు. చేసిన పొరపాట్లను అంగీకరించడానికి ప్రధాని మోదీ ఇష్టపడడం లేదు. మణిపూర్‌లో విభజన జరిగితే దేశంలో విభజన జరిగినట్లే. అందుకే ఈ అంశంపై మోదీ పార్లమెంట్‌లో మాట్లాడాలని డిమాండ్ చేస్తున్నాం. మణిపూర్‌లో శాంతి కోసం మోదీ కనీసం పిలుపు కూడా ఇవ్వకపోడం విచారకరం. ప్రజలు సమస్యల్లో ఉన్నప్పుడు మోదీ అధికారం కోసం ఓట్ల వేట సాగించారు. దేశం కంటే అధికారమే ముఖ్యమనుకున్నారు. ఇదేనా జాతీయవాదం? ఒకే దేశం(వన్ ఇండియా) అని చెబుతున్న మోదీ ప్రభుత్వం రెండు మణిపూర్‌లను సృష్టిస్తోంది. 2002లో గుజరాత్‌లో మత కలహాలు చెలరేగినప్పుడు అప్పటి ప్రధాని వాజ్‌పేయి అక్కడ పర్యటించారు. ఇప్పటి ప్రధాని మణిపూర్‌కు దూరంగా ఉంటున్నారు. సమాధానం చెప్పాల్సిన పరిస్థితి వచ్చినప్పుడల్లా మోదీ మౌనాన్ని ఆశ్రయిస్తున్నారు. మణిపూర్‌లో శాంతి కోసం చొరవ తీసుకోవాల్సిన ప్రధానమంత్రి విపక్ష కూటమిపై విమర్శలు చేయడంలో బిజీగా ఉన్నారు. ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకోవడానికి విద్వేషం ఒక ఆయుధంగా మారడం దురదృష్టకరం. మీ 'విద్వేష దుకాణం' ముందు మా 'ప్రేమ దుకాణాన్ని' తెరుస్తాం. దేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని మీరు పెద్ద పెద్ద మాటలు చెబుతున్నారు, అదే మాట ఒక నిరుపేద కూరగాయల విక్రేత ఎదుట చెప్పగలరా?'' అని గౌరవ్ గొగోయ్ ప్రశ్నించారు.

# రాజ్యసభలో హైడ్రామా

## డెరెక్ ఒబ్రియాన్ సస్పెన్షన్.. ఆపై ఉపసంహరణ

**న్యూఢిల్లీ:** టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ సస్పెన్షన్ అంశంపై మంగళవారం రాజ్యసభలో హైడ్రామా నడిచింది. మంగళవారం సభ ఆరంభం కాగానే తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ మణిపూర్ అంశంపై చర్చించాలంటూ పట్టుబట్టారు. దీంతో చైర్మన్ ధన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా కార్యకలాపాలకు పదేపదే అడ్డుతగులుతున్న ఒబ్రియాన్‌ను సభ నుంచి వెళ్లిపోవాల్సిందిగా కోరారు. సభా మర్యాదకు భంగం కలిగిస్తున్నందుకు ఆయనను వర్షాకాల సమావేశాల నుంచి సస్పెండ్ చేస్తూ రాజ్యసభలో నేత గోయల్ తీర్మానం ప్రవేశపెట్టారు. కాంగ్రెస్‌కు చెందిన ప్రమోద్ తివారీ సహా పలువురు సభ్యులు ఒబ్రియాన్ పట్ల సౌమ్యంగా వ్యవహరించాలని చైర్మన్‌ను కోరారు. స్పందించిన ధన్‌ఖడ్.. ఒబ్రియాన్ తిరిగి సమావేశాలకు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కాగా, ప్రతిపక్ష నేతలపై అభ్యంతర వ్యాఖ్యలు చేసిన పీయూష్ గోయెల్‌పై 'ఇండియా' కూటమి నేతలు సభా హక్కుల నోటీసు ఇచ్చారు. న్యూస్‌క్లిక్ వెబ్‌పోర్టల్‌కు నిధులందాయంటూ గోయెల్ చేసిన ఆరోపణలపై విపక్ష పార్టీల నేతలు మంగళవారం రాజ్యసభ చైర్మన్‌కు ఈ మేరకు నోటీసు అందజేశారు.



మాట్లాడుతున్న ఎంపీ డెరెక్

# తీవ్ర తుపానుతో అమెరికా అతలాకుతలం

**వాషింగ్టన్:** అమెరికాలోని తూర్పు తీర రాష్ట్రాలను భీకర తుపాను వణికిస్తోంది. బలమైన గాలులు, భారీ వర్షాలకు సంబంధించిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు చనిపోయారు. విద్యుత్ వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. టెన్నెస్సీ నుంచి న్యూయార్క్ వరకు 10 రాష్ట్రాల్లోని 11 లక్షల నివాసాల్లో అంధకారం అలుముకుంది. సుమారు 3 కోట్ల మందిపై తుపాను ప్రభావం పడింది. తమ ప్రాంతంలోని విద్యుత్ లైన్లను మరమ్మతు చేసేందుకు కొన్ని రోజులు పట్టవచ్చని నాక్స్‌విల్లె యుటిలిటీ బోర్డ్ తెలిపింది. అలబామాలోని ఫ్లోరెన్స్‌లో సోమవారం పిడుగుపాటుకు ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. సౌత్ కరోలినాలోని



అండెర్సన్ కౌంటీలో చెట్టు కూలి పడటంతో ఓ బాలుడు(15) చనిపోయాడు. భారీ వర్షాలు, గంటకు 70 మైళ్ల వేగంతో బలమైన గాలులు వీస్తుండటంతో విమాన, రోడ్డు రవాణా వ్యవస్థ స్తంభించింది. ఎనిమిది వేల విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. మరో 2,600 విమాన సర్వీసులు రద్దయ్యాయి. తూర్పు తీర ప్రాంతం వైపు రావాల్సిన విమానాలను దారి మళ్లించినట్లు ఫెడరల్ ఏవియేషన్ తెలిపింది. వందలాదిగా ఇళ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి. చెట్లు కూలి రహదారులు, నివాసాలపై పడిపోయాయి. విధులకు హాజరైన ఉద్యోగులను తుపాను కారణంగా ముందుగానే ఇళ్లకు చేరుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవలి కాలంలో ఇంతటి తీవ్ర తుపాను ఇదేనని జాతీయ వాతావరణ విభాగం పేర్కొంది.



### కారు... పై ఫ్లోరు

రోడ్డుపై వేగంగా వెళ్తున్న కారు కల్వర్టు అంచును ఢీకొట్టి అదే వేగంతో పక్కనే ఉన్న ఓ నివాస భవనం అంతస్తులోకి దూసుకెళ్లింది. అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రం డెకటూర్ టౌన్‌షిప్‌లో ఈ నెల ఆరోతేదీన ఈ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. అగ్నిమాపక దళ సిబ్బంది దాదాపు మూడు గంటలపాటు కష్టపడి కారును కిందికి దించారు. గాయపడిన కారు డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు.

### ఈశాన్యంలో పర్యటిస్తున్నాం: రిజిజు

**న్యూఢిల్లీ:** ప్రతి 15 రోజులకోసారి ఈశాన్య రాష్ట్రాలను సందర్శించాలంటూ ప్రధాని మోదీ తమను ఆదేశించారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన లోక్‌సభలో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి కేబినెట్ సమావేశంలో కేంద్ర మంత్రులతో మోదీ ఒక బృందాన్ని ఏర్పాటు చేశారని, ఇందులో ఐదుగురు కేబినెట్ మంత్రులు, ఏడుగురు సహాయ మంత్రులు ఉన్నారని తెలిపారు. ప్రతి 15 రోజులకోసారి ఈశాన్యంలో పర్యటించాలంటూ ఈ బృందాన్ని ఆదేశించారని పేర్కొన్నారు. ప్రధాని ఆదేశాల ప్రకారం ఈశాన్యంలో పర్యటిస్తున్నట్లు వివరించారు. ఢిల్లీ నుంచి పాలించడం కాదు, నేరుగా ప్రజలకు వద్దకు వెళ్లాలని అధికారులను సైతం మోదీ ఆదేశించారని పేర్కొన్నారు. కిరణ్ రిజిజు వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్‌లో గత 97 రోజుల్లో కేంద్ర మంత్రులు ఎవరెవరు ఎప్పుడు పర్యటించారో చెప్పాలని, దమ్ముంటే వివరాలు బయటపెట్టాలని రిజిజుకు సవాలు విసిరారు. ఈ మేరకు ట్వీట్ చేశారు.

### రిటైరయ్యాక .. అభిప్రాయమే

**సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్**

**న్యూఢిల్లీ:** న్యాయమూర్తులు పదవీ విరమణ చేసిన తర్వాత ఏం మాట్లాడినా అది వారి అభిప్రాయమే అవుతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. వారి వ్యాఖ్యలతో న్యాయవ్యవస్థకు ఎలాంటి సంబంధం ఉండదన్నారు. ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్ నేత మొహమ్మద్ అబ్దుల్ లోన్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ డీవై చంద్రచూడ్ మంగళవారం విచారణ చేపట్టారు. రాజ్యాంగ నిర్మాణంపై న్యాయశాస్త్ర కోణంలో చర్చ జరగాలని సోమవారం రాజ్యసభలో రిటైర్డ్ న్యాయమూర్తి రంజన్ గొగోయ్ చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చాయి. దీనిపై జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పందిస్తూ.. పదవీ విరమణ చేసిన జడ్జిల వ్యాఖ్యలు వారి అభిప్రాయాలే అవుతాయని స్పష్టం చేశారు.

### వాట్సాప్‌లో ఇక స్క్రీన్ షేరింగ్

**న్యూఢిల్లీ:** మెసేజింగ్ యాప్ వాట్సాప్‌లో మరో రెండు కొత్త సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. అవి స్క్రీన్ షేరింగ్, వీడియో కాల్స్‌కు ల్యాండ్ స్కేప్ మోడ్. వాట్సాప్ మాతృసంస్థ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మంగళవారం ఈ విషయం ఫేస్‌బుక్ ద్వారా ప్రకటించారు. వాట్సాప్ కాల్ మాట్లాడుతూ లైవ్‌లోనే స్క్రీన్ షేర్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అదేవిధంగా, వీడియో కాల్ సమయంలో కావాలనుకుంటే ల్యాండ్ స్కేప్ మోడ్‌లోకి కూడా మార్చుకోవచ్చు.

### 'భారత్ దగ్గు మందు సురక్షితం కాదు'

**జెనీవా:** ఇరాక్‌లో విక్రయిస్తున్న భారత్ తయారీ దగ్గు మందు సురక్షితం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. దగ్గు మందు తయారీలో వాడే పదార్థాలు పరిమితికి మించి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. చెన్నైకు చెందిన ఫోర్ట్స్ ల్యాబోరేటరీస్ కంపెనీ తయారు చేసిన కోల్డ్ అవుట్ అనే దగ్గు మందును ఇరాక్‌కు చెందిన దాబిలైఫ్ ఫార్మాకు విక్రయించింది. ఈ మందులో డైథిలీన్ ఇథలీన్ మోతాదుకు మించి ఉన్నట్టుగా డబ్ల్యూహెచ్ఓ గుర్తించింది. చిన్నారులు ఈ మందు తాగితే అత్యంత ప్రమాదకరమని హెచ్చరించింది.

### అస్సాం రైఫిల్స్‌పై ఎఫ్ఐఆర్

**విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటున్న పోలీసులు**

**ఇంఫాల్:** అస్సాం రైఫిల్స్ జవాన్లపై మణిపూర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని, సాయుధ దుండగుల్ని వెంబడించకుండా అస్సాం రైఫిల్స్ సిబ్బంది తమను అడ్డుకున్నారని ఆ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆగస్టు 5నే ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది. బిష్ణుపూర్‌లో గత శనివారం ముగ్గురిని చంపిన వారిని అరెస్ట్ చేయకుండా అస్సాం రైఫిల్స్ సిబ్బంది అడ్డుకున్నారని పోలీసులు ఆరోపించారు. అస్సాం రైఫిల్స్ సిబ్బందికి వ్యతిరేకంగా మహిళలు ఆందోళనలకు దిగడంతో ప్రభుత్వం వారి స్థానంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని రంగంలోకి దింపింది.

# సాక్షి కరీంనగర్

బుధవారం । 9 । ఆగస్టు । 2023




## స్టూడెంట్స్‌ను చితకబాదిన టీచర్

కరీంనగర్ కార్ఖానగడ్డ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు అల్లరిచేస్తున్నారనే కారణంతో సుమారు 25 మంది విద్యార్థులను చితకబాదాడు. విషయం తెలిసిన పేరెంట్స్ స్కూల్ ఎదుట ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని కోరారు. పోలీసులు బాధ్యుడైన టీచర్‌పై కేసు నమోదు చేశారు.

– వివరాలు 8లో..



పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

## న్యూస్‌రీల్

### గ్రామీణ రోడ్లు విస్తరించాలని కేంద్ర మంత్రికి ఎంపీ వినతి



కరీంనగర్ టౌన్: కరీంనగర్ పార్లమెంటు పరిధిలో గ్రామీణ రహదారులను విస్తరించాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కేంద్ర మంత్రి గడ్కరీని కోరారు. ఈ మేరకు ఢిల్లీలో వినతిపత్రం అందించారు. నియోజకవర్గం పరిధిలో అవసరమైన చోట వారధులు నిర్మించడం, సెంట్రల్ రోడ్డు అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) కింద వెంటనే అభివృద్ధి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

### ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న టీఎన్జీవో నేతలు

కరీంనగర్ అర్బన్: ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డా.బి.గోపిని కలిసి వినతిపత్రం అందజేశారు. పునర్విభజన ద్వారా అలోకేట్ అయిన వీఆర్వోలకు ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. తక్షణమే స్పందించిన కలెక్టర్‌కు టీఎన్జీవోలు ధన్యవాదములు తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, కోశాధికారి కిరణ్ కుమార్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్ తదితరులు ఉన్నారు.

### బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ సి.రాజు

కరీంనగర్‌క్రైం: బ్లూకోల్ట్స్, పెట్రోకార్ పోలీసులు డయల్ 100, ఇతర మార్గాల ద్వారా ఏదైన ఫిర్యాదులు అందిన సత్వరమే స్పందించి సేవలందించాలని అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సి.రాజు అన్నారు. సంబంధిత విభాగాలకు చెందిన పోలీసులకు మంగళవారం కమిషనరేట్‌కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. గతంలో నేరాలకు పాల్పడిన వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అన్నారు. అక్రమ, అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నియంత్రించబడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై శాఖాపరంగా చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఏసీపీ కాశయ్య పాల్గొన్నారు.


### నగరంలో డెంగీ జాడలు

- పద్మనగర్‌లో ఒకరికి గుర్తింపు



నీటిని తొలగిస్తున్న అధికారులు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో డెంగీ జాడలు భయపెడుతున్నాయి. ఈ వర్షాకాలం సీజన్‌లో తొలిసారి నగరంలోని పద్మనగర్‌లో వెలుగు చూడడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నగరంలోని 16వ డివిజన్ పరిధిలోని పద్మనగరలో ఓ వ్యక్తికి డెంగీ నిర్ధారణ అయింది. ఇటీవల జ్వర బారిన పడిన సదరు వ్యక్తికి రక్తపరీక్షలు చేయగా, డెంగీ సోకినట్లు గుర్తించారు. దీంతో స్థానిక కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం బాధితుడి ఇంటితో పాటు పరిసరాలను పరిశీలించారు. దాదాపు వంద ఇండ్లకు పైగా స్ప్రే చేయించారు. సమీప ఇండ్లల్లోని కూలర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, పూలకుండీల్లో నిలువ ఉన్న వర్షపు నీళ్లను తొలగించారు. కాగా ఈ వర్షాకాల సీజన్‌లో నగరంలో తొలి డెంగీ కేసు నమోదు కావడం కలకలం సృష్టిస్తోంది.





# కన్నారం నుంచే జైత్రయాత్ర!





"పాత కరీంనగర్.. ఉద్యమాల ఖిల్లా. తెలంగాణ ఉద్యమానికి సమరశంఖం పూరించిన జిల్లా.. ఇక్కడే పార్టీ పునాదులు నిర్మితమయ్యాయి, ఇక్కడ నుంచే తెలంగాణ గళం ఢిల్లీకి వినిపించింది. రెండుసార్లు గులాబీ పార్టీ అధికారంలోకి రావడంలో కరీంనగర్ పాత్ర మరువలేనిది. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 12 చొప్పున అసెంబ్లీ సీట్లు గెలుచుకున్నాం. ఈసారి 13 స్థానాలు గెలిచి చరిత్ర సృష్టించాలి. జిల్లాలో పార్టీ గ్రాఫ్ బాగుంది. అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉన్నాం. చేసిన పని ప్రజలకు వివరించండి. ఉద్యమస్ఫూర్తితో ముందుకుపోదాం. ఎన్నికల జైత్రయాత్ర కరీంనగర్ నుంచే మొదలుపెడదాం. అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలన్నది సీఎం అభిలాష. ఇది పెద్ద కష్టమేమీ కాదు"

– బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు ఉమ్మడి జిల్లా నేతలతో హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో చేసిన దిశానిర్దేశం

- 13 స్థానాలు కైవసం చేసుకోవాలె
- గత తప్పిదాలు పునరావృతం కావొద్దు
- ఉమ్మడి జిల్లా గులాబీ లీడర్లకు కేటీఆర్ దిశానిర్దేశం
- గంగుల, హరీశ్, వినోద్, భానుప్రసాద్‌కు అదనపు బాధ్యతలు
- పెద్దపల్లి జిల్లాపై స్పెషల్ ఫోకస్ పెట్టిన అధిష్టానం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ సమావేశాలు ముగిశాయి. దాదాపుగా చివరి అసెంబ్లీ సమావేశాలు కావడంతో మంత్రి గంగుల కమలాకర్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు హైదరాబాద్‌లో విందు ఏర్పాటు చేశారు. కొంతకాలంగా చొప్పదండి, రామగుండం ప్రాంతాల్లో నేతలు తిరుగుబాటుకు సిద్ధమవుతున్న వేళ ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. పాత కరీంనగర్ జిల్లాకే చెందిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ స్థితిగతులకు సంబంధించిన పూర్తి సమాచారం తన వద్ద ఉందని... ఎప్పటికప్పుడు తనకు పార్టీ గ్రాఫ్‌పై నివేదికలు అందుతున్నాయని మంత్రి కేటీఆర్ వారితో అన్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఇంతకాలం ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ''మూడు గంటల కరెంటు'' వ్యాఖ్యలతో విశ్వసనీయత కోల్పోయిందని... బీసీ బంధు, గృహలక్ష్మి, మైనార్టీ బంధు, విద్యా కానుక వంటి పథకాలతో ప్రజల్లో పార్టీ గ్రాఫ్ మరింత పెరిగిందని వివరించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నచోట అందరికీ సానుకూలంగానే ఉందని ప్రశంసించినట్లు తెలిసింది. ఉత్తర తెలంగాణకు గుండెకాయ అయిన పాత కరీంనగర్ జిల్లాలో ఈసారి ఎలాగైనా 13 స్థానాలు గెలవాలని.. ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయొద్దని స్పష్టం చేశారు.

**నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలు..**

హైదరాబాద్‌లో మంగళవారం మరో కీలక సమావేశం జరిగింది. ప్రతికూల అంశాలు పార్టీ విజయావకాశాలను ఏమాత్రం ప్రభావం చూపకుండా ఉండాలని పార్టీ నిర్ణయించింది. పార్టీలో మెరుగైనగ్రాఫ్ ఉన్న నాయకులను ఇతర నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలుగా నియమించారు. కరీంనగర్‌లో బలమైన అభ్యర్థిగా ఉన్న గంగుల కమలాకర్ (62శాతం గ్రాఫ్)కు అదనంగా చొప్పదండి నియోజకవర్గం అప్పగించారు. మానకొండూరు బాధ్యతలను ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌కు ఇచ్చారు. కీలకమైన హుస్నాబాద్ అసెంబ్లీకి మంత్రి హరీశ్‌రావు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. పెద్దపల్లి జిల్లాలో ముగ్గురు అభ్యర్థుల బాధ్యతలను ఎమ్మెల్సీ భానుప్రసాద్‌కు అప్పగించారు. జగిత్యాల జిల్లా బాధ్యతలను మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ చూస్తారని తెలిసింది.

**పెద్దపల్లి జిల్లాపై స్పెషల్ ఫోకస్..**

2018 అసెంబ్లీ ఎన్నికల్లో పాత జిల్లాలోని కరీంనగర్‌లో ఐదు (తర్వాతి కాలంలో హుజూరాబాద్ బీజేపీ వశమైంది), సిరిసిల్లలో రెండు, జగిత్యాలలో మూడుస్థానాలను బీఆర్ఎస్ క్లీన్‌స్వీప్ చేసింది. కానీ...పెద్దపల్లిలో మాత్రం సీన్ రివర్స్ అయింది. అక్కడ మూడుస్థానాలకు ఒకటే గులాబీ పార్టీ గెలుచుకుంది. మంథనిలో శ్రీధర్‌బాబు (కాంగ్రెస్), రామగుండంలో కోరుకంటి చందర్ (ఏఐఎఫ్‌బీ)లు విజయం సాధించారు. వెంటనే కోరుకంటి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పుడు కూడా పెద్దపల్లి జిల్లాలో మూడుస్థానాల్లో కాంగ్రెస్ గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిపై రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతుందన్న సమాచారంతో.. ఆ లోటును పూడ్చేందుకు ఎమ్మెల్సీ భానుప్రసాద్‌కు పార్టీ పెద్దపల్లి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

## డీలర్లకు కమీషన్ పెంపు

- జిల్లాలో 566మందికి ప్రయోజనం

కరీంనగర్ అర్బన్: రేషన్ డీలర్ల సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. గత కొంతకాలంగా గౌరవ వేతనం, హెల్త్‌కార్డు, మెయింటెనెన్స్ గ్రాంట్ తదితర డిమాండ్లతో ఆందోళన చేపట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో గౌరవ వేతనం మినహాయిస్తే ఇతర డిమాండ్లకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. జిల్లాలో 566 మంది డీలర్లుండగా వారందరికీ కమీషన్ పెంపు వర్తించనుంది. ఇప్పటివరకు మెట్రిక్ టన్నుకు రూ.900 కమీషన్ ఇస్తుండగా ఇకపై రూ.1400 ఇవ్వనున్నారు. కరోనా కాలంలో జిల్లాలో 8మంది మరణించగా వారి కుటుంబసభ్యులను కారుణ్య నియామకం కింద డీలర్‌గా నియమించనున్నారు. ప్రతీ డీలర్‌కు రూ.5లక్షల బీమా ఇవ్వనుండగా, కుటుంబసభ్యులను ఆరోగ్య శ్రీ పరిధిలోకి చేర్చనున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద కచ్చితమైన తూకం కోసం వే బ్రిడ్జిలను ఏర్పాటు చేయనుండగా కరీంనగర్, చొప్పదండి, జమ్మికుంట, హుజూరాబాద్ పాయింట్లలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. అధికారుల తనిఖీల్లో 1.5క్వింటాళ్ల తేడా వస్తే కేసు నుంచి మినహాయించనుండగా అంతకుమించి తేడా వస్తే కేసులు నమోదు చేయనున్నారు. డీలర్ షిప్ రెన్యువల్‌ను అయిదేళ్లకు, కారుణ్య నియామకాలకు 40నుంచి 50ఏళ్లకు వయోపరిమితిని పెంచారు. అంత్యక్రియలకు తక్షణ సాయంగా రూ.10వేలు ఇవ్వాలని నిర్ణయించింది.

## రూ.లక్ష సాయం నిధులు విడుదల

- జిల్లాకు రూ.12 కోట్లు
- 1200మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీకి ఏర్పాట్లు

కరీంనగర్‌రూరల్: బీసీల్లో చేతి, కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూన్ 2 నుంచి 20వ తేదీ వరకు ప్రజల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. ఎంపీడీవోల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అర్హులను గుర్తించి జాబితాను ఉన్నతాధికారులకు పంపించారు. జూలై 15న కరీంనగర్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ కొందరికి చెక్కులను పంపిణీ చేసి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం ప్రభుత్వం జిల్లాకు రూ.12కోట్ల నిధులు మంజూరు చేసింది.

**1200 మందికి సాయం**

జిల్లాలో మొత్తం19,095 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 300మంది చొప్పున కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో మొత్తం 1200మందికి సాయం చేయాలని నిర్ణయించారు. జూన్15 పథకం ప్రారంభరోజున 52మందికి చెక్కులను మంత్రి గంగుల కమలాకర్ అందించారు. మిగితా అర్హులందరికి సాయం అందుతుందని బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజమనోహర్ రావు తెలిపారు.

# రుణాల టార్గెట్ రీచ్ కావాలి



బాలుడిని దత్తత ఇస్తున్న కలెక్టర్ బి.గోపి

- చిన్నచిన్న కారణాలతో బ్యాంకర్లు తిరస్కరిస్తే సహించం
- కలెక్టర్ బి.గోపి

కరీంనగర్ అర్బన్: నిర్దేశిత లక్ష్యం మేరకు బ్యాంకులు రుణాలను ఇవ్వాలని కలెక్టర్ బి.గోపి బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూన్ త్రైమాసికం వరకు జరిగిన ప్రగతిపై బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూన్ నెల వరకు రూ.3512.63 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు గానూ రూ.1563.60కోట్లు, ఎంఎస్ఎంఈ రంగంలో రూ.914.31కోట్లు, విద్యా రుణాలకు రూ.3.23కోట్లు, హౌసింగ్ లోన్స్ రూ.79.44 కోట్లు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లకు రూ.182 కోట్లు, ఇతర రంగాలకు సంబంధించి రూ.770.05కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. అర్హులైన రైతులందరికీ రుణాలు మంజూరు చేయాలని, అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద రూ.94.98 కోట్లు రుణాలు అందించాలని ఆదేశించారు. పరిశ్రమల రుణాలను చిన్నచిన్న కారణాలతో తిరస్కరించవద్దని బ్యాంకర్లకు సూచించారు. ఎల్‌డీఎం ఆంజనేయులు, ఆర్బీఐ అధికారి డెబిజిత్ బరువా, నాబార్డు ఏజీఎం ప్రకాశ్, ఎస్బీఐ ఏజీఎం రవిశేఖర్, యూబీఐ ఏజీఎం కలీం, టీజీబీ ఏజీఎం లక్ష్మణ్‌రావు, కేడీసీసీబీ సీఈఓ సత్యనారాయణ, పరిశ్రమల మేనేజర్ నవీన్, బీసీడబ్ల్యూవో రాజమనోహర్, డీఆర్‌డీవో శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

**ఈవీఎం గోడౌన్ పరిశీలన**

ఈవీఎం గోడౌన్‌ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ డా.బి.గోపి మంగళవారం పరిశీలించారు. గోడౌన్‌లోని స్ట్రాంగ్ రూంను ప్రతి మూడు నెలలకోసారి పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. గోడౌన్ పరిసరాలను పరిశీలించి పలు అంశాలపై అధికారులను ఆరా తీశారు. గోడౌన్‌లో వర్షపు నీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

### బాలుడిని దత్తత తీసుకున్న ఇటలీ దంపతులు

కరీంనగర్: మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో శిశుగృహ నుంచి పదేళ్ల బాలుడిని ఇటలీదేశానికి చెందిన దంపతులకు మంగళవారం కలెక్టర్ డాక్టర్ బి.గోపి చేతుల మీదుగా దత్తత ఇచ్చారు. బాలుడి పర్యవేక్షణను సంబంధిత ఏజెన్సీ వారు మూడునెలలకోసారి పర్యవేక్షిస్తారని, నివేదికను పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

### జూనియర్ సివిల్ జడ్జిగా హుజూరాబాద్ వాసి



హుజూరాబాద్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంగళవారం విడుదలైన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాల్లో హుజూరాబాద్ పట్టణానికి చెందిన మ్యాకం రమ్య జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. స్థానిక ఆర్టీసీడిపోలో స్టోర్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న మ్యాకం సారయ్య కుమార్తె రమ్య జూనియర్ జడ్జిగా ఎన్నికకావడంపై హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్ష,ఉపాధ్యక్షులు కంకణాల భగవాన్‌రెడ్డి, యతిపతి అరుణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అభినందనలు తెలియజేశారు.

# ప్రశంస.. ఉన్నట్టా లేనట్టా?

- రెండు సార్లు మంగళం.. మరి ఈసారి?
- ఉద్యోగుల ఆసక్తి



| | |
|---|---|
| జిల్లాలో శాఖలు, విభాగాలు: | 65 |
| జిల్లా అధికారులు: | 60 |
| అధికారులు, ఉద్యోగులు: | 6,500 |
| నాలుగో తరగతి ఉద్యోగులు: | 132 |

కరీంనగర్ అర్బన్: ప్రతీ ఉద్యోగికి శాఖలో గుర్తింపు ఉండాలని కోరుకోవడం సహజం. అందుకనుగుణంగా నిబద్ధతతో పనిచేసేవారికి కొదువలేదు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరును కనబర్చే ఉద్యోగులు, అధికారులకు ప్రశంసలే ప్రోత్సాహన్నిస్తాయి. పోటీ వాతావరణాన్ని పెంపొందిస్తాయి. కానీ గతేడాది కాలంగా ఉత్తమ ఉద్యోగుల ఊసే లేకపోవడంతో ఉద్యోగుల్లో నైరాశ్యం అలుముకుంది. వేల మంది ఉద్యోగులు, అధికారులు వివిధ ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తుండగా ప్రశంసపత్రాలు అందని ద్రాక్షగా మారాయి. గత ఆగస్టు నుంచి సదరు ప్రక్రియ లేకపోవడంతో ఉద్యోగ లోకం నివ్వెరబోతోంది. మరీ ఈ సారైనా ఉంటాయా ఉండయా అన్నది స్పష్టత లేకపోగా ఊగిసలాట నెలకొంది.

**నాలుగు రోజులే వ్యవధి**

గణతంత్ర, స్వాతంత్య్ర, రాష్ట్ర ఆవతరణ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలివ్వడం పరిపాటి. అటెండర్ నుంచి జిల్లా అధికారి వరకు వారు చేసిన సేవలు, హాజరుశాతం, వ్యక్తిత్వం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఉత్తమ ఉద్యోగిగా, అధికారిగా గుర్తిస్తుంటారు. సుమారు 180 నుంచి 220 మందితో ఉత్తమ ఉద్యోగుల జాబితాను రూపొందిస్తుంటారు. అయితే స్వాతంత్య్ర దినోత్సవం ఈ నెల 15న కాగా ఇప్పటికే ఆయా శాఖలకు ఆదేశాలు అందాల్సి ఉండగా సదరు ప్రక్రియనే లేకపోవడంతో ప్రశంసపత్రాలు ఇస్తారా? ఇవ్వరా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 12న రెండో శనివారం, 13న ఆదివారం సెలవు కాగా నేటి నుంచి మూడు రోజులు మాత్రమే సమయముంది. ఈ నేపథ్యంలో ప్రశంసాపత్రాలు ఇస్తారన్నది అనుమానమే. ఈ నెల 7న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలపై సమావేశం నిర్వహించగా.. ప్రశంసపత్రాలపై క్లారిటీ వస్తుందని ఉద్యోగులు ఆశించారు. కానీ ఆ ఊసే లేకపోవడంతో ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**రెండుసార్లు మంగళమే..**

గత ఆగస్టు 15న ఉద్యోగులు, అధికారులకు ప్రశంసాపత్రాలు ఇవ్వగా అప్పటి నుంచి సదరు ప్రస్తావనే లేదు.గణతంత్ర దినోత్సవం, రాష్ట్ర ఆవతరణ దినోత్సవం రోజున ప్రశంసపత్రాలు ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న ఆయా రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి నగదు పారితోషికంతో సత్కరించేది. మూడేళ్లుగా ఆ ప్రస్తావన లేదు. ప్రభుత్వేతర రంగాలకు జూన్ 2 సముచిత గౌరవమివ్వగా సదరు కార్యక్రమాలు లేవు. ఇక ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు ప్రశంసపత్రాలు ఇవ్వడం లేదు. జిల్లాలో 65 విభాగాలుండగా అటెండర్ నుంచి అధికారి వరకు ఒక్కో విభాగంలో మూడు నుంచి నలుగురికి జాబితాలో చోటు దక్కేది. కీలకమైన రెవెన్యూ, పోలీస్‌శాఖల్లో ఎక్కువ మందికి ఈ అవకాశం లభించేది. గతంలో తీసుకున్నవారిని మినహాయించి పనితీరు, హాజరు, రిమార్కులు లేని వారిని గుర్తించి జాబితా రూపొందించేవారు. అయితే ఉత్తమ ఉద్యోగుల జాబితా రూపకల్పనకు ఎలాంటి ఆదేశాలు లేవని సంబంధిత శాఖ అధికారి 'సాక్షి'కి వివరించారు.

# వెనకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

- మేయర్ సునీల్‌రావు



లక్ష్మీనగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: గతంలో అభివృద్ధికి అంతగా నోచుకోని వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. మంగళవారం నగరంలోని 31వ డివిజన్ లక్ష్మీనగర్, గాయత్రినగర్‌లలో రూ.1.30 కోట్లతో మూడు చోట్ల చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. శివారు ప్రాంతాలైన లక్ష్మీనగర్, గాయత్రినగర్‌లో ప్రజలకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామన్నారు. రూ.1.30 కోట్లతో పనులు ప్రారంభించామని, మిగిలిన సమస్యలు ఏమున్నా వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కమాన్ నుంచి కేబుల్ బ్రిడ్జ్ వరకు బీటీ రోడ్డు నిర్మించి, సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. 31వ డివిజన్ అభివృద్ధి కోసం ఇప్పటికే సుమారు రూ.7కోట్లు కేటాయించామన్నారు. స్థానిక కార్పొరేటర్ లెక్కల స్వప్న వేణు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

**ఇబ్బందులు లేకుండా వీధిదీపాలు**

నగరంలో ప్రజలు చీకటిలో ఇబ్బంది పడకుండా వీధిదీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. మంగళవారం నగరంలోని 27వ డివిజన్‌లో నాలుగుచోట్ల ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను స్థానిక కార్పొరేటర్ గొసియా బేగం అబ్బాస్ సమీతో కలిసి ఆయన ప్రారంభించారు. రాత్రి సమయాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా నగరంలోని అన్ని ప్రధాన రహదారుల్లో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ను ఏర్పాటు చేశామన్నారు.

## క్లుప్తంగా

### అల్ఫోర్స్‌లో హౌస్‌ కెప్టెన్, వైస్‌ కెప్టెన్‌ల బాధ్యతల స్వీకరణ



కొత్తపల్లి: కరీంనగర్‌ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్‌ స్కూల్‌ ఆఫ్‌ జెన్‌నెక్ట్స్‌ హౌస్‌ల కెప్టెన్, వైస్‌ కెప్టెన్ల ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం అట్టహాసంగా జరిగింది. తేజస్, సరస్, ధృవ, లక్ష్య విభాగాలకు బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించిన ఎన్నికల్లో గెలుపొందిన కెప్టెన్, వైస్‌ కెప్టెన్‌ల బాధ్యత స్వీకరణోత్సవానికి విద్యా సంస్థల చైర్మన్‌ డా.వి.నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపడంతో పాటు శక్తి సామర్థ్యాలు నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

### ఒకే ఈతలో రెండు దూడలు



శంకరపట్నం: మండలంలోని ఏరడపల్లి గ్రామంలో ఆవుకు ఒకే ఈతలో రెండు లేకదూడలు జన్మించాయి. ఏరడపల్లి గ్రామానికి చెందిన రామచందర్‌ ఆవులను పెంచుతున్నాడు. ఆవు ఒకే ఈతలో రెండు లేగదూడలకు జన్మనివ్వడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

### చెరువులో కొండచిలువ



హుజూరాబాద్‌రూరల్‌: మండలంలోని సింగపూర్‌ శివారులోని పెద్దచెరువులో కొండచిలువ ప్రత్యక్షమైంది. చెరువుకు సమీపంలోని పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లినరైతులకు కొండచిలువ కనిపించింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని, కొండచిలువ పట్టుకుని తీసుకెళ్లి అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

### పంచాయతీ కార్మికుడి మృతి



కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న దినసరి కార్మికుడు మేరుగు రాజు (25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల మేరకు.. గత పది రోజులక్రితం దోమల నివారణ మందును పిచికారీ చేసిన రాజు అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవడంతో పాటు డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.35 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ చైర్మన్‌ కొప్పుల శంకర్‌ డిమాండ్‌ చేశాడు.

# సమయం లేదు మిత్రమా..!

- గృహలక్ష్మి, మైనార్టీబంధుకు సమీపించిన గడువు
- అర్హతలు కలిగిన వారు ఆగమాగం
- దరఖాస్తుదారులతో కార్యాలయాలు కిటకిట
- గడువు పెంచాలంటున్న జిల్లావాసులు
- మైనార్టీబంధుకు వచ్చిన దరఖాస్తులు 58

సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల సీజన్‌ వేళ రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు చేరవయ్యేందుకు ప్రజాకర్షక పథకాలను అమలు చేస్తోంది. ఇప్పటికే దళితబంధు, బీసీలకు రూ.లక్ష సాయం ప్రకటించగా.. తాజాగా గృహలక్ష్మీ పేరుతో నిరుపేదలకు గృహయోగం కల్పించేలా.. మైనార్టీబంధుతో ముస్లిం, క్రిస్టియన్‌ వర్గాలవారికీ ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది. వంద శాతం సబ్సిడీతో మూడు విడతల్లో సొంత స్థలం ఉన్న వారు ఇళ్లు నిర్మించుకోవచ్చు. అదే మైనార్టీబంధులో వన్‌టైం గ్రాంట్‌ కింద కుటుంబంలో ఒకరికి రూ.లక్ష అందించనున్నారు. ఈ పథకాల ద్వారా లబ్ధిపొందేందుకు అర్హులు అన్నిరకాల ప్రయత్నాలూ చేస్తున్నారు. వీరి అవకాశాన్ని మీసేవ కేంద్రాలు, జిరాక్స్‌ సెంటర్ల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. అధిక చార్జీలు తీసుకుంటూ వారి వెన్ను విరుస్తున్నారు. ఈ రెండు పథకాలకు దరఖాస్తు గడువు దగ్గరపడుతుండటంతో దరఖాస్తుదారులు సమయంలేదని అధిక చార్జీలైనా చెల్లిస్తున్నారు.

**గృహలక్ష్మికి రేపటితో..**
**మైనార్టీబంధు 14 వరకు గడువు**

గూడు నిర్మించుకోవాలని ఎన్నో రోజులుగా ఆశగా ఎదురుచూస్తున్న వారికి ఈ నెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటన జారీ చేశారు. దీంతో వివిధ ప్రాంతాల్లో పనుల కోసం వెళ్లినవారు, స్థానికంగా ఉంటున్న వారు ఆయా పత్రాలు సమకూర్చుకోవడానికి పరుగులు పెడుతున్నారు. ఆన్‌లైన్‌ దరఖాస్తులు కాకుండా కలెక్టరేట్, మున్సిపాలిటీలు, మండల పరిషత్‌ కార్యాలయాల్లో దరఖాస్తులు నేరుగా అందించాలనడంపై దరఖాస్తుదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మైనార్టీబంధుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 14వరకు గడువు ఇచ్చారు. దాని గడువు మరో ఐదు రోజులే ఉండటంతో మైనార్టీలు ఆందోళన చెందుతున్నారు. సరైన సమాచారం లేక ఎవరు ఏం చెబితే వాటి కోసం పరుగులు తీస్తూ ఆగమాగం అవుతున్నారు. మీసేవ కేంద్రాల్లో కులం, ఆదాయం, తదితర సర్టిఫికెట్ల కోసం బారులు తీరుతున్నారు. మద్యం దుకాణాల్లో టెండర్లు వేయడానికి కులం సర్టిఫికెట్‌ అవసరం కావడంతో వారు కూడా పరుగున వస్తుండటంతో రద్దీ పెరగుతోంది. ఇదే అదనుగా మీసేవ కేంద్రాల నిర్వాహకులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు.



పెద్దపల్లిలో బారులు తీరిన మహిళలు

**గృహలక్ష్మి నిబంధనలు**

- ఇళ్లు లేకుండా సొంత జాగా ఉండి నిర్మాణం చేసుకునేవారు
- స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్‌ పత్రాలు
- తెల్ల రేషన్‌కార్డు కచ్చితంగా కలిగివుండాలి
- కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, బ్యాంక్‌ పాసుబుక్‌ జిరాక్స్‌లు జతపర్చాలి
- జీవో 59 కింద లబ్ధిపొందని వారు మాత్రమే అర్హులు

**నియోజకవర్గాల వారీగా గృహలక్ష్మికి వచ్చిన దరఖాస్తులు**

| | |
|---|---|
| కరీంనగర్‌ | 78 |
| పెద్దపల్లి | 1652 |
| జగిత్యాల | 274 |
| సిరిసిల్ల | 3495 |
| మానకొండూరు | 10 |
| మంథని | 617 |
| హుజూరాబాద్‌ | 186 |
| కోరుట్ల | 766 |
| వేములవాడ | 2329 |
| ధర్మపురి | 566 |
| చొప్పదండి | 30 |
| రామగుండం | 1900 |

**మైనార్టీబంధు నిబంధనలు**

- దరఖాస్తుదారులకు వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణాల్లో రూ.రెండు లక్షలకు మించరాదు
- 2023 జూన్‌ 2వ తేదీ నాటికి 21నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు గలవారై ఉండాలి
- తహసీల్దార్‌ జారీచేసిన బీసీ సీ, చర్చి పాస్టర్‌ మంజూరు చేసిన బాప్టిస్ట్‌ సర్టిఫికెట్‌ తప్పనిసరి
- ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారు
- కులం, ఆదాయం, నివాసం ధ్రువప్రతాలు తప్పనిసరి
- మంత్రి ఆమోదంతో జిల్లాస్థాయి మానిటరింగ్‌ కమిటీ ఎంపిక చేసి మైనార్టీశాఖ ద్వారా అందిస్తారు.

**గడువు పొడిగించాలి**



గృహలక్ష్మి పథకం నిరుపేదలు సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అతి తక్కువ సమయంలో దరఖాస్తులు ఇవ్వమనడం సరికాదు. గడువు తేదీని పొడిగించాలి. మరో 20 రోజుల వరకు అవకాశాన్ని కల్పించాలి. భర్తల పేరుతో భూమి ఉంటే భార్యలకు దరఖాస్తు చేసుకునే వీలు కల్పించాలి.

– రాము, ఎంపీటీసీ, చిన్నలింగాపూర్‌

**మరింత సమయం కావాలి**



గృహలక్ష్మికి మరింత సమయం ఇవ్వాలి. వైన్స్‌ టెండర్‌కు 15 రోజులు గడువు పెట్టి, గృహలక్ష్మికి మూడు రోజులే ఇవ్వడం ఏంటి? ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలి. నిబంధనలు తెలియక చాలామంది ఆగమవుతున్నారు.

– లక్ష్మి, అప్పన్నపేట, పెద్దపల్లి

# విద్యార్థులను చితకబాదిన టీచర్‌



పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు



విద్యార్థి గాయాలను చూపుతున్న తల్లి



టీచర్‌ తిరుపతి

- విషయం తెలిసి గొడవకు దిగిన తల్లిదండ్రులు
- కార్ఖానగడ్డ ప్రభుత్వ పాఠశాలలో ఉద్రిక్తత
- ఉపాధ్యాయుడిపై క్రిమినల్‌ కేసు
- సస్పెండ్‌ చేసిన డీఈవో


కరీంనగర్‌/కరీంనగర్‌క్రైం: పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయుడు 25మంది విద్యార్థులను చితకబాదిన ఘటన కరీంనగర్‌లోని కార్ఖానగడ్డ గవర్నమెంట్‌ స్కూల్‌లో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. పాఠశాలలో జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు తిరుపతి 8వ తరగతి చదివే 25మంది విద్యార్థులు అల్లరిచేశారనే నెపంతో చితకబాదాడు. ఒకరిద్దరు విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో విషయం తెలిసిన మిగితా తల్లిదండ్రులు కూడా పెద్దఎత్తున పాఠశాలకు చేరుకుని ఆందోళనకు దిగారు. త్రీటౌన్‌ సీఐ శ్రీనివాస్‌ వారిని సముదాయించారు. తిరుపతిని అప్పగించాలని తల్లిదండ్రులు పట్టుబట్టడంతో ఒకింత ఉద్రిక్త పరిస్థితికి దారితీసింది. తిరుపతిని తోటి ఉపాధ్యాయులు ఒకరూంలో ఉంచి పోలీసులు వచ్చాక వారికి అప్పగించారు. ఇదే సమయంలో ఏబీవీపీ నాయకులు టీచర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేస్తూ ఆందోళనకు దిగారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడు తిరుపతిపై క్రిమినల్‌ కేసు నమోదు చేశామని త్రీటౌన్‌ సీఐ వెల్లడించారు. ఈ విషయమై డీఈవో జనార్దన్‌రావును వివరణ కోరగా ఎంఈవో మధుసూదనాచారితో విచారణ నిర్వహించామని, 7వ తరగతి విద్యార్థులకు పాఠం బోధిస్తుండగా 8వ తరగతి విద్యార్థులు అల్లరి పెడుతుంటే టీచర్‌ తిరుపతి వారిని దండించడంతో పాటు దూషించాడని విద్యార్థులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం ఉపాధ్యాయుడు తిరుపతిని సస్పెండ్‌ చేసినట్లు డీఈవో వెల్లడించారు. కాగా.. పాఠశాల ఎదుట ఆందోళన చేస్తుంటే త్రీ టౌన్‌ సీఐ శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్‌ భర్త ఎడ్ల అశోక్‌ తమతో దురుసుగా ప్రవర్తించారని ఏబీవీపీ నేతలు ఏసీపీ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు.

## గుండెపోటుతో పొలంలోనే రైతు మృతి



కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలం నగునూరులో మంగళవారం ఓ రైతు గుండెపోటుతో పొలంలోనే పడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బోకూరి రమేశ్‌రెడ్డి (45) మంగళవారం పొలం దున్నేందుకు ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. విద్యుత్‌ మోటారు ఆన్‌ చేసేందుకు ఒడ్డుపై నుంచి నడిచివెళ్తున్నక్రమంలో ఆకస్మికంగా గుండెపోటు రావడంతో పొలంలోనే పడిపోయాడు. వెంటనే సమీపంలో ఉన్న తండ్రి చంద్రారెడ్డి వచ్చి పరిశీలించగా మృతిచెందాడు. సమాచారం అందుకున్న భార్య సుజాత అక్కడికి వచ్చి భర్త మృతదేహంపై పడి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అనంతరం స్థానికుల సాయంతో రమేశ్‌రెడ్డి మృతదేహాన్ని పొలంలోనుంచి ఇంటికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి కొడుకు ప్రశాంత్, కూతురు లహరి ఉన్నారు.

## మాజీ కౌన్సిలర్‌ దారుణ హత్య



లక్ష్మీరాజం(ఫైల్‌)

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్‌ మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్‌ నాయకుడు పోగుల లక్ష్మీరాజం (45) మంగళవారం ఉదయం దారుణ హత్యకు గురయ్యారు. తొలుత రెక్కీ నిర్వహించిన ఇద్దరు దుండగులు.. కోరుట్ల నడిబొడ్డున ఉన్న క్రిస్టియన్‌ కాంపౌండ్‌ వద్ద గల గుడిసె హోటల్‌ వద్ద ఉదయం నుంచే మాటువేశారు. ఎప్పటిలాగే టీ తాగేందుకు అక్కడకు చేరుకున్న లక్ష్మీరాజం.. హోటల్‌లో టీ తాగారు. స్థానికులతో ముచ్చటిస్తున్నారు. అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న ఇద్దరు ఆగంతకులు.. ముఖాలకు ముసుగులు ధరించి వచ్చీరాగానే లక్ష్మీరాజం మెడపై కత్తితో మూడుసార్లు గట్టిగా పొడిచారు. తీవ్రంగా గాయపడ్డ ఆయన ఒక్కసారిగా కుప్పకూలారు. హఠాత్పరిణామానికి హోటల్‌లో ఉన్న కస్టమర్లు భయంతో పరుగులు తీశారు. దుండగులు తాము వచ్చిన ద్విచక్రవాహనంపై పరారయ్యారు. కాసేపటికి తేరుకున్న స్థానికులు తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో కొట్టుకుంటున్న లక్ష్మీరాజంను కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఈ హత్యకు పాతకక్షలే కారణమని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య ప్రస్తుతం కోరుట్ల తొమ్మిదోవార్డు కౌన్సిలర్‌. వీరికి ఇద్దరు సంతానం. అధికార పార్టీ నాయకుడు కావడంతో కోరుట్ల పట్టణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసు బలగాలు భారీగా మోహరించాయి.

## ఆంగ్లభాష సామర్థ్యాల సాధనకు కృషి చేయాలి



జమ్మికుంట: ఆంగ్లభాష కనీస సామర్థ్యాల సాధనలో ఆశించిన ఫలితాలు పొందడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సెక్టోరల్‌ అధికారి కర్ర అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని సందర్శించారు. అశోక్‌రెడ్డి, ఎంఈవో విదుపు శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం బోధించడం జరుగుతోందని తెలిపారు. తొలిమెట్టులో భాగంగా తెలుగు, గణితం, ఆంగ్ల భాషాపై శిక్షణలోని అంశాలను పాఠశాలలో విధిగా ఉపాధ్యాయులు అమలు చేయాలని అన్నారు. మండల నోడల్‌ అధికారి వీరసమ్మయ్య, ప్రధానోపాధ్యాయుడు ఆకుల సదానందం, రిసోర్స్‌పర్సన్స్‌ దేవేందర్, రాజిరెడ్డి, సీఆర్‌పీలు సురేశ్, రవి పాల్గొన్నారు.

## అథ్లెటిక్‌ పోటీల్లో పతకాలు

కరీంనగర్‌స్పోర్ట్స్‌: హన్మకొండలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్‌ చాంపియన్‌ షిప్‌ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారని జిల్లా అథ్లెటిక్‌ సంఘం అధ్యక్ష,కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. మహిళా విభాగంలో డి.భార్గవి 400మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 100మీటర్లలో కాంస్యం సాధించింది. అండర్‌–18 బాలికల 100మీటర్ల పరుగు పందెంలో జె.శృతి కాంస్యం, అండర్‌–20 విభాగంలో మలుపతి కాంస్యం, 400,100 మీటర్ల రన్నింగ్‌లో రవి, అరవింద్‌ కాంస్యం సాధించినట్లు తెలిపారు. జిల్లా యువజన క్రీడా అధికారి రాజవీరు, సీనియర్‌ క్రీడాకారులు హరికిషన్, రమేశ్, బల్బీర్‌ సింగ్, చంద్రశేఖర్, సర్దార్‌ బీషన్‌ సింగ్‌ క్రీడాకారులను అభినందించారు.

# సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి పున్నం రవి



కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కరీంనగర్‌: రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆల్‌ ఇండియా ప్రైవేటు రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్‌ ఫెడరేషన్‌(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్‌) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా రవాణా రంగ కార్మికులు మంగళవారం కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్‌ లక్ష్మికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి పున్నం రవి మాట్లాడుతూ.. రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20లక్షల మంది కార్మికులు రవాణా రంగంలో పనిచేస్తున్నారని, వీరిలో చదువుకున్న యువకులే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ఆటో, గూడ్స్‌ డ్రైవర్ల పొట్ట కొట్టే పోర్టల్‌ యాప్‌లను రద్దుచేయాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగిస్తున్న అద్దె వాహనాల పెండింగ్‌ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ధరలు తగ్గించాలని, గ్రీన్‌టాక్సీ రద్దు చేయాలని, ఫిట్‌నెస్‌ ఇన్సూరెన్స్‌ చార్జీలు, పెనాల్టీలు తగ్గించాలని, ప్రమాద బీమా రూ.10లక్షలకు పెంచాలని డిమాండ్‌ చేశారు. నాయకులు మల్లయ్య, ఎంకే ఆరీఫ్‌ మోయినోద్దీన్, రాజు, శేఖర్, కుమార్, మల్లేశం, సమీర్, అఫ్జల్, మహమ్మద్‌ షబ్బీర్, జానీ, అన్వర్‌ పాల్గొన్నారు.

# ఆరోగ్య అవగాహనను పాఠ్యాంశంగా చేర్చాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌ కుమార్‌



మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్‌

కరీంనగర్‌టౌన్‌: విద్యార్థి దశలోనే నేటి యువతకు ఆరోగ్య పరిరక్షణ సూత్రాలు, ఆనందమయ జీవితానికి కావలసిన లక్షణాలను, ప్రాణాపాయ దశలో ఉన్న రోగులకు సీపీఆర్‌ లాంటి ప్రథమ చికిత్స పద్ధతులను పాఠ్యాంశంగా తీసుకొని నేర్పించాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌ కుమార్‌ అన్నారు. మంగళవారం రెనే హాస్పిటల్, శాతవాహన లయన్స్‌ క్లబ్‌ సంయుక్తంగా రెనే ఆసుపత్రి సెమినార్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన సీపీఆర్‌ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీపీఆర్‌ ప్రథమ చికిత్స విధానాన్ని అందరు తెలుసుకొని ఉండాలని, ముఖ్యంగా కళాశాలల యువతకు ఈ శిక్షణను తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు. లయన్స్‌ క్లబ్‌ బాధ్యులు లింగరాజు కోదండరాములు, డాక్టర్‌ బంగారి స్వామి, యాదగిరి శేఖర్‌ రావు, డాక్టర్‌ దీక్షిత్‌ బొజ్జ, బుర్ర మధుసూదన్‌ రెడ్డి, డాక్టర్‌ రజనీ ప్రియదర్శిని, రవీంద్రాచారి, దినకర్‌ తాటిమట్ల, యోగేందర్, నిఖిల్‌ లక్ష్మణ్, దామోదర్‌ రెడ్డి, మేకల అరవింద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని స్కూళ్లపై కమిటీ వేయాలి



ఆర్‌జేడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్‌: జిల్లా అనుమతి లేని పాఠశాలలు, విద్యాధికారుల అవినీతిపై ప్రత్యేక కమిటీ వేయాలని డిమాండ్‌ చేస్తూ ఆర్జేడీ కార్యాయం ఎదుట యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆర్‌జేడీ సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చారు. యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా అనుమతి లేకుండా శ్రీ చైతన్య విద్యాసంస్థలు నడుస్తున్నప్పటికీ జిల్లా విద్యాధికారులు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రైవేట్‌స్కూళ్ల యజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. కరీంనగర్‌ డీఈవో, మండల విద్యాధికారుల అవినీతిపై కమిటీ వేయాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోత్‌ రాజేశ్‌ నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాలకూరి హరీశ్, యశ్వంత్, రాకేశ్, ప్రశాంత్, బన్నీ, సంజయ్, సంజూ, నవీన్, సాయి పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

- సిరిసిల్లలో మాజీ సర్పంచ్‌ల నిరవధిక దీక్షలు ప్రారంభం



దీక్షలో మాట్లాడుతున్న దేవయ్య

సిరిసిల్లటౌన్‌: తమ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య డిమాండ్‌ చేశారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రం అంబేద్కర్‌ చౌరస్తాలో నిరవధిక దీక్షలను హైకోర్టు జస్టిస్‌ చంద్రకుమార్‌ ప్రారంభించారు. అనంతరం దేవయ్య మాట్లాడుతూ, మాజీ సర్పంచులందరికీ నెలకు రూ.10 వేలు పింఛన్‌ ఇవ్వాలని, అర్హులకు డబుల్‌ బెడ్రూం, హెల్త్‌కార్డులు, బస్‌పాస్‌లు ఇవ్వాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్‌ చేశారు. మాజీ సర్పంచుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించాలని, సర్పంచులు, మాజీ సర్పంచులు మృతిచెందితే ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించి రూ.5లక్షలు ఆర్థికసాయం చేయాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ భవనాలు కట్టించాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. దీక్షల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, సంభనూరి మల్లేశం, జనగామ నర్సింగరావు, గుర్రం భూపతిరెడ్డి, మ్యాకల శ్రీనివాస్, జనార్దన్‌ రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజేశం, గంగస్వామి, సలీం, నారాయణ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రజాసేవపై దృష్టిపెట్టాలి

- వాగేశ్వరి కళాశాల చైర్మన్‌ బీవీఆర్‌ గోపాల్‌రెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీవీఆర్‌ గోపాల్‌రెడ్డి

కరీంనగర్‌సిటీ: విద్యార్థులు కేంద్ర, రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి, ప్రజాసేవపై దృష్టి పెట్టాలని వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్‌ బీవీఆర్‌ గోపాల్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని వాగేశ్వరి కాలేజీ విద్యార్థులు ఫిష్టాప్యుషన్‌ పేరుతో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్‌ బీవీఆర్‌ గోపాల్‌రెడ్డి, ఎస్‌ఆర్‌ఆర్‌ డిగ్రీ కళాశాల రిటైర్డ్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ బుర్ర మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని తెలిపారు. మధుసుదన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ అవసరమని సూచించారు. ప్రిన్సిపాళ్లు సతీశ్‌గౌడ్, లింగమూర్తి, వైస్‌ ప్రిన్సిపాల్‌ చెన్నమల చైతన్య, డైరెక్టర్‌ నరేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఏవో నిజాముద్దీన్‌ పాల్గొన్నారు.

## వైన్స్‌లకు 19 దరఖాస్తులు



కరీంనగర్‌క్రైం: జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాలకు టెండర్‌ ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారం ఆరు దరఖాస్తులు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 19 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అర్బన్‌ 10, రూరల్‌కు 3, తిమ్మాపూర్‌కు 4, హుజూరాబాద్‌కు 1, జమ్మికుంటకు 1 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్‌ అధికారులు వెల్లడించారు.

## 13న షూటింగ్‌బాల్‌ ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్‌: కరీంనగర్‌ జిల్లా షూటింగ్‌ బాల్‌ అసోసియేషన్‌ వారి ఆధ్వర్యంలో ఈ నెల 13న స్థానిక సప్తగిరికాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 42వ జూనియర్స్‌ అండర్‌–19 జిల్లా స్థాయి షూటింగ్‌ బాల్‌ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్‌ ఆరీఫ్, ఎండీ ముఫాజిల్‌ తెలిపారు. పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఈనెల 20న జనగాంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 9573865930 నంబరులో సంప్రదించాలని ఈ సందర్భంగా వారు సూచించారు.


## సాక్షి క్లాసిఫైడ్స్‌

**SERVICES**

మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్‌ ధరకు కొనబడును. ఫోన్‌: 7013501541 [H-788615]

**LOANS**

సిరి అసోసియేట్స్‌: హౌజ్, ఫ్లాట్, ఓపెన్‌ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్‌ చేసుకొని వారంలో అమౌంట్‌ ఇప్పించబడును. సెల్‌: 9666142226. [W-189119]

**BUSINESS OFFER**

Learn & Earn in Currency Trading Master one Pair one Strategy one Trade Every day. Contact : 8591712181. [WB-20553]

**WANTED**

I to V E/M పాఠశాలలో పని చేయుటకు టీచర్స్‌ కావలెను. & B.Sc.(Maths) ట్రైయిన్డ్‌/ అన్‌ట్రైయిన్డ్‌ టీచర్‌ కావలెను. వేతనము, ఉచిత భోజన వసతి కల్పించబడును. సెల్‌: 9247868856, 9440006446. [K-1217235]

క్వాలిఫైడ్‌ ల్యాబ్‌ టెక్నిషన్స్, రిసెప్షనిస్ట్‌ కమ్‌ కంప్యూటర్‌ ఆపరేటర్, మార్కెటింగ్‌ ఎగ్జిక్యూటివ్స్‌ కావలెను. సంప్ర॥ డా॥ ఓం డయాగ్నోస్టిక్స్, సివిల్‌ హాస్పిటల్‌ ప్రక్కన, కరీంనగర్‌. సెల్‌: 9246930093, 6301090216 [K-1185574]

ఓల్డ్‌ రికార్డు చూసి న్యూ రికార్డు రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/–. ఫోన్‌ : 72074 45296 [V-6204]

INC ఆఫీస్‌ నందు పనిచేయుటకు యువతి యువకులు కావలెను. P/T-9K / F/T - 24K. ఇతర వివరాలకు ✆ 6300264252 [G-786475]

మీ మొబైల్‌ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్‌ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్‌ వాట్సప్‌ చేయండి. వివరాలకు కాల్‌ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221507]

ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్‌ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్‌ వాట్సప్‌ చేయండి. 88854 86421. [M-1221479]

హరేకృష్ణ హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్‌: 9640258899, 9640468899 [HA-189314]

MNC Recruitment Drive @ Karimnagar on 15th August Age 25+. Any Qualification Working Retired Jobless or Housewives Send your Resume & Aadhar Card to Register your name & details: Ph: 7901020195. [HA-94514]

**గమనిక**
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

## క్లుప్తంగా

### గడప గడపకు కాంగ్రెస్...



పథకాలను వివరిస్తున్న నాయకులు

**కరీంనగర్‌టౌన్:** గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ముకరంపురలో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటా కరపత్రాలు పంచుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నగరకాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... నగరం నడిబొడ్డున ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారని జామా మసీదు వెనుకవైపు రోడ్డు మురుగుకాలువ అధ్వానంగా ఉందని వర్షంనీటికి కాలువ నీళ్లు తోడవడంతో ఎక్కడికక్కడ నిలిచి పోతున్నాయన్నారు. కార్యక్రమంలో డివిజన్ బాధ్యుడు పెద్దిగారి తిరుపతి, ఎండీ.తాజ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్యగౌడ్, కుర్ర పోచయ్య, ఎండీ. చాంద్, షబానా మహమ్మద్, పొరండ్ల రమేశ్, ముల్కల కవిత, అన్నే జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గద్దర్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న కార్మికసంఘం నాయకులు

**కరీంనగర్:** ఆటో కార్మిక సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ప్రజా గాయకుడు యుద్ధ నౌక గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మద్దెల రాజేందర్, సంపత్, రాంగోపాల్‌రెడ్డి, నాగభూషణం, ఆంజనేయులు, నరసింహనాయక్, తిరుపతి, సత్యనారాయణ, మహేందర్, వేణుకుమార్, ప్రభాస్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

### డిస్మిస్ చేయాలి

**విద్యానగర్:** కరీంనగర్ కార్ఖానాగడ్డలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులను విచక్షణ రహితంగా కొట్టిన ఉపాధ్యాయుడిని సర్వీస్ నుంచి తొలగించాలని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాంఅహ్మద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాలలో బయోలాజీ టీచర్ తిరుపతిరెడ్డి విద్యార్థులను కర్రలు విరిగేలా చితకబాదినట్లు సమాచారం అందుకున్న ఆయన పిల్లల తల్లిదండ్రులతో కలిసి పాఠశాలను సందర్శించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్‌సమీ, ఎంఐఎం నాయకులతో కలిసి బాధిత విద్యార్థులతో 3వ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐకి ఫిర్యాదుచేశారు.

### 22న జిల్లా రెడ్‌క్రాస్ ఎన్నికలు

**కరీంనగర్ అర్బన్:** జిల్లా రెడ్‌క్రాస్ సంఘానికి ఈనెల 24న ఎన్నికలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ రిజిస్ట్రార్/జిల్లా సహకార అధికారి సీహెచ్.మనోజ్‌కుమార్ తెలిపారు. అర్హులైన ఓటర్ల జాబితాను రెడ్‌క్రాస్ సంఘం నోటీస్ బోర్డుపై సభ్యుల పరిశీలనకు ప్రదర్శించినట్లు వివరించారు. ఈనెల 16న నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, 17న నామినేషన్ల ఉపసంహరణ, 22న పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

### అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయండి

**కరీంనగర్ కార్పొరేషన్:** నగరపాలకసంస్థ పరిధిలోని సూర్యనగర్ 4ఏ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వాణిజ్యసముదాయం పనులను నిలిపివేయాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవినాయక్, ప్రధానకార్యదర్శి తిరుపతిగౌడ్ డిమాండ్‌చేశారు. ఈమేరకు మంగళవారం మేయర్ యాదగిరి సునీల్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. గతంలో ఇదే నిర్మాణంపై ఫిర్యాదుచేస్తే పనులు నిలిపివేశారని, మళ్లీ పనులు ప్రారంభించారని మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ మెయిన్‌రోడ్ పక్కన కేవలం తొమ్మిది ఫీట్ల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న నిర్మాణాన్ని నిలిపివేయాలన్నారు.

## బైపాస్‌లో చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

**కరీంనగర్‌రూరల్:** బొమ్మకల్ బైపాస్‌రోడ్డులో చెత్తను తొలగించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. బైపాస్‌రోడ్డులో హోటళ్లు, బిర్యాని సెంటర్లలో ఆహారపదార్థాలు, చికెన్‌సెంటర్లలోని కోళ్ల వ్యర్థాలను నిర్వాహకులు బైపాస్‌రోడ్డులో పడేస్తుండడంతో దుర్వాసన వస్తోందని మంగళవారం 'సాక్షి'లో 'డంపింగ్‌యార్డుగా బైపాస్‌రోడ్డు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి స్పందించారు. ఎంపీడీవో ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లా జేసీబీతో చెత్తచెదారం, వ్యర్థాలను తొలగించి ట్రాక్టర్‌లో అక్కడి నుంచి మరో ప్రాంతానికి తరలించారు. బైపాస్‌రోడ్డులో చెత్తను పడేయకుండా చర్యలు చేపడతామని కార్యదర్శి తెలిపారు.



జేసీబీతో చెత్తను తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

## పొంచి ఉన్న ప్రమాదం



కరీంనగర్ మండలంలో వారంక్రితం కురిసిన భారీ వర్షాలకు నగునూర్ పాతరోడ్డు కల్వర్ట్ వద్ద విద్యుత్ స్తంభం పూర్తిగా వంగిపోయింది. చేతికందే ఎత్తులో విద్యుత్‌స్తంభం ఉండడంతో ఎప్పుడు కిందపడుతుందోననే భయం నెలకొంటుందని నగునూర్ వాసులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే విద్యుత్‌స్తంభాన్ని సరిచేసి ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

## టైంకు బస్సుల్లేక..

- ఒకే బస్సులో 150 మంది విద్యార్థులు ప్రయాణం
- ఉదయం రెండు బస్సులు, సాయంత్రం ఒకే బస్సు ఏర్పాటుతో ప్రయాణం నరకప్రాయం
- సమయపాలన లేక సతమతం
- పట్టించుకోని అధికారులు
- కిక్కిరిసిన ప్రయాణంతో ఊపిరి సలపని విద్యార్థులు

**విద్యానగర్:** ఆర్టీసీ అధికారుల అలసత్వం విద్యార్థులకు శాపంగా మారింది. ప్రయాణికులను సురక్షితంగా, సౌకర్యవంతంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన అధికారులు మిన్నకుండడంతో విద్యార్థులు అపసోపాలు పడుతూ ప్రయాణిస్తున్నారు. ఇందుకు సాక్ష్యమే కరీంనగర్ పరిధిలోని ఎలగందుల మోడల్ స్కూల్ విద్యార్థుల వ్యథ నేడు కథగా మారింది. వివరాల్లోకి వెళితే.. ప్రతీరోజు ఉదయం కరీంనగర్ నుంచి ఎలగందుల మోడల్ స్కూల్‌కు రెండు బస్సులు నడిపిస్తున్నారు. ఇందులో సుమారు 150 మంది విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో విద్యార్థుల కోసం ఒకే బస్సు కేటాయించడంతో 150 మంది విద్యార్థులు అష్టకష్టాలు పడుతూ ఊపిరాడని పరిస్థితుల్లో కిక్కిరిసిన ప్రయాణం చేస్తూ గమ్యస్థానాలకు చేరుతున్నారు. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్టీసీ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తిచేసినా వారినుంచి ఎలాంటి స్పందన లేదని వాపోతున్నారు. సాయంత్రం స్కూల్ వదిలే సమయం 4.40 కాగా బస్సు 5.30కి వస్తుందని, పిల్లలు ఇంటికి చేరే వరకు చీకటి పడుతుందని వారి భద్రత విషయంలో కూడా తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల ఇబ్బందులు, భద్రతను దృష్టిలో పెట్టుకుని సాయంత్రం పాఠశాల సమయానికి సకాలంలో రెండు బస్సులు నడిపించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.





## ఓ కునుకేద్దాం...



సర్వర్ పనిచేయకపోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో నిద్రిస్తున్న రైతు

- సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్లలో జాప్యం
- గంటలతరబడి రైతుల పడిగాపులు
- ఓపిక నశించి వెయిటింగ్‌రూమ్‌లో నిద్రించిన రైతులు

**కరీంనగర్‌రూరల్:** మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌లో జాప్యంతో పలువురు రైతులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. తహసీల్దార్ నవీన్ ఎన్నికల నిర్వహణపై హైదరాబాద్‌కు శిక్షణ నిమిత్తం వెళ్లగా రిజిస్ట్రేషన్ పనులను నాయబ్ తహసీల్దార్ శంకర్‌కు అప్పగించారు. మంగళవారం 20 స్లాట్ బుకింగ్‌లుండగా వీటిలో 17మార్టిగేజ్, 3 రిజిస్ట్రేషన్‌లున్నాయి. అయితే ఉదయం నుంచే సర్వర్ సరిగ్గా పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు మందకొడిగా సాగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు రైతులు వెయిటింగ్‌రూమ్‌లో గంటల తరబడి ఎదురుచూడగా మరికొందరు రైతులు కునుకు తీశారు. రాత్రి 7గంటల వరకు సైతం రిజిస్ట్రేషన్లు కొనసాగాయి. అయితే సర్వర్ స్లోగా ఉండడంతోపాటు విరాసత్ రిజిస్ట్రేషన్లలో కొన్ని లీగల్ సమస్యలుండడంతో రిజిస్ట్రేషన్లలో కొంత జాప్యం ఏర్పడిందని నాయబ్ తహసీల్దార్ శంకర్ తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గోపి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

**సప్తగిరికాలనీ:** పర్యావరణ పరిరక్షణకు యువత మొక్కలు నాటి హరిత తెలంగాణకు కృషిచేయాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి యువతకు పిలుపునిచ్చారు. తెలంగాణ యువజన సమితి ఆధ్వర్యంలో మంగళవారం కార్యాలయంలో మొక్కలు నాటండి – పర్యావరణాన్ని కాపాడండి ప్రజలనుచైతన్యపరిచే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యువత సామాజిక సేవను అలవర్చుకొని ముందుకు సాగి మొక్కలు నాటి పరిరక్షించాల్సిన బాధ్యత యువజన, స్వచ్ఛంద, మహిళా సంఘాలపై ఉందన్నారు. జిల్లాలోని మారుమూల గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచి మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యువజన సమితి జిల్లా అధ్యక్షుడు సత్తినేని శ్రీనివాస్, కార్యదర్శి పెంటి నవీన్, పోలాడి కవిత, వంశీధర్‌రావు, ధ్యావనపల్లి స్వప్న రావు, తిరుమల, వెంకట్, అనిల్ పలు యువజన, స్వచ్ఛంద, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

**కవితా సంకలనం ఆవిష్కరణ**

ప్రముఖ కవి నాగుల సత్యంగౌడ్ రచించిన కవితా సంకలనాన్ని మంగళవారం కలెక్టర్ బి.గోపి ఆవిష్కరించారు. మానవ విలువలు పెంపొందించేలా రచించిన అహింస విశ్వమాన కల్యాణం అనే కవిత సంకలనాన్ని రూపొందించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్, సామల రాజిరెడ్డి, చల్లూరి వంశీకృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్‌ను కలిసిన సంఘం నాయకులు**

**కరీంనగర్:** అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు కరీంనగర్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బి.గోపిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సముద్రాల అజయ్ గజ్జల ఆనందరావు, సుద్దాల లక్ష్మణ్, గోష్కి శంకర్ , నేరేళ్ల మహేందర్, గండి గణేశ్, సిరిసిల్ల నర్సయ్య, కాసారం కిరణ్, ప్రశాంత్, నారాయణ, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

**కరీంనగర్:** జిల్లావ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ల ఫెడరేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ డాక్టర్ బి.గోపికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు కొమ్మెర తిరుపతిరెడ్డి మాట్లాడు తూ.. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరారు. చాలా మంది జర్నలిస్టులు అద్దెఇళ్లలో నివసిస్తున్నారని తెలిపారు. గతంలోనే తెలంగా ణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో మ ంత్రి, కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామని అన్నారు. తక్షణమే మంత్రి గంగులకమలాకర్, కలెక్టర్ ఇండ్లస్థలాల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయంచేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యు డు గాదె కరుణాకర్‌రావు, సభ్యులు శంకర్‌రెడ్డి, హరి కృష్ణ, నరేశ్, గణేశ్ తదితరులుపాల్గొన్నారు.

## వామ్మో కుక్కలు..



కొత్తపల్లి పట్టణంలో కుక్కల బెడద తీవ్రమైంది. ఒకేచోట చాలా కుక్కలు సమూహంగా చేరి వీధుల్లో సంచరిస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారుల వెంటపడుతుండడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. అంతేకాకుండా దారివెంట నడిచివెళ్లేవారిపై ఎగబడుతుండడంతో వాటిని తప్పించుకునేందుకు యత్నిస్తూ జనం ప్రమాదాల బారినపడుతున్నారు. చిన్న పిల్లలు వీధుల్లో తిరగాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో చిన్నారులను ఒంటరిగా వదలాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. ఇటీవల చాలా ప్రాంతాల్లో కుక్కల దాడిలో గాయాలపాలై చికిత్స పొందుతున్న సంఘటనలు అనేకం వెలుగుచూస్తుండడంతో స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. అలాంటి ఘటనలు కొత్తపల్లిలో చోటుచేసుకోకముందే కుక్కల నియంత్రణకు మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. - కొత్తపల్లి

## కార్మికుల సమ్మెకు బీజేపీ నాయకుల సంఘీభావం

**కరీంనగర్‌రూరల్:** సమస్యలు పరిష్కరించాలని కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మెచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు మంగళవారం బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు, డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్మికులు నెలరోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి తాల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్‌కుమార్, ప్రధానకార్యదర్శి గాండ్ల గోపాల్, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రమణారెడ్డి, నాయకులు మునిగంటి కుమార్, అజయ్, నరేందర్, హరీశ్, సంజీవ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

## సంఘం భవన నిర్మాణానికి సహకరిస్తా

**కరీంనగర్‌కల్చరల్:** మంత్రి గంగుల కమలాకర్ సహకారంతో ఫొటో–వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘానికి స్థలం కేటాయించి, సంఘం భవన నిర్మాణానికి సహకరిస్తానని కరీంనగర్ మేయర్ సునీల్‌రావు అన్నారు. మంగళవారం రెవెన్యూ గార్డెన్‌లో ముందస్తు ప్రపంచ ఫొటోగ్రఫీ డే వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి పలువురు ఫొటోగ్రాఫర్‌లు, వీడియోగ్రాఫర్లను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు, ఫొటో వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, రాష్ట్ర గౌరవ సలహాదారు కేధార్‌రెడ్డి, ఫొటో వీడియో గ్రాఫర్స్ జిల్లా అధ్యక్షుడు సిరి రవీందర్, సంఘం నాయకులు సామ అశోక్, రాకేశ్‌రెడ్డి, శంకరాచార్య, అంజనేయులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ఫొటో వీడియో గ్రాఫర్స్ సంఘం బాధ్యులతో మేయర్‌సునీల్‌రావు

## ఈవీఎంల పనితీరుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

**మానకొండూర్ రూరల్:** మండలంలోని లలితాపూర్, వెల్ది గ్రామాల్లో నియోజకవర్గ ఎలక్షన్ సిబ్బంది మంగళవారం ప్రజలకు ఓటుహక్కు వినియోగం, నమోదు పక్రియ, ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో బీఎల్‌వోలు శారద, పద్మజ, నోడల్ ఆఫీసర్ ఎండీ.యునీస్‌పాషా, డి.వర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం.: 1800 425 9899

## క్లుప్తంగా...



### 169 మందికి తహసీల్దార్లుగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో నాయబ్ తహసీల్దార్లుగా పనిచేస్తున్న 169 మందికి తహసీల్దార్లుగా పదోన్నతి లభించింది. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్‌మిత్తల్ అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన శాఖా పదోన్నతుల కమిటీ (డీపీసీ)లో నిర్ణయం తీసుకున్నారు. 2016–17 ప్యానెల్ సంవత్సరానికి సంబంధించిన పదోన్నతులకు ఈ కమిటీ ఆమోద ముద్ర వేసింది. కాగా పదోన్నతులు కల్పించడం పట్ల తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు మన్నె ప్రభాకర్, ఉపాధ్యక్షులు కె.నిరంజన్, రమేష్ పాక తదితరులు మిత్తల్‌ను సచివాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

### ‘అజయ్ టు యోగి ఆదిత్యనాథ్’ పుస్తకావిష్కరణ



సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్‌లో ప్రాచుర్యం పొందిన బొమ్మల కథ ‘అజయ్ టు యోగి ఆదిత్యనాథ్’పుస్తకాన్ని హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఉన్న ఇంజనీర్స్ ఇండియా భవనంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, రాజ్యసభ సభ్యుడు జాఫర్ ఇస్లాం, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షాజియా ఇల్మీ, చిలుకూరు బాలాజీ దేవాలయ పూజారి సీఎస్ రంగరాజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ జీవిత చరిత్రపై గతంలో ప్రముఖ రచయిత శంతను గుప్తా ‘ది మాంక్ హూ బికేమ్ చీఫ్ మినిస్టర్’, ‘ది మాంక్ హూ ట్రాన్స్‌ఫార్మ్‌డ్ ఉత్తరప్రదేశ్’అనే రెండు బెస్ట్ సెల్లింగ్ నవలలు రాశారు. ఈ సందర్భంగా రచయిత విలేకరులతో మాట్లాడుతూ ‘ఆరుగురు తోబుట్టువులతో జన్మించిన అజయ్ సింగ్ బిష్ట్ అనే కుర్రాడు.. అజయ్ గోరఖ్‌నాథ్ మఠానికి చెందిన మహంత్‌గా, తర్వాత పార్లమెంటులో అతిపిన్న వయస్కుడైన సభ్యుడిగా, చివరికి యూపీ సీఎంగా ఎలా ఎదిగాడు అనేదే ఈ పుస్తకం’అని తెలిపారు.

# ఆదుకోవడం అంటే ఇలా..

## లంక గ్రామాల వరద బాధితులతో ఏపీ సీఎం వైఎస్ జగన్

- నాడు ఫొటో సెషన్‌లా నేతల పర్యటన
- బాధితుల వద్దకు నేరుగా వెళ్లి మాట్లాడేవారు కాదు
- నేడు తక్షణ సాయం అందించాకే జనం మధ్యకు వస్తున్నా



అంబేడ్కర్ కోనసీమ జిల్లా గురజాపు లంకలో వరద తాకిడికి గురైన ఓ ఇంట్లోకి వెళ్లి పరిశీలించి.. బాధితురాలికి భరోసా ఇస్తున్న ఏపీ సీఎం జగన్

సాక్షి అమలాపురం: ‘గతంలో చాలాసార్లు వరదలు వచ్చాయి. నాయకులు అప్పటికప్పుడు రావడం, అధికారులంతా వారి చుట్టూ తిరగటం జరిగేది. పేపర్లలో.. టీవీల్లో ఫొటోల కోసం పోజులిచ్చి వెళ్లిపోయేవారు. ప్రతి ఒక్కరికీ మంచి జరగాలి. కానీ వారు మంచి జరిగిందా లేదా అని చూడలేదు. మన ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితిని మార్చాం. ప్రతి బాధితునికి సాయం అందుతోంది. నాలుగేళ్లుగా ఈ మార్పు కనిపిస్తోంది. సాయం చేయడం, ఆదుకోవడం అంటే ఇదీ..’అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గోదావరి వరదల బారిన పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మంగళవారం ఆయన పర్యటించారు. ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని గురజాపులంక, లంకాఫ్ ఠాన్నేల్లంక, కొండుకుదురులంకల్లో బాధితులతో మమేకమయ్యారు. వారి కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇలాంటి ప్రతి సందర్భంలో కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రజలకు తక్షణ సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు కావాల్సిన డబ్బులు వారి చేతుల్లో పెట్టామని చెప్పారు. వరద నష్టం ఎక్కువా, తక్కువా అని చూడకుండా బాధితులను ఉదారంగా ఆదుకోండని చెప్పామని తెలిపారు. ‘ఆయా జిల్లాల్లో కలెక్టర్లకు వారం రోజుల సమయం ఇచ్చాం. ప్రతి గ్రామంలోకి వెళ్లాలని, ప్రతి గ్రామంలో ఉన్న వ్యవస్థను చైతన్యం చేయాలని చెప్పాం. ఆ తర్వాత నేను స్వయంగా వచ్చి బాధితులకు సాయం అందిందీ లేనిదీ చూస్తానని చెప్పాను. నేను వచ్చినప్పుడు నాకు సహాయం అందలేదని ఏ ఒక్కరి నోటి నుంచి రాకూడదు’అని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని చెప్పారు. వరదలు వచ్చినప్పుడే మిమ్మల్ని పలకరించేందుకు వస్తే సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుందని భావించే ఇలా చేశానని వివరించారు. కష్టాలలో ఉన్నప్పుడు మీ బిడ్డ వేగంగా అదుకుంటాడని పునరుద్ఘాటించారు.

**నేరుగా జనం మధ్యకే..**

మంగళవారం ఉదయం సీఎం వైఎస్ జగన్ నేరుగా గురజాపులంకకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. ఇలా గోదావరి మధ్యన ఉన్న లంక గ్రామాలకు నేరుగా వచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ కావడం విశేషం. సాధారణంగా వరదల సమయంలో బాధితులను పరామర్శించేందుకు గతంలో చాలా మంది ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు జిల్లాకు వచ్చారు. అప్పట్లో డివిజన్ కేంద్రమైన అమలాపురం, వరద ప్రభావిత ప్రాంతాల మండల కేంద్రాలలో వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, ఎంపిక చేసిన బాధితులను పరామర్శించి వెనుదిరిగేవారు. సీఎం జగన్ ఇందుకు భిన్నంగా నేరుగా లంక గ్రామాలలోనే దిగడం.. బాధితులను, పంట నష్టపోయిన రైతులను పరామర్శించడంతోపాటు జరిగిన నష్టాన్ని స్వయంగా వీక్షించడం గమనార్హం. ఐదారు గంటలపాటు లంక వాసులతో సీఎం మమేకమయ్యారు.

# వరదలొస్తే ఏం చేయాలి?

- ఒడిశా, యూపీ, అసోం విధానాల అధ్యయనానికి టెక్నికల్ కమిటీ
- గంగా, బ్రహ్మపుత్ర, మహానది నదుల వరద నివారణ చర్యల పరిశీలన
- కమిటీ నివేదిక ఆధారంగా గోదావరి వరదలపై సర్కారు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: గోదావరి వరదల నుంచి భద్రాచలం పట్టణం, పరిసర గ్రామాలకు రక్షణ కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మహానది, గంగా, బ్రహ్మపుత్ర నదుల వరదల నుంచి లోతట్టు ప్రాంతాలకు రక్షణ కల్పించేందుకు అక్కడ అవలంబిస్తున్న అత్యుత్తమ విధానాలపై అధ్యయనం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఈ నెల 16 నుంచి 18 వరకు ఒడిశాలోని మహానది, 20 నుంచి 22 వరకు అస్సాంలోని బ్రహ్మపుత్ర, 29–31 వరకు ఉత్తరప్రదేశ్‌లోని గంగా నదిని సందర్శించి వరద రక్షణ చర్యలను పరిశీలించనుంది. ప్రధానంగా వరద రక్షణ గోడలు నిర్మించాలా? లేక ఇంకేమైనా ప్రత్యామ్నాయాలు ఉన్నాయా? అన్న అంశంపై దృష్టి పెట్టనుంది. వరద రక్షణ గోడల వల్ల ఫలితాలతోపాటు వచ్చే సమస్యలను సైతం కమిటీ అధ్యయనం చేయనుంది. గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో రెండు వైపులా గోడలు నిర్మించి స్థానికులకు రక్షణ కల్పించాలని గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంది. భద్రాచలం ఆలయం, పర్ణశాల, మణుగూరు భారజల ప్లాంట్ వంటి ముఖ్యమైన కట్టడాలకు మాత్రమే వరద రక్షణ గోడలు నిర్మించాలని, మిగిలిన ముంపు ప్రాంతాల్లోని ఆవాసాలు, గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో వరద రక్షణ గోడలకు ప్రత్యామ్నాయంగా ఇతర రాష్ట్రాలు తీసుకున్న చర్యలను టెక్నికల్ కమిటీ పరిశీలించనుంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా భద్రాచలం వరద రక్షణ గోడల ప్రాజెక్టుపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# వరదల్లో 49 మంది మృతి

## హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం మరో నివేదిక

సాక్షి, హైదరాబాద్: పది రోజుల క్రితం కురిసిన వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో 49 మంది మరణించినట్టు ప్రభుత్వం హైకోర్టుకు నివేదిక సమర్పించింది. ఇందులో నలుగురు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మరణించారని పేర్కొంది. గత వారంలో ఒక నివేదిక అందజేయగా, ఇప్పుడు మరో నివేదిక అందజేసింది. ‘మృతుల కుటుంబానికి రూ.4 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించాం. వరదసాయానికి రూ.500 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వరద తీవ్రత ఎక్కువ ఉన్నందున రెండు హెలికాప్టర్లు, 27 పడవల్ని అందుబాటులో ఉంచాం. 655 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాం. 177 షెల్టర్లు ఏర్పాటు చేసి 12 వేలమందికి ఆశ్రయం కల్పించాం. 10 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, రెండు హెలికాప్టర్లు, రాష్ట్ర అగ్నిమాపక, విపత్తుల శాఖలు వరద బాధితులకు అండగా నిలిచాయి. మొత్తం 548 రోడ్లు దెబ్బతినగా.. వీటిలో 471 రాష్ట్ర రహదారులుండగా, 181 రోడ్లకు మరమ్మతులు జరిగాయి. 774 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వచ్చింది. 721 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ చేశాం. రోడ్ల మరమ్మతులు, విద్యుత్ వంటివాటిని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నాం’అని రాష్ట్ర విపత్తుల కమిషనర్ బొజ్జా రాహుల్ హైకోర్టుకు తెలియజేశారు. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం కింద ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ డాక్టర్ చెరుకు సుధాకర్ 2020లో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ మధ్యంతర అప్లికేషన్(ఐఏ) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఐఏపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్ కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

# మూలధన వ్యయంలో అగ్రభాగాన ఏపీ

## ఆస్తుల కల్పన వ్యయంలో అగ్రపథంలో ఆంధ్రప్రదేశ్.. 3 నెలల్లో 40 శాతం వ్యయం



సాక్షి, అమరావతి: ఆస్తుల కల్పనకు ఉద్దేశించిన మూలధనం వ్యయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూలధన వ్యయంపై కాగ్ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. బడ్జెట్‌లో మూలధన వ్యయం కేటాయింపుల్లో తొలి త్రైమాసికంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 40.79 శాతం వ్యయం చేసినట్లు కాగ్ గణాంకాలు తెలిపాయి. దేశంలో మరే రాష్ట్రంలోనూ తొలి త్రైమాసికంలో ఇంత మేర వ్యయం చేయలేదని కాగ్ గణాంకాలు పేర్కొన్నాయి. పలు రాష్ట్రాలు బడ్జెట్‌లో మూలధన వ్యయం కేటాయింపుల్లో ఎంతమేర ఖర్చు చేశాయనే అంశాన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక కూడా వెల్లడించింది. మూలధన కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ చేసినంత వ్యయం దేశంలో మరే రాష్ట్రంలోనూ చేయలేదని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. బడ్జెట్‌లో మూలధన వ్యయానికి చేసిన కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏప్రిల్, మే నెలల్లోనే ఏకంగా 29.70 శాతం వ్యయం చేసిందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికానికి సంబంధించి కాగ్ గణాంకాలు కూడా మూలధన వ్యయంలో ఆంధ్రప్రదేశ్ మిగతా రాష్ట్రాల కన్నా ముందంజలో ఉన్నట్లు వెల్లడించాయి. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మూలధన వ్యయం కింద రూ.31,061 కోట్లు కేటాయింపులు చేయగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు రూ.12,669 కోట్లు వ్యయం చేసిందని, ఇది కేటాయింపుల్లో 40.79 శాతమని కాగ్ గణాంకాలు స్పష్టం చేశాయి. ఆంధ్రప్రదేశ్ తరువాత మూలధన కేటాయింపుల్లో ఎక్కువ వ్యయం చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ, తమిళనాడు, కేరళ, రాజస్థాన్, మహారాష్ట్ర ఉన్నాయి. మూలధన వ్యయం అంటే నేరుగా ఆస్తుల కల్పన వ్యయంగా పరిగణిస్తారు.

# బధిరులకు డిగ్రీ కాలేజీ ఏర్పాటు యోచన

## వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో బధిర విద్యార్థులకు ప్రత్యేకంగా డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సీఎం ఆదేశించారని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. మంగళవారం మలక్‌పేట్‌లోని తన కార్యాలయంలో ఖైరతాబాద్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేందర్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. బధిరుల డిగ్రీ కాలేజీ ఏర్పాటుతోపాటు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ...డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం పరిశీలన బృందం చేసిన ప్రతిపాదనలపై వీలైనంత త్వరగా నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. రాష్ట్రంలో బధిరులకు కళాశాల లేనందున వారు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బధిర విద్యార్థుల కళాశాల ఏర్పాటు కోసం గతంలో సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందించామని, దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# మొబైల్ ఫోన్ రికవరీలో తెలంగాణ టాప్

సాక్షి, హైదరాబాద్ : చోరీకి గురైన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల జాడ కనిపెట్టడంలో దేశంలోనే తెలంగాణ పోలీసు నంబర్‌వన్‌గా నిలిచారు. మొత్తం 67.98% రికవరీతో మొబైల్‌ఫోన్ల జాడను కనిపెట్టి వాటిని సంబంధిత వ్యక్తులకు అందజేసినట్లు సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్ తెలిపారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్‌ఫోన్లను రికవరీ చేసేందుకు టెలికమ్యూనికేషన్స్ విభాగం రూపొందించిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పోలీస్‌శాఖలు వినియోగిస్తున్నాయని, ఈ పోర్టల్‌ను ఉపయోగించి మొబైల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ పోలీస్ విభాగం తొలిస్థానంలో నిలిచిందని ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 20 నుంచి ఆగస్టు 07 వరకు మొబైల్ ఫోన్ల చోరీ, పోగొట్టుకోవడంపై తెలంగాణ పోలీసులకు అందిన ఫిర్యాదుల మేరకు 5,038 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ తర్వాత కర్ణాటక 54.20% రెండో స్థానంలో, 50.90%తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నిలిచినట్లు మహేశ్ భగవత్ పేర్కొన్నారు.

# విద్య.. ‘సార్వత్రికం’

- బడి మధ్యలో మానేసినవారికి వరం..
- 14 ఏండ్లు నిండిన వారికి పదో తరగతిలో ప్రవేశం
- దరఖాస్తులకు ఈ నెల 10 వరకు గడువు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 77 అధ్యయన కేంద్రాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో, అధికారులు

**ఉమ్మడి జిల్లాలోని అధ్యయన కేంద్రాలు**

| జిల్లా | కేంద్రాలు |
|---|---|
| ఆదిలాబాద్ | 20 |
| నిర్మల్ | 23 |
| మంచిర్యాల | 17 |
| కుమురంభీం | 17 |
| మొత్తం | 77 |

**ఉమ్మడి జిల్లాలో గతేడాది ప్రవేశాలు, ఉత్తీర్ణులైన వారి వివరాలు**

| జిల్లా | పదోతరగతి | ఉత్తీర్ణులు | ఇంటర్ | ఉత్తీర్ణులు |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 934 | 463 | 499 | 215 |
| నిర్మల్ | 736 | 539 | 515 | 289 |
| మంచిర్యాల | 624 | 529 | 1335 | 925 |
| కుమురంభీం | 489 | 257 | 394 | 181 |



నిర్మల్‌ఖిల్లా: ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో కనీసం పదో తరగతి కూడా పూర్తి చేయలేనివారు, చదవాలనే ఆసక్తి ఉన్నా ఇంట్లో పరిస్థితుల ప్రభావంతో చదివే అవకాశం లేక చాలా మంది పాఠశాలలకు దూరంగా ఉన్నారు. వీరికోసమే ప్రభుత్వం ఓపెన్ స్కూల్ (సార్వత్రిక) దూర విద్య విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా గతనెల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పది, ఇంటర్ తరగతులను రెగ్యులర్ మాదిరిగా సులభరీతిలో బోధించనున్నారు. ఎంపిక చేసిన మండలంలో బోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడికి మండల సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగిస్తున్నారు. ప్రతీనెల రెండో శని, ఆదివారాల్లో ఏడాదిలో 30 క్లాసులు ఉంటాయి.

**అందుబాటులో ఉన్న కోర్సులు**

పదో తరగతిలో బోధన విషయాలను మూడు గ్రూపులుగా విభజించారు. గ్రూపు (ఏ)లో భాషలు, గ్రూపు(బీ)లో ప్రధాన పాఠ్యాంశాలు, గ్రూపు (సీ)లో వృత్తి విద్యాకోర్సులు ఉంటాయి. ఇంటర్‌లో గ్రూపు (ఏ)లో భాషలు, గ్రూపు (బీ)లో ఆప్షనల్స్, గ్రూపు (సీ)లో విద్యాకోర్సులు ఉంటాయి. పదిలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమం, ఇంటర్‌లో తెలుగు, హిందీ, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాలు అందుబాటులో ఉన్నాయి. ఓపెన్ స్కూల్ విద్యను పూర్తి చేసిన వారు రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా అన్ని కోర్సులు, ఉన్నత విద్య, ఉద్యోగాలు పొందడానికి అర్హులు.

**ఆన్‌లైన్‌లో నమోదు**

ఓపెన్ స్కూల్‌లో చేరాలకునే వారు www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. వీటిని ఉన్నత విద్య, ఉద్యోగాలకు వినియోగించుకోవచ్చు. దరఖాస్తులకు ఆగస్టు 10 వరకు గడువు ఉంది. అపరాధ రుసుముతో ఈ నెల 31 వరకు ఉంది. 14 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్నవారంతా అర్హులే. వయస్సు నిర్ధారణకు తహసీల్దార్ లేదా మున్సిపల్ అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రం జతపరచాలి. మధ్యలో బడి మానేస్తే అప్పటి బదిలీ పత్రం, ఆధార్ కార్డు పత్రాలతో ప్రవేశాలు పొందవచ్చు.

**ఇంటర్‌లో చేరాలంటే..**

15 ఏళ్ల వయస్సు ఉన్నవారంతా ఇంటర్‌లో చేరేందుకు అర్హులే. పదో తరగతి బదిలీ పత్రం, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్‌లో ప్రవేశం పొందవచ్చు. ఓపెన్ టెన్త్‌లో చేరేందుకు ఓసీలకు రూ.1,400, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీలకు రూ.1000, ఇంటర్‌లో చేరేందుకు ఓసీలకు రూ.1,500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యంగులు, మైనార్టీలకు రూ.1,200 ఫీజు చెల్లిస్తే పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది.

**ఆసక్తి ఉన్నవారికి సదవకాశం**

సార్వత్రిక విద్యా విధానంలో చదివి చాలా మంది జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్‌లో ప్రవేశం పొందడానికి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. చదువుకోవాలన్న ఆసక్తి ఉండి, అవకాశాలు లేనివారికి ఇది మంచి అవకాశం. వివరాలకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

– ఎస్.అశోక్‌కుమార్, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్

# ఈజీఎస్ కార్యాలయంపై ఏసీబీ దాడులు

- ఎంబీ రికార్డు కోసం రూ.4 వేల డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు కోల శంకరయ్య
- ఈసీ దీపికను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



దీపికతో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

రాయికల్:(జగిత్యాల) : జగిత్యాల జిల్లా రాయికల్ ఈజీఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్(టీఏ)విజేశ్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్(ఈసీ) దీపిక ఇదే మండలం రామాజీపేట గ్రామానికి చెందిన రైతు కోల శంకరయ్య నుంచి రూ.4వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. కోల శంకరయ్య ఉపాధిహామీ ద్వారా 2021లో గేదెల పాక కోసం రూ.57 వేలు వెచ్చించి షెడ్డు నిర్మించాడు. రూ.47వేల ఎంబీ రికార్డు కోసం ఈజీఎస్ అధికారులను సంప్రదించాడు. అయితే, తమకు రూ.8వేలు లంచం ఇవ్వాలని తొలుత వారు డిమాండ్ చేశారు. తాను అంతగా ఇవ్వలేనని చెప్పి చివరకు రూ.4వేలు ఇచ్చేందుకు ఈసీ, టీఏలతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ తర్వాత బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఈసీ దీపికకు రూ.4వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. టీఏ విజేశ్ పరారయ్యాడు. దీపికను ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

**లంచం అడిగారు**



ఉపాధిహామీలో గేదెల పాక కోసం 2021లో కట్టిన. రూ.47వేలు రావాల్సి ఉంది. ఈజీఎస్ అధికారుల చుట్టూ తిరిగినా ఇవ్వలేదు. అందుకే ఏసీబీ అధికారులను ఆశ్రయించిన.

– కోల శంకరయ్య, బాధితుడు

**ఏసీబీని సంప్రదించాలి**



ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే నేరుగా ఏసీబీని సంప్రదించండి. వివరాలను ఏబీసీ డీఎస్పీ 91543 88954, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ 91543 88957, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ రాము 91543 88956, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ తిరుపతి 91543 88955 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వండి. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– రమణమూర్తి, డీఎస్పీ

# అవినీతి రహిత దేశమే లక్ష్యంగా పాదయాత్ర



జిల్లాకు చేరుకున్న దిలీప్ కుమార్ పాదయాత్ర

ఆదిలాబాద్: పర్యావరణ పరిరక్షణ, అవినీతి రహిత భారత దేశమే లక్ష్యంగా మధ్యప్రదేశ్‌కు చెందిన దిలీప్‌కుమార్ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ బచావో పేరిట పాదయాత్ర చేపడుతున్నాడు. ఇందులో భాగంగా మంగళవారం ఆదిలాబాద్‌కు చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యం, అవినీతిని అంతం చేయాలనే సంకల్పంతో పాదయాత్ర చేపట్టినట్లు తెలిపాడు.

# వైద్య విద్యార్థి మృతికి సంతాపం



ప్రవీణ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు

ఆదిలాబాద్: రిమ్స్ పీజీ వైద్య విద్యార్థి భూక్యా ప్రవీణ్ మృతిపై ఆస్పత్రి ఆడిటోరియంలో మంగళవారం సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, మౌనం పాటించి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఇందులో డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యాధికారులు, మెడికోలు, తదితరులు పాల్గొన్నారు.

# గోలేటి యువకుడికి డెప్యూటీ జైలర్ కొలువు



అజయ్‌చారి

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం గోలేటి పంచాయతీ పరిధిలోని భగత్‌సింగ్ నగర్‌లోని వడ్రంగి కుటుంబానికి చెందిన సిరికొండ అజయ్‌చారి డెప్యూటీ జైలర్‌గా ఎంపికయ్యాడు. గోలేటిలో కులవృత్తి చేసుకుని జీవించే సిరికొండ రామయ్య, రమ దంపతులకు మారుడు అజయ్ ప్రస్తుతం ఆసిఫాబాద్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గతంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేశాడు. కానిస్టేబుల్ ఉద్యోగం రావడంతో ఆసిఫాబాద్‌లో పనిచేస్తున్నాడు. అజయ్ మేనమామ రాజశేఖర్ గతంలో డెప్యూటీ జైలర్‌గా ఎంపికై కొన్నేళ్లపాటు విధులు నిర్వర్తించి, సివిల్ ఎస్సై కొలువు సాధించి ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నాడు. మేనమామ స్ఫూర్తితో అజయ్‌చారి డిప్యూటీ జైలర్ ఉద్యోగం సాధించాడు.

# ఆక్రమించిన భూములు పంచాల్సిందే..

- లేఖ విడుదల చేసిన మావోయిస్టు నేత వెంకటేశ్

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్‌లోగల పోరంబోకు భూములను పేదలకు పంపిణీ చేసి పట్టాలు ఇవ్వాలని మావోయిస్టు నేత వెంకటేశ్ అలియాస్ కంకణాల రాజిరెడ్డి మంగళవారం ఓ లేఖ విడుదల చేశారు. కూనారంలోని 600 ఎకరాలు పేదలు సాగు చేసుకుంటున్నారని, వారు కాకుండా మిగిలిన 600 ఎకరాలను అక్రమంగా కొందరు భూస్వాములు ఆక్రమించుకున్నారని, సదరు భూమిని పంపిణీ చేయాలని లేఖలో పేర్కొన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి భూమిలేని నిరుపేదలకు పట్టాలు ఇప్పిస్తానని చెప్పి ఇప్పుడు పట్టించుకోవటం లేదని, పేదలకు చెందాల్సిన భూ ములు ఆక్రమించుకున్న బడా బాబులు ఆ భూములను వదిలి పెట్టకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే జిల్లాకేంద్రంలోని వివాదాస్పద భూములను నాయకులు, అధికారుల అండతో నకిలీ పట్టాలతో అమాయక ప్రజలకు అంటగడుతూ మోసం చేస్తున్న కట్టా నరేంద్రచారి, కంది చొక్కారెడ్డి.. బాధితులకు డబ్బులు తిరిగి ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆ లేఖలో హెచ్చరించారు. ఈ లేఖ జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త

- తెలియని సందేశాలకు వినియోగదారులు స్పందించొద్దు
- టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు

కొత్తపల్లి(కరీంనగర్): సైబర్ మోసగాళ్ల విషయంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, తెలియని సందేశాలు, లింక్‌లకు స్పందించి మోసపోవద్దని టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్ రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోని 17జిల్లాల విద్యుత్ వినియోగదారులు సైబర్ మోసాలకు గురికావద్దంటూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఇటీవల సైబర్ మోసగాళ్లు విద్యుత్ వినియోగదారుల ఫోన్లకు ‘మీ ఇంటి కరెంటు బిల్లు ఇంకా కట్టలేదు బిల్లు పెండింగ్‌లో ఉన్నందున కరెంట్ కట్ చేస్తున్నాం.. ఈ కింది నంబర్‌కు ఫోన్ చెయ్యండి’ అని మెసేజ్‌లు పంపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అటువంటి మెసేజ్‌లు పంపమని, ఇలాంటి మెసేజ్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎన్పీడీసీఎల్ అధికారులు ఎవరి బ్యాంకు ఖాతా, ఆధార్, పాన్, డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు అడగరని, ఎవరు అడిగినా.. చెప్పకూడదన్నారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ యాప్‌తో కరెంటు బిల్లు కట్టవచ్చని చెప్పారు.



● హ్యాండ్‌లూమ్ డే సందర్భంగా చేనేత వస్త్రాల ప్రదర్శన...

తరం మారింది. ఈ తరంలో మగ్గంతో పని చేసే వాళ్లలో మహిళలే ఎక్కువ. గిట్టుబాటు లెక్క చూసుకుని ఈ వృత్తిని వదిలేస్తున్నారు మగవాళ్లు. ఇంతకాలం మగవాళ్లకు సహాయంగా పని చేసిన మహిళలు ఇప్పుడు మగ్గం ముందు కూర్చున్నారు. కండె చేతిలోకి తీసుకున్నారు. తదేకంగా పని చేస్తున్నారు. వాళ్ల దీక్ష చూస్తుంటే మాటలతో పని లేనట్లు మౌనంగా ధ్యానంలో ఉన్నట్లే ఉంటారు. వాళ్ల చేతులు మాట్లాడతాయి. మగ్గం మీద దారంతో అద్భుతాలు సృష్టిస్తాయి. కశ్మీర్ నుంచి కేరళ వరకు ఈ మంత్రజాలం అంతా కొత్త చేనేతరానిదే. వారికి వందనం.

# వందే నేతరం



జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా (ఆగస్టు 7వ తేదీ) సోమవారంనాడు దేశంలోని చేనేతల గొప్పదనాన్ని తెలియజేసే కార్యక్రమం జరిగింది. హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని గౌరంగ్స్ కిచెన్‌లో 'విష్పర్స్ ఆఫ్ ద లూమ్' పేరుతో మాస్టర్ టెక్స్‌టైల్ డిజైనర్ గౌరంగ్ షా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జామ్‌దానీ నేత ప్రత్యేకతను వివరించారు. ఈ నేత విధానాన్ని మనదేశంలో ఎన్ని ఇతర చేనేతలతో సమ్మిళితం చేయవచ్చనేది ప్రయోగపూర్వకంగా వివరిస్తూ వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు గౌరంగ్.

### ఈ తరం మనసు పడుతోంది!

మహిళలు మనదేశ సంప్రదాయ చేనేత వైవిధ్యాన్ని చెరిగిపోని జ్ఞాపకంగా నిలుపుతున్నారు. కశ్మీర్ నుంచి ఢాకా వరకు, కోట, పైథానీ, వెంకటగిరి, ఉప్పాడ, బనారస్, కంజీవరం, పటోలా, మహేశ్వరి, చందేరి, జాకార్డ్, బంధాని, ఇకత్... ఇలా ఎన్నో రకాల చేనేతలున్నాయి మనదేశంలో. కొత్తదనం ఎప్పుడూ మనిషిని ఆశ్చర్యానికి గురి చేస్తూనే ఉంటుంది. ఆశ్చర్యం ఆకర్షణగా మారుతుంది. అలా వెస్టర్న్ టెక్స్‌టైల్ ప్రవాహంలో కొంతకాలం మన సంప్రదాయ చేనేతలు తెరమరుగయ్యాయి. కానీ కనుమరుగు మాత్రం కాలేదు. భారతీయత లాగానే మన చేనేత కూడా తన ఉనికిని చాటుతూనే ఉంది. పడి లేచిన కెరటంలాగ ఇప్పుడు మన సంప్రదాయ చేనేత ఫ్యాషన్ ప్రపంచాన్ని శాసిస్తోంది. చేనేతలో ఈ తరం చేసిన ప్రయోగాలు మహిళల మనసును దోచుకుంటున్నాయి. రోజూ చీర కట్టడానికి ఇష్టపడని మహిళలు కూడా మన చేనేత చీరల కోసం వార్డ్‌రోబ్‌లో కొంత స్థలాన్ని కేటాయిస్తున్నారు. పండుగలు, వేడుకల వంటి ప్రత్యేకమైన రోజులను చేనేత చీరలతో పరిపూర్ణం చేసుకుంటున్నారు. ఈ రంగంలో చేనేత కళాకారుల కృషి కనువిందు చేస్తోంది.


### వైవిధ్యాల సమ్మేళనం!

ఒకప్పుడు ఒక చేనేత చీరను చూడగానే అది ఇకత్ అనీ, చందేరి, ఉప్పాడ, వెంకటగిరి, ధర్మవరం, పైథానీ... ఇలా వెంటనే పేరు చెప్పగలిగేటట్లు ఉండేవి. తరాలు మారుతున్నా నేత విధానంలో ఏ మార్పూ లేకపోవడం వల్ల ఆదరణ తగ్గుతూ వచ్చింది. అలవాటు పడిన తరాలు తప్ప కొత్తతరం చేనేత వైపు చూడని రోజులు కూడా వచ్చేశాయి. అప్పుడు వచ్చింది కెరటంలాంటి ఓ ట్రెండ్. కంజీవరంలో జామ్‌దాని, బనారస్‌లో జాకార్డ్, ఉప్పాడలో జామ్‌దాని... ఇలాంటి ప్రయోగాలతో ఈ తరం చేనేత చీర ఒక పజిల్‌లా ఉంది. దేశంలో ఉన్న నాలుగైదు రకాల వైవిధ్యతలకు ప్రతీకగా మారింది.

మనం పరిరక్షించుకోవాల్సింది చేనేతను, చేనేతకారులను కూడా. సంప్రదాయ చేనేతకారుల కుటుంబాల నుంచి మహిళలు ఆ బాధ్యతను తలకెత్తుకున్నారు. వారికి సహకారం ఉంటే అద్భుతాలు సృష్టించగలరని నిరూపిస్తున్నారు. ఈ రంగం మీద సంప్రదాయ చేనేత కుటుంబాల నుంచి మాత్రమే కాకుండా ఆసక్తి కొద్దీ ఇతరులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. తన ప్రయోగాలకు సంప్రదాయ కుటుంబాలు శ్రద్ధ చూపించనప్పుడు వ్యవసాయరంగంలో పనులు చేసుకునే మహిళలకు శిక్షణ ఇచ్చి కొత్త చేనేతకారులను తయారు చేశానని చెప్పారు గౌరంగ్. మన వస్త్రాలు దేహాన్ని కప్పుకోవడానికి మాత్రమే కాదు... అంతకంటే ఎక్కువగా భారతీయతను చాటి చెప్తాయి. మన కళాకారుల సృజనను, మేధను ప్రతిబింబిస్తాయి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

### కళాత్మకతను కాపాడుకోవాలి!



చేనేతలో వైవిధ్యభరితంగా ఒక చీర తయారు కావాలంటే నెలలు పడుతుంది, ఏళ్లు కూడా పడుతుంది. ఒక అంగుళంలో ఎనభై దారాలతో నేస్తే పట్టే సమయం ఒకలా ఉంటుంది. అంగుళంలో నాలుగు వందల దారాలతో నేస్తే పట్టే సమయం వేరు. నాలుగు వందల కౌంట్ దారం కంటికి కనిపించనంత సన్నగా ఉంటుంది. డిజైన్‌ను బట్టి చీర తయారయ్యే సమయం కూడా పెరుగుతూ ఉంటుంది. రెండు దారాలు తప్పుగా పడినా సరే పువ్వు ఆకారం మారిపోతుంది. ఒక వరుస నేయడానికి పదిహేను నుంచి ఇరవై నిమిషాల సమయం పడుతుంది. అలా ఎన్ని వందల వరుసలు నేస్తే ఆరు మీటర్ల వస్త్రం తయారవుతుందో ఊహించుకోవాల్సిందే. మహిళలు ఉదయం ఇంటి పనులు చక్కబెట్టుకుని పన్నెండు– పన్నెండున్నర సమయంలో మగ్గం మీదకు వస్తే సాయంత్రం ఆరు గంటల వరకు తదేకంగా దీక్షతో పని చేస్తారు. ఇంత అద్భుతమైన కళను ముందు తరాలకు అందేలా కొనసాగించాలి. ఒక హెరిటేజ్ కన్‌స్ట్రక్షన్‌ను పరిరక్షించుకున్నట్లే ఈ సంప్రదాయ కళలను కూడా కాపాడుకోవాలి. ఈ ఏడాది హ్యాండ్‌లూమ్ డే కోసం... చేనేత ప్రయోగాలతోపాటు కలంకారీ, పటచిత్ర, చేర్యాల పెయింటింగ్‌లు, ఎంబ్రాయిడరీల్లో చికన్‌కారీ, కచ్‌వర్క్, ఆరే వర్క్, కసౌటీ, కశ్మీరీవర్క్‌లను కూడా చేనేతకు జోడించి ఓ ప్రయోగం చేశాను.

– గౌరంగ్ షా,
మాస్టర్ టెక్స్‌టైల్ డిజైనర్



● డాక్టర్ శివరంజని

ప్రాణ రక్షణ

ఫస్ట్ ఎయిడ్ గురించి కొద్దిపాటి అవగాహన ఉన్నా వేలకొద్దీ ప్రాణాలను కాపాడవచ్చు అంటున్నారు డాక్టర్ శివరంజని. హైదరాబాద్‌కు చెందిన ఈ పిడియాట్రీషియన్ పసిపిల్లల్లో, పెద్దల్లో వచ్చే హఠాత్ అపస్మారకం, ఉక్కిరిబిక్కిరి, ఫిట్స్ సమయాల్లో ఎలా వ్యవహరిస్తే ప్రాణాలు నిలుస్తాయో గత దశాబ్దకాలంగా ఉచిత వర్క్‌షాపుల ద్వారా చైతన్యపరుస్తున్నారు. తన జీవితంలోని ఒక సంఘటన వల్లే లైఫ్ సేవింగ్ స్కిల్స్ అవసరాన్ని తెలుసుకున్నానని అంటున్నారామె.

# శివరంజని సంజీవని

రాధిక (పేరు మార్చాం) హాల్లో టీవీ చూస్తోంటే బాత్‌రూమ్‌లోనుంచి ధబ్‌మని శబ్దం వచ్చింది. పరిగెత్తుకెళ్లి చూస్తే భర్త అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అతనికి హార్ట్‌ఎటాక్ వచ్చినట్టు ఆమెకు అర్థమైంది. అదృష్టవశాత్తు నెల క్రితం ఆమె డాక్టర్ శివరంజని నిర్వహించిన ఒక వర్క్‌షాప్‌లో సి.పి.ఆర్. ఎలా చేయాలో తెలుసుకుంది. వెంటనే ఛాతీ మీద నియమానుసారం నొక్కుతూ భర్తకు నోటితో ఊపిరి అందించింది. భర్తలో చలనం వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తరలిస్తే అతనికి వచ్చిన హార్ట్‌ఎటాక్ ప్రాణాంతకం కాకుండా కాపాడటంలో ఆమె చేసిన సి.పి.ఆర్ చాలా ముఖ్యపాత్ర పోషించిందని డాక్టర్లు తెలిపారు. 'ఫస్ట్ ఎయిడ్ తెలిస్తే ఇలాగే ఎన్నోప్రాణాలు నిలుస్తాయి. ఆమె సాధారణ గృహిణి. సి.పి.ఆర్. ఎలా చేయాలో ఎవరో ఒకరు చెప్పాలి కదా. ఆమెకే కాదు.. ఆమె లాంటి గృహిణులకు స్త్రీలకు అందరికీ ఎవరో ఒకరు తెలపాలి. నా వంతుగా నేను వర్క్‌షాప్స్ ద్వారా తెలుపుతున్నాను' అంటారు శివరంజని.



● వర్క్‌షాప్ నిర్వహిస్తూ...

### పిల్లల డాక్టర్

డాక్టర్ శివరంజని పిల్లల డాక్టర్. 'మా నాన్నగారు, తాతగారు కూడా డాక్టర్లే. నేను డాక్టర్ కావాలనుకున్నప్పుడు పిల్లలంటే ఇష్టం కనుక వారికి వైద్యం చేయడంలో ఆనందం ఉందనిపించింది. జిప్‌మర్ (పాండిచ్చేరి)లో పిల్లల వైద్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను' అన్నారు శివరంజని. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో పిల్లల డాక్టర్‌గా పని చేస్తున్నారు. అయితే కేవలం తన వృత్తిని పనిగా మాత్రమే చూడదలుచుకోలేదు. తనకు తెలిసిన జ్ఞానాన్ని సామాన్యులకు కొద్దిగానైనా అందుబాటులో తేవాలని అనుకున్నారు. 'మన దగ్గర ప్రతి ఆరు మరణాల్లో ఒకటి ఫస్ట్ ఎయిడ్ ఎలా చేయాలో తెలియపోవడం వల్ల జరుగుతోంది. గుండెపోటు, మూర్ఛ, అపస్మారకం, ఊపిరాడకపోవడం ఇలాంటి సందర్భాల్లో ఏం చేయాలో ఎలా చేయాలో అందరికీ శాస్త్రీయమైన శిక్షణ ఉంటే చాలా ప్రాణాలు కాపావచ్చు. అందుకే గత పదేళ్లుగా నేను ఉచితంగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ చైతన్యం తెస్తున్నారు' అన్నారామె.

### మలుపు తిప్పిన ఘటన

'నేను పాండిచ్చేరిలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తున్నప్పుడు ఒకరోజు ఉసిరి కాయలు తింటుంటే హటాత్తుగా ఉక్కిరిబిక్కిరి అయ్యింది. నా పక్కనే సహ విద్యార్థిని ఉంది. ఆమెకు ఇలాంటి స్థితిలో చేయాల్సిన హైమ్‌లక్ మనూవా (ఉక్కిరిబిక్కిరి సమయంలో పొత్తికడుపు మీద నొక్కుతూ చేయాల్సిన ఫస్ట్ ఎయిడ్) తెలుసు. వెంటనే చేసింది. ఆమె లేకున్నా, ఆ ఫస్ట్ ఎయిడ్ చేయకున్నా ఇవాళ మిగిలేదాన్ని కాదు. అప్పుడే నాకు ఫస్ట్ ఎయిడ్ విలువ ఏంటో తెలిసింది. కాని దురదృష్టం మన దేశంలో ఇందుకై సాధారణ ప్రజలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వరు. అవగాహన కల్పించరు. కొద్దిమందికే ఈ అవగాహన ఉంటుంది. నా వంతుగా నేను వర్క్‌షాప్స్ ద్వారా అవగాహన కలిగిస్తున్నాను' అన్నారు శివరంజని.

### పసిపిల్లలకు

'చంటిపిల్లలు ఒక్కోసారి ఊపిరిపీల్చని స్థితికి వెళతారు. సి.పి.ఆర్ చేయడం తెలిసుంటే పిల్లల్ని కాపాడుకోగలుగుతారు తల్లులు. అలాగే వారు గొంతుకు అడ్డం పడేలా ఏదైనా మింగినప్పుడు కూడా ఏం చేయాలో తల్లులకు తెలియాలి. ఇవన్నీ నా వర్క్‌షాప్స్‌లో చూపిస్తాను. ఇందుకు బొమ్మలను ఉపయోగిస్తాను' అన్నారు శివరంజని. ఇందు కోసం ఆమె నేరుగా ఆన్‌లైన్‌లో సెషన్స్ నిర్వహిస్తారు. 'కాని చాలామంది తల్లులు సెషన్స్‌కు రారు. ఆ ఏముందిలే అనుకుంటారు. వారిని ఒప్పించి తేవడం కష్టం. అయినా నేను పట్టువిడవక ప్రయత్నిస్తాను. ఫోన్లు చేసి పిలుస్తాను. వాట్సప్ గ్రూప్ పెట్టి వెంటపడతాను' అంటారు శివరంజని.

డాక్టర్ శివరంజని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బెంగుళూరులలో గత పదేళ్లలో 12 వేల మంది తల్లులకు, సాధారణ వ్యక్తులకు ఫస్ట్ ఎయిడ్ స్కిల్స్ నేర్పించారు. అంతేకాదు... సీజనల్‌గా అవసరమైన హెల్త్ అవేర్‌నెస్ కోసం వీడియోలు చేస్తుంటారు. ఇలాంటి కృషి విలువైనది. ఇతర డాక్టర్లు అనుసరించాల్సినది.

ఫస్ట్ టైమ్



పద్దెనిమిది సంవత్సరాల రిన్ష పట్టిక డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) లైసెన్స్ పొందిన కేరళ తొలి మహిళా డ్రోన్ పైలట్‌గా చరిత్ర సృష్టించింది....

# కలల రెక్కలతో...

కేరళలోని మలప్పురానికి చెందిన రిన్ష పట్టికకు గాలిలో ఎగురుతున్న డ్రోన్‌లను చూడడం అంటే సరదా. ఆ సరదా కాస్తా ఆసక్తిగా మారింది. డ్రోన్‌లకు సంబంధించిన ఎన్నో విషయాలను సివిల్ ఇంజనీర్ అయిన తండ్రి అబ్దుల్ రజాక్‌ను అడిగి తెలుసుకునేది.

ప్లస్ టు పూర్తయిన తరువాత బీటెక్ అడ్మిషన్ కోసం ఎదురుచూస్తున్న టైమ్‌లో విరామ కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలా అని ఆలోచిస్తున్నప్పుడు రిన్షకు తట్టిన ఐడియా డ్రోన్ ఫ్లయింగ్ ట్రైనింగ్ కోర్సు. తండ్రితో చెబితే ఆయన 'బాగుంటుంది' అని ఓకే చెప్పి ప్రోత్సహించాడు.

శిక్షణ కోసం కాసర్‌గోడ్‌లోని ఏఎస్‌ఏపీ కేరళ కమ్యూనిటీ స్కిల్ పార్క్‌లో చేరింది. క్లాసులో తాను ఒక్కతే అమ్మాయి!

ఈ స్కిల్‌పార్క్‌లో యువతరం కోసం ఆటోమోటివ్ టెక్నాలజీ, కంప్యూటర్ హార్డ్‌వేర్, హాస్పిటాలిటీ, రిటైల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఎన్నో వొకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డ్రోన్ ఫ్లయింగ్ కోర్సుకు మంచి డిమాండ్ ఉంది.

కోర్సులో భాగంగా బేసిక్ ఫ్లైట్ ప్రిన్సిపల్స్ నుంచి డ్రోన్ ఫ్లయింగ్ రూల్స్ వరకు ఎన్నో నేర్చుకుంది రిన్ష.

ఏరియల్ సర్వైలెన్స్, రెస్క్యూ ఆపరేషన్స్, అగ్రికల్చర్, ట్రాఫిక్, వెదర్ మానిటరింగ్, ఫైర్ ఫైటింగ్‌లతోపాటు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డెలివరీ సర్వీస్... మొదలైన వాటిలో డ్రోన్‌లకు ప్రాధాన్యత పెరుగుతోంది.

మన దేశంలో డ్రోన్స్ ఆపరేట్ చేయడానికి డీజీసీఏ డ్రోన్ రిమోట్ పైలట్ సర్టిఫికెట్ తప్పనిసరి.

డీజీసీఏ లైసెన్స్ పొందిన కేరళ తొలి మహిళా డ్రోన్ పైలట్‌గా చరిత్ర సృష్టించిన రిన్ష ఇలా అంటోంది...

'రెస్క్యూ ఆపరేషన్స్ నుంచి ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వరకు ఎన్నో రంగాలలో డ్రోన్‌లు విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చాయి. డీజీసీఏ డ్రోన్ రిమోట్ పైలట్ సర్టిఫికెట్ అందుకున్నందుకు గర్వంగా ఉంది'

'రిన్ష విజయం ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తి ఇస్తుంది' అంటున్నారు స్కిల్‌పార్క్ ఉన్నతాధికారులు.

యూత్ పల్స్



# అయ్ బాబోయ్... ఏఐ!

'వేవ్ ఆఫ్ ది ఫ్యూచర్'గా చెబుతున్న ఏఐ సాంకేతికత యువతలోని ఒక వర్గంలో వేల భయాలను రేకెత్తిస్తోంది. భూతంలా భయపెడుతోంది. ఏఐ టెక్నాలజీ వల్ల ఉన్న ఉద్యోగాలు పోతాయనీ, ఉద్యోగావకాశాలు ఉండవనే ఆందోళనకు 'ఏఐ యాంగ్జైటీ' అని పేరు పెట్టారు....

ఈ భయం ఈనాటిది కాదు. 'ఈ యంత్రాలు మన ఉపాధిని మింగేస్తాయి' అనే భయం పారిశ్రామిక విప్లవం రోజుల నుంచి ఉన్నదే. చాట్ జీపీటీ విజయవంతం అయిన తరువాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అనేది ఇప్పుడు యువతను భూతమై భయపెడుతోంది. ఒక సర్వే ప్రకారం పద్దెనిమిది నుంచి ఇరవైనాలుగు సంవత్సరాల మధ్య వయసు వాళ్లు తమ కెరీర్‌కు సంబంధించిన భయాలతో ఉన్నారు.

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అంచనా ప్రకారం 2025 కల్లా 85 మిలియన్ల ఉద్యోగాలు ఏఐ సాంకేతికతతో భర్తీ అవుతాయి. ఈ నేపథ్యంలో కంపెనీలలో ఉద్యోగుల భవిష్యత్ పనితీరు ఎలా ఉండబోతున్నది అనేది హాట్ టాపిక్‌గా మారింది. ఇది ఎంత పాపులర్ టాపిక్ అయిందంటే మూడు సంవత్సరాల వ్యవధిలో దీనిపై పదుల సంఖ్యలో పుస్తకాలు వచ్చాయి. ఆర్థికవేత్త రిచర్డ్‌బాల్డ్ విన్ తన పుస్తకం 'ది గ్లోబటిక్స్ అప్‌హీవల్'లో ఏఐ ద్వారా ఏయే రంగాలు ఎలాంటి ప్రభావానికి గురవుతాయో విశ్లేషించారు.

కొన్ని పుస్తకాలు మాత్రం 'భయం అక్కర్లేదు' అంటూ యువతను ఆశావహ మార్గం వైపు నడిపిస్తున్నాయి. యంత్రాలతో చెలిమి తప్పదు, తప్పు కాదు అంటున్నాయి.

సాంకేతిక శక్తి ప్రభావితం చేయని, అంటే ఉద్యోగాలకు ప్రమాదం లేని కొన్ని రంగాలు ఉండేవి. ఉదా: ఎకౌంటింగ్, న్యాయశాస్త్రం...మొదలైనవి. అయితే తాజాగా వెల్–ఎడ్యుకేటెడ్ ప్రొఫెషన్స్‌కు సంబంధించిన వారిలో కూడా ఆందోళన మొదలైంది. లా ప్రాక్టీస్‌లో ఏఐ చాట్‌బాట్ కూడా భాగం కానుంది.

కెరీర్ అభద్రతకు సంబంధించిన ఆలోచనల నేపథ్యంలో ఒక మార్కెటింగ్ ఏజెన్సీ ద్వారా 'ఏఐ యాంగ్జైటీ' అనే మాట ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇలాంటి పదాలు పుట్టడం కొత్త కాదు. సాంకేతిక పురోగతికి సంబంధించిన ప్రతి సందర్భంలో ఇలాంటి పదాలు ఎన్నో పుట్టాయి. 1980లలో 'కంప్యూటర్ ఫోబియా' 'కంప్యూటర్ యాంగ్జైటీ' 'టెక్నో స్ట్రెస్'లాంటివి పుట్టాయి.

ఏఐకి సంబంధించి రెండు వర్గాలు కనిపిస్తాయి. మొదటి వర్గానికి చెందిన వారిలో 'ఆటోమేషన్ ఆందోళన' కనిపిస్తుంది. రెండో వర్గం వారిలో ఆశాభావం కనిపిస్తుంది. మనుషులు, యంత్రాలతో చేయికలిపితే మెరుగైన ఫలితాలు వస్తాయనేది రెండో వర్గం నమ్మకం. టామ్ క్రూజ్ 'మైనార్టీ రిపోర్ట్'లాంటి సినిమాలలో, పర్సనల్ ఇంట్రెస్ట్‌లాంటి టీవీ షోలలో మనిషి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో జత కడితే జరిగే అద్భుతాలు కనిపిస్తాయి.

వివిధ రంగాలపై ఏఐ ఎలాంటి మార్పును తీసుకురానుంది? ఆ మార్పు మనపై ప్రతికూల ప్రభావం చూపకుండా ఎలా జాగ్రత్త పడాలి? ఏం నేర్చుకోవాలి?... ఈ విషయాలు చెప్పడానికి ఆన్‌లైన్ కోర్సులు వచ్చాయి. ఏఐ సాంకేతికత రీప్లేస్ చేయలేని ఇంటర్‌పర్సనల్ స్కిల్స్ లేదా ఎమోషనల్ ఇంటెలిజెన్స్ గురించి అవి నొక్కి చెబుతున్నాయి. డిజిటల్‌తో పాటు సాఫ్ట్‌స్కిల్స్‌ను కలగలిపి పాఠాలుగా చెబుతున్నాయి. ఈ కోర్సులపై యువత ఆసక్తి ప్రదర్శిస్తోంది.

'ఉద్యోగాలపై ఏఐ టెక్నాలజీ ప్రభావం గురించి ఫ్రెండ్‌కు నాకు మధ్య చర్చ జరిగింది. ఏటీఎం మెషీన్‌లు వచ్చిన కొత్తలో బ్యాంకింగ్ రంగంలో ఎంతోమంది ఉద్యోగాలు కోల్పోతారు, కొత్త ఉద్యోగాలు ఉండవు...ఇలా ఎన్నో మాటలు వినిపించేవి. కాని అది నిజం కాలేదు. ఉద్యోగుల పనితీరు మాత్రం మారింది. ఏఐ టెక్నాలజీ విషయంలోనూ జరిగేది ఇదే' అంటుంది ముంబైకి చెందిన అక్షర.

### ఏఐ... అయితే ఏంటీ!

యువతలో ఏఐ ఫోబియాను తొలగించడానికి 'ఫోర్బ్స్ కోచెస్ కౌన్సిల్' సభ్యులు కొన్ని సూచనలు చేశారు. వాటిలో కొన్ని...

- ఏఐ అంటే భయం కాదు, ఇష్టం పెంచుకోండి. ఏఐకు సంబంధించి ప్రతిదీ నేర్చుకోండి. నిపుణులతో మాట్లాడండి. ఉద్యోగ నైపుణ్యానికి ఏఐ ఎలా ఉపయోగపడగలదు అనే కోణంలో ఆలోచించండి.
- మనిషికి ఉండే సహజ నైపుణ్యాలను ఏఐ ఎప్పుడూ రీప్లేస్ చేయలేదు. మనిషికి ఉండే కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రేరణశక్తి, ఎత్తుగడలు, సమయస్ఫూర్తి...యంత్రం అనుకరించలేనివి.
- 'ఈ ఉద్యోగం మాత్రమే చేస్తాను. ఇది మాత్రమే చేయగలను' అని ఫిక్స్ కావద్దు. బీ ఫ్లెక్సిబుల్. ఏ ఉద్యోగమైనా చేసే నైపుణ్యాన్ని సొంతం చేసుకోండి. ఒకే దారిలో నడిచే వారికి ఆ దారి మాత్రమే తెలుస్తుంది. కొత్త దారుల్లో నడవడం నేర్చుకుంటే అది ఎప్పటికైనా ఉపయోగపడుతుంది.
- ఒత్తిడి దరి చేరని, సమస్యలను పరిష్కరించే, సానుకూలతను శక్తిగా మార్చుకునే, ఇతరులతో మంచి స్నేహసంబంధాలతో ఉండగలిగే ఎమోషనల్ ఇంటెలిజెన్స్‌ను మెరుగు పరుచుకోండి.
- ఏఐ ఎలాంటి పాత్ర అయినా పోషించగలదు...అని విశ్వసించే సందర్భంలో ఉన్నాం. ఇలాంటి సమయంలోనే ఏఐ కంటే భిన్నంగా, మెరుగ్గా పనిచేసే నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి.





## సింధు ర్యాంక్‌లో పురోగతి

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ర్యాంకింగ్స్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు రెండు స్థానాలు పురోగతి సాధించింది. తాజా ర్యాంకింగ్స్‌లో సింధు 17 నుంచి 15వ స్థానానికి చేరుకుంది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ 9వ ర్యాంక్‌లో, లక్ష్య సేన్ 11వ ర్యాంకుల్లో కొనసాగుతుండగా... శ్రీకాంత్ ఒక స్థానం పడిపోయి 20వ ర్యాంక్‌లో నిలిచాడు. గతవారం ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరిన ప్రియాన్షు రజావత్ మూడు స్థానాలు ఎగబాకి 28వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.



## బ్యాగు, కిట్ విమానంలో... మనిక బత్రా భారత్‌కు!

పెరూ టోర్నమెంట్‌లో ఆడిన భారత టేబుల్ టెన్నిస్ స్టార్ ప్లేయర్ మనిక బత్రా డచ్ విమానయాన సంస్థకు చెందిన కేఎల్ఎమ్ ఎయిర్‌లైన్స్‌లో భారత్‌కు చేరుకుంది. అయితే ఈ విమానంలో తన విలువైన బ్యాగేజ్‌ను మరిచిపోయిన మనిక ఇక్కడికి వచ్చాక సంబంధిత ఎయిర్‌లైన్స్ సంస్థను సంప్రదించినప్పటికీ ఆశించిన స్పందన కరువైంది. దీంతో ఆమె సాయం చేయాలని కోరుతూ పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు ట్వీట్ చేసింది.



# భారత్‌ను నిలువరిస్తేనే...

### పాకిస్తాన్‌కు సెమీఫైనల్ బెర్త్

- చిరకాల ప్రత్యర్థుల మధ్య నేడు చివరి లీగ్ మ్యాచ్
- రాత్రి గం. 8:30 నుంచి స్టార్ స్పోర్ట్స్ ఫస్ట్‌లో ప్రత్యక్ష ప్రసారం

చెన్నై: సాధారణంగా దాయాదుల మధ్య హాకీ మ్యాచ్ జరిగినా... క్రికెట్ పోరు జరిగినా... అది ఆ టోర్నీకే ఆసక్తికరమైన సమరమవుతుంది. కానీ ఈసారి ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాక్‌లు బుధవారం తలపడుతున్నప్పటికీ మునుపటిలా ఇది మాత్రం భారత్ పక్షం నుంచి అవసరం, అంతటి ఆసక్తికరమని అనలేం! ఎందుకంటే ఇదివరకే భారత జట్టు అజేయంగా సెమీఫైనల్ చేరింది. పాక్‌తో మ్యాచ్ పూర్తిగా నామమాత్రమైంది. కానీ దాయాదికి మాత్రం ఇది చావోరేవోలాంటి పోరు. ఓడితే మాత్రం సెమీస్ దారులు మూసుకుపోతాయి. కనీసం 'డ్రా'తో గట్టెక్కితేనే అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో భారత ఆటగాళ్లు స్వేచ్ఛగా ఆడుతూ పాడుతూ ప్రత్యర్థిపై ఆధిపత్యం కనబరిచే అవకాశముంది. మరోవైపు ముందుకెళ్లడమో, ఇక్కడే ముగించుకోవడమో తేల్చుకోవాల్సిన మ్యాచ్ కాబట్టి పాకిస్తాన్‌పై తీవ్రమైన ఒత్తిడి ఉంది. భారత్ ఫామ్, ఈ టోర్నీలో కనబరిచిన దూకుడు, ఆధిపత్యం దృష్ట్యా పాక్ గెలవాలంటే సర్వశక్తులు ఒడ్డినా సరిపోదేమో! అసాధారణ ఆటతో పాటు అదృష్టం కూడా కలిసొస్తేనే పాక్ గెలిచేందుకు సాధ్యమవుతుంది. లేదంటే ఎదురేలేని భారత్‌ను ఎదురించడం అంత సులభం కానేకాదు. 2016 దక్షిణాసియా క్రీడల ఫైనల్లో చివరిసారి భారత్‌పై పాకిస్తాన్ గెలిచింది. భారత్–పాక్ మ్యాచ్ కంటే ముందు చైనాతో జపాన్; దక్షిణ కొరియాతో మలేసియా తలపడతాయి. మలేసియా కూడా సెమీఫైనల్ చేరడంతో మిగతా రెండు బెర్త్‌ల కోసం కొరియా, పాకిస్తాన్, జపాన్ రేసులో ఉన్నాయి.

### ఆసియా క్రీడల్లో ఒకే గ్రూప్‌లో...

హాంగ్జౌలో జరగనున్న ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల్లో హాకీ ఈవెంట్‌లో భారత్, పాకిస్తాన్‌లు ఒకే గ్రూపులో తలపడనున్నాయి. గ్రూప్ 'ఎ'లో దాయాదులతో పాటు జపాన్, బంగ్లాదేశ్, సింగపూర్, ఉజ్బెకిస్తాన్‌లు ఉన్నాయి. సెప్టెంబర్ 24న జరిగే తొలి మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌తో భారత్ తలపడుతుంది. ఆసియా క్రీడల ఈవెంట్‌కే హైలైట్ కాబోయే ఇండో–పాక్ పోరు సెప్టెంబర్ 30న జరుగుతుంది. టైటిల్ పోరు అక్టోబర్ 6న నిర్వహిస్తారు. మహిళల విభాగంలోనూ భారత్ 'ఎ' గ్రూపులో ఉంది. ఇందులో హాంకాంగ్, సింగపూర్, కొరియా, మలేసియా ఇతర జట్లు కాగా... అమ్మాయిల బృందం 27న తమ తొలి పోరులో సింగపూర్‌తో ఆడుతుంది.

## భారత్ అత్యుత్తమ ప్రదర్శన

చెంగ్డూ (చైనా): ప్రపంచ విశ్వ విద్యాలయాల క్రీడల్లో భారత బృందం తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. మంగళవారం ముగిసిన ఈ క్రీడల్లో భారత్ 11 స్వర్ణాలు, 5 రజతాలు, 10 కాంస్యాలతో కలిపి మొత్తం 26 పతకాలు సాధించి ఏడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాదికంటే ముందు జరిగిన విశ్వ విద్యాలయాల క్రీడల్లో భారత బృందం ఓవరాల్‌గా 21 పతకాలు (6 స్వర్ణాలు, 6 రజతాలు, 9 కాంస్యాలు) సాధించింది. ఈసారి మాత్రం భారత్ విశేషంగా రాణించింది.

# సూర్య అదరగొట్టగా...

భారత టి20 బృందం ఎట్టకేలకు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చింది. ముందుగా చక్కటి బౌలింగ్‌తో వెస్టిండీస్‌ను కట్టడి చేసిన టీమ్ ఆ తర్వాత సునాయాసంగా లక్ష్యాన్ని అందుకుంది. హిట్టర్ సూర్యకుమార్ యాదవ్ తనదైన శైలిలో మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగి విజయానికి బాటలు వేయగా, తిలక్ వర్మ మరో చక్కటి ఇన్నింగ్స్‌తో అండగా నిలిచాడు. సిరీస్‌లో ప్రత్యర్థి ఆధిక్యాన్ని టీమిండియా 2–1కి తగ్గించగా, ఇప్పుడు తర్వాతి రెండు మ్యాచ్‌లలో ఆధిపత్యం కోసం ఇరు జట్లు అమెరికా వేదికగా తలపడతాయి.

- మూడో టి20లో భారత్ ఘనవిజయం
- 7 వికెట్లతో విండీస్ చిత్తు
- రాణించిన తిలక్ వర్మ
- శనివారం నాలుగో టి20


సూర్యకుమార్

### 100

అంతర్జాతీయ టి20ల్లో సూర్యకుమార్ 100 సిక్సర్లు పూర్తి చేసుకున్నాడు. 1007 బంతుల్లోనే అతను 100 సిక్స్‌లు కొట్టడం విశేషం. అత్యధిక సిక్సర్ల జాబితాలో భారత్ తరఫున రోహిత్ (182), కోహ్లి (117) మాత్రమే అతనికంటే ముందున్నారు.


తిలక్‌వర్మ

ప్రావిడెన్స్ (గయానా): వరుసగా రెండు పరాజయాల తర్వాత భారత్ కోలుకొని కీలక విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం విండీస్‌తో జరిగిన మూడో టి20లో భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. బ్రెండన్ కింగ్ (42 బంతుల్లో 42; 5 ఫోర్లు, 1 సిక్స్), రావ్‌మన్ పావెల్ (19 బంతుల్లో 40 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడగా, కుల్దీప్ యాదవ్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 17.5 ఓవర్లలో 3 వికెట్లకు 164 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (44 బంతుల్లో 83; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) సత్తా చాటగా, హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ (37 బంతుల్లో 49 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఆకట్టుకున్నాడు. సూర్య, తిలక్ మూడో వికెట్‌కు 51 బంతుల్లోనే 87 పరుగులు జోడించారు. ఇరు జట్ల మధ్య నాలుగో టి20 శనివారం అమెరికాలోని లాడర్‌హిల్‌లో జరుగుతుంది.


కుల్దీప్ యాదవ్

**పావెల్ మెరుపులు...**

విండీస్‌కు ఓపెనర్లు కింగ్, కైల్ మేయర్స్ (20 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభం అందించారు. వీరిద్దరు 42 బంతుల్లో 50 పరుగులు జత చేశారు. అయితే అక్షర్ ఈ జోడీని విడదీయగా, చార్లెస్ (12) ఎక్కువసేపు నిలవలేదు. పూరన్ (12 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్) క్రీజ్‌లో ఉన్నంతసేపు ధాటిగా ఆడినా కుల్దీప్ చక్కటి బంతికి అతను స్టంపౌట్ అయ్యాడు. అదే ఓవర్లో కింగ్‌ను కూడా కుల్దీప్ పెవిలియన్ పంపడంతో విండీస్ పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. హెట్‌మైర్ (9) కూడా విఫలమైనా... పావెల్ దూకుడుతో చివరి 4 ఓవర్లలో ఆ జట్టు 46 పరుగులు జోడించగలిగింది. అర్ష్‌దీప్ ఓవర్లో 2 సిక్స్‌లు బాదిన పావెల్ ముకేశ్ వేసిన చివరి ఓవర్లోనూ మరో సిక్స్ కొట్టాడు.

**సూర్య ధనాధన్...**


తొలి అంతర్జాతీయ టి20లో యశస్వి జైస్వాల్ (1) ప్రభావం చూపలేకపోగా గిల్ (6) పేలవ ఫామ్ కొనసాగింది. అయితే తొలి రెండు బంతులను 4, 6గా మలచి సూర్య ధాటిగా మొదలు పెట్టగా, తిలక్ కూడా తొలి 5 బంతుల్లోనే 3 ఫోర్లు కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 60 పరుగులకు చేరింది. షెఫర్డ్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లతో 23 బంతుల్లోనే సూర్య అర్ధ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాతా సూర్య దూకుడు కొనసాగగా... తిలక్ అండగా నిలిచాడు. సెంచరీ దిశగా దూసుకుపోతున్న దశలో మరో భారీ షాట్‌కు ప్రయత్నించి సూర్య వెనుదిరిగాడు. అయితే తిలక్, హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 20 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) అభేద్యంగా 31 బంతుల్లో 43 పరుగులు జత చేసి మ్యాచ్‌ను ముగించారు. ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ టి20ల్లో అరంగేట్రం చేసిన యశస్వి జైస్వాల్ భారత్ తరఫున ఈ అవకాశం దక్కించుకున్న 105వ ఆటగాడిగా నిలిచాడు.

### స్కోరు వివరాలు

**వెస్టిండీస్ ఇన్నింగ్స్:** కింగ్ (సి అండ్ బి) కుల్దీప్ 42; మేయర్స్ (సి) అర్ష్‌దీప్ (బి) అక్షర్ 25; చార్లెస్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 12; పూరన్ (స్టంప్డ్) సామ్సన్ (బి) కుల్దీప్ 20; పావెల్ (నాటౌట్) 40; హెట్‌మైర్ (సి) తిలక్ (బి) ముకేశ్ 9; షెఫర్డ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 159. వికెట్ల పతనం:** 1–55, 2–75, 3–105, 4–106, 5–123. **బౌలింగ్:** పాండ్యా 3–0–18–0, అర్ష్‌దీప్ 3–0–33–0, అక్షర్ 4–0–24–1, చహల్ 4–0–33–0, కుల్దీప్ 4–0–28–3, ముకేశ్ 2–0–19–1.

**భారత్ ఇన్నింగ్స్:** యశస్వి (సి) జోసెఫ్ (బి) మెకాయ్ 1; గిల్ (సి) చార్లెస్ (బి) జోసెఫ్ 6; సూర్యకుమార్ (సి) కింగ్ (బి) జోసెఫ్ 83; తిలక్ వర్మ (నాటౌట్) 49; పాండ్యా (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (17.5 ఓవర్లలో 3 వికెట్లకు) 164. వికెట్ల పతనం:** 1-6, 2-34, 3-121. **బౌలింగ్:** మెకాయ్ 2-0-32-1, హోసీన్ 4-0-31-0, జోసెఫ్ 4-0-25-2, ఛేజ్ 4-0-28-0, షెఫర్డ్ 3-0-36-0, పావెల్ 0.5-0-10-0.

# సినిమా


అమితాబ్ బచ్చన్


షారుక్ ఖాన్


షారుక్, ప్రియాంకా చోప్రా

'మా డాన్ షారుక్ ఖాన్... వేరే ఎవర్నీ ఊహించలేం' అంటూ మంగళవారం పలువురు షారుక్ ఖాన్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా పంచుకున్న అభిప్రాయాలు వైరల్ అవుతున్నాయి. 'డాన్, డాన్ 2' తర్వాత రానున్న 'డాన్ 3'లో షారుక్ నటించరన్న వార్త గుప్పుమనడంతో "షారుక్ ప్లేస్‌లో వేరే డాన్‌ని చూడలేం" అంటున్నారు ఫ్యాన్స్. మంగళవారం ఫర్హాన్ అక్తర్ చెప్పీ చెప్పనట్లు సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన పోస్ట్‌తో 'డాన్ 3' అంశం పై చర్చ ఊపందుకుంది. ఆ వివరాల్లోకి వెళదాం..

## నో షారుక్ ఖాన్.. నో డాన్!

- దర్శకుడు ఫర్హాన్‌పై షారుక్ ఫ్యాన్స్ ఆగ్రహం


ఫర్హాన్ అక్తర్

హిందీ తెరపై డాన్ అంటే అమితాబ్ బచ్చన్ గుర్తొస్తారు. ఆయన టైటిల్ రోల్‌లో రూపొందిన 'డాన్' (1978) సూపర్ డూపర్ హిట్టయింది. చంద్ర బారోత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి అయిన బడ్జెట్ దాదాపు రూ 70 లక్షలు. కానీ వసూళ్లు రూ. 7 కోట్లు. అంటే.. పదింతల లాభం. డాన్‌గా అమితాబ్ యాక్షన్‌కి ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇదే సినిమా తెలుగు రీమేక్ 'యుగంధర్' (1979)లో ఎన్టీఆర్, తమిళ రీమేక్ 'బిల్లా'లో రజనీకాంత్ నటించారు. దక్షిణాదిన కూడా ఈ డాన్ సూపర్ హిట్.

**ది చేజ్ బిగిన్స్ ఎగైన్**

అమితాబ్ బచ్చన్ డాన్ క్యారెక్టర్ అద్భుతంగా చేయడంతో ఇక డాన్ క్యారెక్టర్ అంటే ఆయనే అని ఫిక్స్ అయ్యారు బాలీవుడ్ ప్రేక్షకులు. అలాంటి తరుణంలో 'నేను ఉన్నాను' అంటూ దాదాపు మూడు దశాబ్దాల తర్వాత షారుక్ ఖాన్ డాన్‌గా తెరపైకి వచ్చారు. షారుక్ డాన్ రోల్‌లో ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్' (2006) రూపొందింది. అమితాబ్ 'డాన్'కి రీ బూట్ వెర్షన్‌లా ఫర్హాన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 30 ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కాబట్టి ట్రెండ్‌ని దృష్టిలో పెట్టుకుని కథ తయారు చేయించారు. ఇక అమితాబ్ తర్వాతి తరంలో డాన్ అంటే షారుక్ అనేలా కింగ్ ఖాన్ అద్భుతంగా నటించారు. షారుక్ సరసన ప్రియాంకా చోప్రా నటించారు. సుమారు రూ. 40 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన 'డాన్' దాదాపు రూ. 105 కోట్ల వసూళ్లు రాబట్టి, సంచలన విజయం సాధించింది.

**ది కింగ్ ఈజ్ బ్యాక్**

సిల్వర్ స్క్రీన్‌పై ఒక పాత్ర హిట్టయితే ఆ క్యారెక్టర్‌ని మళ్లీ మళ్లీ చూడాలనుకుంటారు ప్రేక్షకులు. అమితాబ్ 'డాన్' తర్వాత మళ్లీ డాన్ క్యారెక్టర్‌ని చూడాలనుకున్నారు. షారుక్ 'డాన్'గా వచ్చి, అలరించారు. ఈ హిట్ డాన్‌ని అలా వదిలేస్తే ఎలా? మళ్లీ ఈ పాత్ర చేయాలని షారుక్ అనుకున్నారు. డాన్ కోసం కథలు తయారు చేయించాలని ఫర్హాన్ కూడా ఫిక్స్ అయ్యారు. అలా 'డాన్: ది కింగ్ ఈజ్ బ్యాక్' అంటూ సెకండ్ వెర్షన్ ఆరంభించారు. 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్' విడుదలైన ఐదేళ్లకు 'డాన్ 2' (2011)ని వెండితెరపైకి వదిలారు. ఇందులోనూ షారుక్ సరసన ప్రియాంకా చోప్రా నటించారు. 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్'కి రెండింతల బడ్జెట్.. అంటే దాదాపు రూ. 80 కోట్లతో రూపొందించారు. సుమారు రూ. 200 కోట్ల వసూళ్లతో రీబూట్ వెర్షన్‌లో వచ్చిన ఈ రెండో 'డాన్' కూడా ఘనవిజయం సాధించింది. ఫస్ట్ వెర్షన్‌కి ఫర్హాన్ దర్శకత్వం వహించి, ఓ నిర్మాతగా వ్యవహరించారు. రెండో వెర్షన్‌కి కూడా ఫర్హాన్ ఈ రెండు బాధ్యతలు చేపట్టగా, షారుక్ నటించడంతో పాటు ఓ నిర్మాతగా వ్యవహరించారు.

**'డాన్ 3'లో రణ్‌వీర్ సింగ్?**


ప్రేక్షకులు, షారుక్ అభిమానులు డాన్ క్యారెక్టర్‌ని మరచిపోలేదు. షారుక్ కూడా డాన్ పాత్రతో అనుబంధం పెంచుకున్నారు. ఫర్హాన్‌కి కూడా ఆ పాత్ర అంటే మక్కువ. అందుకే 2011లో 'డాన్ 2'ని రిలీజ్ చేసినప్పట్నుంచి ఇప్పటి వరకూ 'డాన్ 3' గురించి ఏదో సందర్భంలో ఇద్దరూ మాట్లాడుతూ వచ్చారు. 'డాన్ 3' కచ్చితంగా ఉంటుందని ఫర్హాన్ చెప్పుకుంటూ వచ్చారు. త్వరలో మూడో వెర్షన్‌కి శ్రీకారం జరిగే అవకాశం ఉందని మంగళవారం ఫర్హాన్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన వీడియో స్పష్టం చేస్తోంది. ఆ వీడియోలో '3' అంకె కనిపించడంతో పాటు బ్యాక్‌గ్రౌండ్‌లో 'డాన్' థీమ్ మ్యూజిక్ వినబడుతోంది. అలాగే కొత్త శకం ఆరంభం కాబోతోంది అని ఉంది. సో... 'డాన్ 3' రానుందని చాలామంది ఫిక్స్ అయ్యారు. అయితే ఫర్హాన్ నటీనటులను ప్రకటించలేదు. దాంతో ఒకవేళ షారుక్ ఖాన్ అని ఫిక్స్ అయ్యుంటే.. ప్రకటించి ఉండేవారు కదా అనే చర్చ మొదలైంది. అలాగే కొత్త డాన్‌గా రణ్‌వీర్ సింగ్ నటిస్తారనే వార్త ఎప్పట్నుంచో ప్రచారంలో ఉంది. సో.. థర్డ్ వెర్షన్‌లో నటించబోయేది రణ్‌వీరే అని షారుక్ ఫ్యాన్స్ ఫిక్స్ అయ్యారు. పైగా 'కొత్త శకం ఆరంభం కాబోతోంది' అన్నారు కాబట్టి హీరోని మార్చే ఆలోచనలో ఫర్హాన్ ఉన్నారని ఫ్యాన్స్ ఊహిస్తున్నారు. కొందరు ఫ్యాన్స్ ఫర్హాన్ మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేస్తే షారుక్ చేయాలి.. లేదా ఈ సిరీస్‌కి ఫుల్‌స్టాప్ పడాలన్నట్లుగా స్పందిస్తున్నారు. మరోవైపు రణ్‌వీర్ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

*మరి.. షారుక్ మళ్లీ డాన్‌గా కనిపిస్తారా లేక రణ్‌వీర్ తెర మీదకు వస్తారా? ఒకవేళ రణ్‌వీర్ వస్తే.. అప్పట్లో అమితాబ్‌కి దీటుగా నటించి, డాన్‌గా భేష్ అని షారుక్ అనిపించుకున్నట్లే రణ్‌వీర్ కూడా ప్రేక్షకుల మెప్పు పొందగలుగుతారా? వేచి చూడాల్సిందే.*


రణ్‌వీర్ సింగ్

## ప్రతీకారంతో...

పుష్పరాజ్‌పై ప్రతీకారం తీర్చుకోవడానికి రెడీ అవుతున్నాడు బన్వర్‌సింగ్ షెకావత్. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'పుష్ప'. ఈ సినిమాలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్, పోలీసాఫీసర్ భన్వర్‌సింగ్ షెకావత్ పాత్రలో ఫాహద్ ఫాజిల్ నటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 'పుష్ప' చిత్రంలోని మలి భాగం 'పుష్ప: ది రూల్' సెట్స్‌పై ఉంది. ఇందులో కూడా అల్లు అర్జున్, ఫాహద్ ఫాజిల్ నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు ఫాహద్ ఫాజిల్. కాగా ఆగస్టు 8 (మంగళవారం) ఫాహద్ ఫాజిల్ బర్త్ డే. ఈ సందర్భంగా 'పుష్ప: ది రూల్' సినిమాలోని ఫాహద్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'ప్రతీకారంతో భన్వర్‌సింగ్ షెకావత్ సార్ బిగ్ స్క్రీన్స్‌పై వచ్చేందుకు రెడీ అవుతున్నారు' అనే క్యాప్షన్‌తో చిత్ర యూనిట్ ఫాహద్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఇక ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల 10న హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని, హీరో అల్లు అర్జున్, హీరోయిన్ రష్మికా మందన్నా షూటింగ్‌లో పాల్గొంటారని తెలిసింది. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ పతాకాలపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2024లో విడుదల కానుంది.


ఫాహద్ ఫాజిల్

## ఇక అంతా బోనస్!

**- దర్శకుడు మెహర్ రమేష్**



**"షాడో" సినిమా తర్వాత దర్శకుడిగా నాకు కొంత గ్యాప్ వచ్చింది. ఆ గ్యాప్‌లో నేను కొన్ని కథలు రెడీ చేసుకున్నాను. ఇక అన్నయ్య (చిరంజీవి) సినిమాల్లోకి కమ్‌బ్యాక్ ఇచ్చాక నా కమ్‌బ్యాక్ సినిమా ఆయనతో చేయాలనుకున్నాను. అందుకే షాడోలో వున్న నాపై మెగా లైట్ పడిందని 'భోళా శంకర్' ప్రీ రిలీజ్‌లో చెప్పాను" అన్నారు దర్శకుడు మెహర్ రమేష్. చిరంజీవి టైటిల్ రోల్ చేసిన తాజా చిత్రం 'భోళా శంకర్'. చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తి సురేష్ నటించారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో దర్శకుడు మెహర్ రమేష్ చెప్పిన విశేషాలు.**

- 'భోళా శంకర్' సినిమాకు దర్శకుడిగా చేసి, అన్నయ్య ప్రశంసలు అందుకోవడాన్ని పెద్ద అచీవ్‌మెంట్‌లా భావిస్తున్నాను. ఇక దర్శకుడిగా నాకు లభించేది అంతా బోనస్‌గా ఫీలవుతాను. అన్నయ్య, నేను కజిన్స్. సో.. సెట్స్‌లో ఆయన నన్ను ఏరా అని చనువుగా పిలిచేవారు.
- తరాలు మారినా అనుబంధాలు మారలేదు. 'వేదాళం' సినిమాలో అన్నాచెల్లెళ్ల అనుబంధం నాకు బాగా నచ్చింది. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషనల్ సీన్స్ ఉన్న ఈ తరహా సబ్జెక్ట్‌ని నేనిప్పటివరకూ డీల్ చేయలేదు. తమిళ 'వేదాళం' సినిమా తెలుగు రీమేక్‌గా 'భోళా శంకర్' చేశాం. గతంలో నా దర్శకత్వంలో కొన్ని రీమేక్స్ వచ్చాయి. సాధారణంగా నేను రీమేక్ రిస్క్ అనుకోను. ఓ టాస్క్‌గా తీసుకుంటాను. వాటికి నా ట్రీట్‌మెంట్ వేరుగా ఉంటుంది. 'భోళా శంకర్'లో 60 నుంచి 70 శాతం మార్పులు చేశాం. పెద్ద సక్సెస్ అయిన సినిమాను కరెక్ట్‌గా తీయడంతో పాటు జనాలకు నచ్చేలా తీయాలి. 'భోళా శంకర్'ని ప్రేక్షకులకు నచ్చేలా ప్రజెంట్ చేశాం.
- ఈ చిత్రంలో చెల్లెలి పాత్రకు కీర్తి సురేష్‌గారు ఒప్పుకుంటారని అనుకోలేదు. స్వప్నా దత్ ద్వారా కీర్తిని అప్రోచ్ అయ్యాను. కథ విని ఆమె ఈ సినిమా ఒప్పుకున్నారు. 'వాల్తేరు వీరయ్య' సినిమాలో రవితేజ పాత్ర ఆ సినిమాకు బిగ్ ఎస్సెట్. అలా 'భోళా శంకర్'లో కీర్తి సురేష్ రోల్ సినిమాకు పెద్ద ఎస్సెట్. మణిశర్మగారి కుమారుడు మహతి స్వరసాగర్ ఈ సినిమాకు మంచి సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చాడు. ఇక అనిల్ సుంకరగారు ప్యాషనేట్ అండ్ పాజిటివ్ ప్రొడ్యూసర్. నా తర్వాతి చిత్రాన్ని త్వరలో ప్రకటిస్తాను.

## పల్లెటూరి జంక్షన్


ఈశ్వర్, సి. కల్యాణ్

ఈశ్వర్, నైనా సర్వర్ జంటగా నటించిన విలేజ్ డ్రామా 'సూర్యాపేట జంక్షన్'. నాదెండ్ల రాజేష్ దర్శకత్వంలో అనిల్ కుమార్ కత్ర గోడ, ఎస్. శ్రీనివాసరావు నిర్మించారు. ఈ చిత్రంలోని 'చెంగు చెంగుమంటూ జింక పిల్లలాగా..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను నిర్మాత సి. కల్యాణ్ రిలీజ్ చేశారు. రోషన్ సాలూరి స్వరకల్పనలో ఎస్. సాయి చరణ్, సోరస్ పాడిన ఈ పాటకు రెహమాన్ లిరిక్స్ అందించారు. ''వ్యవస్థను సరిదిద్దే బాధ్యత యువతపై ఉంటుంది. కొత్త తరం ఓటర్లు చూడాల్సిన చిత్రమిది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు హరి గౌర మరో స్వరకర్త.

## డిఫరెంట్ థ్రిల్లర్

సాహస్ పగడాల హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ధీమహి'. నవీన్ కంటి మరో దర్శకుడిగా, విరాట్ కపూర్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో నిఖితా చోప్రా హీరోయిన్. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలో సినిమా రిలీజ్ కానున్న సందర్భంగా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ''ధీమహి డిఫరెంట్ థ్రిల్లర్ మూవీ. త్వరలో ట్రైలర్ రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.


సాహస్, నిఖితా

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 107 | 65,846 |
| నిఫ్టీ ▽ | 26 | 19,571 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 13,836 | ▽ | 159 |
| డోజోన్స్ | 35,226 | ▽ | 246 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,527 | ▽ | 27 |
| డాక్స్ | 15,775 | ▽ | 176 |
| షాంఘై | 3,261 | ▽ | 8 |
| నికాయ్ | 32,377 | △ | 123 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో — ముంబై

| | | | |
|---|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 59,338 | △ | 11 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 59,100 | △ | 11 |
| వెండి (కిలో) | 71,051 | ▽ | 797 |

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

# ఆర్‌బీఐ కీలక పాలసీ భేటీ ప్రారంభం

**యథాతథ అంచనాలకే మెజారిటీ ఓటు**



ముంబై: గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల అత్యున్నత స్థాయి ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఆర్‌బీఐ–ఎంపీసీ) సమావేశం మంగళవారం ప్రారంభమైంది. 3 రోజుల ఈ సమావేశ నిర్ణయాలు గురువారం (ఆగస్టు 10వ తేదీ) వెలువడతాయి. ద్రవ్యోల్బణంపై అనిశ్చితి పరిస్థితి నేపథ్యంలో యథాతథ రెపో రేటు (ప్రస్తుతం 6.5 శాతం) నిర్ణయానికి కమిటీ మెజారిటీ మొగ్గు చూపవచ్చన్నది నిపుణుల అభిప్రాయం. ఇదే జరిగితే రేటు యథాతథ స్థితి కొనసాగింపు ఇది వరుసగా మూడవసారి (ఏప్రిల్, జూన్ తర్వాత) అవుతుంది. ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో గత ఏడాది మే నుంచి రెపో రేటు 2.5 శాతం పెరిగిన సంగతి తెలిసిందే. దీనితో ఈ రేటు 6.5 శాతానికి (ఫిబ్రవరికి) చేరింది. అటు తర్వాత రేటు మార్పు నిర్ణయం తీసుకోలేదు.



ముంబైలో జరిగిన 18వ రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డ్స్ కార్యక్రమంలో ప్రముఖ నటి సాన్యా మల్హోత్రా చేతుల మీదుగా 'టీవీ క్యాంపెయిన్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ 2023' అవార్డును స్వీకరిస్తున్న జోయాలుక్కాస్ ఎండీ జాన్ పాల్ అలూక్కాస్.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

| 9-8-2023 | |
|---|---|
| విశాఖ | 450–00 |
| చిత్తూరు | 483–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 440–00 |
| విజయవాడ | 440–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **8-8-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 400–00 |
| వరంగల్ | 402–00 |
| రిటైల్ ధర | 4.60 |

# మారుతీలో ప్రమోటర్ల వాటా ప్లస్!

- సుజుకీ కార్పొరేషన్‌కు షేర్ల జారీకి బోర్డు ఓకే
- 56.4% నుంచి 58.28 శాతానికి అప్
- సుజుకీ గుజరాత్ ప్లాంటు మారుతీ చేతికి




న్యూఢిల్లీ: ప్రిఫరెన్షియల్ పద్ధతిలో షేర్ల జారీకి బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా(ఎంఎస్ఐ) తాజాగా వెల్లడించింది. మాతృ సంస్థ సుజుకీ మోటార్ కార్పొరేషన్(ఎస్ఎంసీ)కు ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన మారుతీ షేర్లను జారీ చేయనుంది. సుజుకీ మోటార్ గుజరాత్(ఎస్ఎంజీ) తయారీ ప్లాంటులో 100 శాతం వాటా కొనుగోలుకిగాను ఎస్ఎంసీకి షేర్లను కేటాయించనుంది. తద్వారా మారుతీ సుజుకీ ఇండియాలో ఎస్ఎంసీ వాటా 56.4 శాతం నుంచి 58.28 శాతానికి బలపడనుంది. మరోవైపు మారుతీకి పూర్తి అనుబంధ సంస్థగా ఎస్ఎంజీ ఆవిర్భవించనుంది. అయితే ఇందుకు విలువ నిర్ధారణ ఆధారంగా జారీ చేయనున్న షేర్ల సంఖ్యను తదుపరి బోర్డు సమావేశంలో నిర్ణయించనున్నట్లు మారుతీ తెలియజేసింది. మంగళవారం సమావేశమైన కంపెనీ బోర్డు ఎస్ఎంజీలో సుజుకీ కార్పొరేషన్ ఈక్విటీ కొనుగోలుకి రెండు ఆప్షన్ల(నగదు చెల్లింపు, షేర్ల జారీ)ను పరిశీలించింది. చివరికి అటు కంపెనీ, ఇటు మైనారిటీ వాటాదారులకు లబ్ధి చేకూర్చగల షేర్ల జారీకి ఓటు వేసినట్లు మారుతీ వివరించింది.

**ఒకే గొడుగుకిందకు**

కంపెనీ భవిష్యత్ వృద్ధి అవకాశాలరీత్యా ఒకే గొడుగుకిందకు తయారీ కార్యకలాపాలను తీసుకువచ్చే ప్రధాన లక్ష్యంతోనే బోర్డు తాజా నిర్ణయాన్ని తీసుకున్నట్లు విలేకరుల వర్చువల్ సమావేశంలో మారుతీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ పేర్కొన్నారు. 2030–31కల్లా కంపెనీ మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 40 లక్షల యూనిట్లకు చేరనున్న నేపథ్యంలో దీనికి ప్రాధాన్యత ఏర్పడినట్లు తెలియజేశారు. ఎస్ఎంజీలో 2014 నుంచి ఎస్ఎంసీ రూ. 18,000 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు ప్రస్తావించారు.

# పెప్పర్‌ఫ్రై సీఈవో మూర్తి ఆకస్మిక మరణం



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఫర్నిచర్ సంస్థ పెప్పర్‌ఫ్రై సహ వ్యవస్థాపకుడు, సీఈవో అంబరీష్ మూర్తి (51) ఆకస్మికంగా కన్నుమూశారు. లేహ్ పర్యటనలో ఉన్న ఆయన గుండెపోటుతో మరణించినట్లు మరో సహ వ్యవస్థాపకుడు ఆశీష్ షా సోషల్ మీడియా సైట్ ఎక్స్‌లో (గతంలో ట్విట్టర్) పోస్ట్ చేశారు. బైక్ రైడ్ అంటే ఎంతగానో ఇష్టపడే మూర్తి.. తరచుగా మోటార్‌సైకిల్‌పై ముంబై నుంచి లేహ్‌కు వెళ్లేవారు. తాజాగా కూడా లడఖ్ ట్రిప్‌కి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. మూర్తి మృతిపై స్పాటిఫై ఇండియా ఎండీ అమర్‌జిత్ బాత్రా, డ్రూమ్ వ్యవస్థాపకుడు సందీప్ అగర్వాల్, క్యాష్‌కరో కో–ఫౌండర్ స్వాతి భార్గవ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. 1994లో ఢిల్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఇంజినీరింగ్ చదివిన మూర్తి ఐఐఎం కోల్‌కతాలో ఎంబీఏ చేశారు. ఆ తర్వాత క్యాడ్‌బరీస్, ఐసీఐసీఐ ఏఎంసీ (ప్రస్తుతం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్), లివైస్, ఈబే ఇండియా తదితర సంస్థల్లో పని చేశారు. 2011లో ఆశీష్ షాతో కలిసి పెప్పర్‌ఫ్రైని ప్రారంభించారు.

# బిర్లా స్వతంత్ర చేతికి చైతన్య మైక్రోఫైనాన్స్

**డీల్ విలువ రూ. 1,479 కోట్లు**

ముంబై: పారిశ్రామిక దిగ్గజం కుమారమంగళం బిర్లా కుమార్తె అనన్య బిర్లాకు చెందిన సూక్ష్మ రుణాల సంస్థ 'స్వతంత్ర' తాజాగా చైతన్య ఇండియా ఫిన్ క్రెడిట్‌ను కొనుగోలు చేయనుంది. ఇందుకోసం రూ. 1,479 కోట్లు వెచ్చించనుంది. ఫ్లిప్‌కార్ట్ సహ–వ్యవస్థాపకుడు సచిన్ బన్సల్‌కి చెందిన నవీ గ్రూప్‌లో చైతన్య ఇండియా భాగంగా ఉంది. చైతన్య కొనుగోలు ద్వారా 36 లక్షల మంది యాక్టివ్ కస్టమర్లు, 20 రాష్ట్రాల్లో 1,517 శాఖలు, రూ. 12,409 కోట్ల అసెట్స్ (ఏయూఎం)తో స్వతంత్ర దేశీయంగా రెండో అతి పెద్ద మైక్రోఫైనాన్స్ సంస్థగా ఆవిర్భవించనుంది. 2013లో అనన్య బిర్లా ప్రారంభించిన స్వతంత్రలో రూ. 7,499 కోట్ల ఏయూఎం, 7,000 మంది పైచిలుకు ఉద్యోగులు, 22 లక్షల గ్రామీణ కస్టమర్లు ఉన్నారు. చైతన్య ఇండియా ఫిన్ క్రెడిట్‌కు రూ. 4,900 కోట్ల ఏయూఎం, 6,000 మంది ఉద్యోగులు, 14 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు. చైతన్య ఇండియా, దాని మాతృ సంస్థ నవీ ఫిన్‌సర్వ్‌ను 2019లో బన్సల్ కేవలం రూ. 150 కోట్లకు కొనుగోలు చేశారు. గత నాలుగేళ్లలో చైతన్య ఆరు రెట్లు వృద్ధి చెందినట్లు బన్సల్ తెలిపారు. ఈ కొనుగోలుతో తమ సంస్థ విస్తృతి మరింత పెరగగలదని అనన్య బిర్లా తెలిపారు.

# ఇన్వెస్టర్ల అప్రమత్తత

- స్వల్ప నష్టాల ముగింపు
- ఎఫ్ఎంసీజీ, మెటల్ షేర్లలో అమ్మకాలు

ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన వైఖరి, అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడి(గురువారం)కి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఆసియా, యూరప్ మార్కెట్లలోని బలహీన సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస అమ్మక పరిణామాలు ఒత్తిడి పెంచాయి. ఫలితంగా రోజంతా పరిమిత శ్రేణిలో బలహీనంగా లాభ, నష్టాల మధ్య ట్రేడైన సూచీలు మంగళవారం స్వల్ప నష్టంతో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 96 పాయింట్ల లాభంతో 66,049 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 201 పాయింట్లు నష్టపోయి 65,753 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 107 పాయింట్లు నష్టపోయి 65,846 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 30 పాయింట్లు పెరిగి 19,627 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. రోజంతా 19,533 –19,634 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 26 పాయింట్లు పతనమై 19,571 వద్ద నిలిచింది. ఆటో, ఎఫ్ఎంసీజీ, మెటల్, ఇంధన, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే బ్యాంకులు, ఫార్మా, ఐటీ, మీడియా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్ స్మాల్ సూచీలు వరుసగా 0.25%, 0.15 శాతం చొప్పున స్వల్పంగా పెరిగాయి. చైనా ఎగుమతులు భారీగా క్షీణించడంతో పాటు ఫెడ్ వడ్డీరేట్లను ప్రభావితం చేసే అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడి ముందు అప్రమత్తత నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.



- క్యూ1లో ప్రభుత్వ రంగ బ్యాంకులు ఆకర్షణీయ పనితీరు చూపడంతో ఈ రంగ షేర్లకు డిమాండ్ పెరిగింది. ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, యూనియన్ బ్యాంక్, పీఎస్‌బీ షేర్లు వరుసగా 14%, 7%, 5%, 4% ర్యాలీ చేశాయి. సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పీఎస్‌బీ షేర్లు 3% లాభపడ్డాయి.
- హార్లే డేవిడ్సన్ భాగస్వామ్యంలో తీసుకొచ్చిన ఎక్స్440 బైక్ బుకింగ్‌కు అనూహ్య స్పందన లభించడంతో హీరో మోటోకార్ప్ షేరు 4% లాభపడి రూ.3068 వద్ద ముగిసింది.
- జూన్ క్వార్టర్ లాభం 40% క్షీణించడంతో హిందాల్కో ఇండస్ట్రీస్ షేరు ఎన్ఎస్ఈలో రెండుశాతానికి పైగా నష్టపోయి రూ.455 వద్ద ముగిసింది.
- తొలి త్రైమాసికంలో నికర లాభం 41% వృద్ధి చెందడంతో గ్లాండ్ ఫార్మా షేరు 20% లాభపడి రూ.1613 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది.

ఫార్మా రంగ కంపెనీ కంకార్డ్ బయోటెక్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు మంగళవారానికల్లా 25 రెట్లు అధిక స్పందనను సాధించింది. కంపెనీ 1,46,50,957 షేర్లు ఆఫర్ చేయగా.. 36,42,83,240 షేర్లకు దరఖాస్తులు వచ్చాయి.

# హైదరాబాద్ కేంద్రంగా 'హ్యుందాయ్'

- భవిష్యత్ మోడళ్ల పరిశోధన ఇక్కడే
- రెండేళ్లలో కియా నుంచి చిన్న ఈవీ
- 2032 నాటికి అయిదు కొత్త ఈవీలు




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీలో ఉన్న దక్షిణ కొరియా గ్రూప్ హ్యుందాయ్ మోటార్ భారత్‌లో ఎలక్ట్రిక్ వెహికిల్స్ విభాగంలో నాయకత్వ స్థానం కోసం సిద్ధమవుతోంది. భవిష్యత్తులో పోటీతత్వ ఈవీ మార్కెట్‌గా భారత్ అవతరిస్తుందని కంపెనీ మంగళవారం తెలిపింది. 2032 నాటికి దేశీయంగా అయిదు కొత్త ఈవీలను ప్రవేశపెట్టాలని హ్యుందాయ్ నిర్ణయించింది. కొత్త ఈవీల పరిచయం, తయారీ సామర్థ్యాన్ని పెంచేందుకు వచ్చే 10 ఏళ్లలో రూ.20,000 కోట్లకుపైగా పెట్టుబడి చేయనున్నట్టు 2023 మే నెలలో సంస్థ ప్రకటించింది. ఈవీలు, అటానమస్ సహా భవిష్యత్ మోడళ్ల పరిశోధన కోసం హైదరాబాద్‌లోని రిసర్చ్, డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డీ) సెంటర్‌ను కేంద్ర బిందువుగా మార్చాలని గ్రూప్ యోచిస్తోంది. ఈ కేంద్రంలో భారతీయ భాషల్లో వాయిస్ రికగ్నిషన్ టెక్నాలజీని సైతం అభివృద్ధి చేస్తారు. భారత ప్యాసింజర్ కార్ల పరిశ్రమ 2030 నాటికి 50 లక్షల యూనిట్లను దాటుతుంది. వీటిలో ఎస్‌యూవీల వాటా 48 శాతం. ఆ సమయానికి ఎలక్ట్రిక్ వెహికిల్స్ 10 లక్షల యూనిట్ల మార్కును చేరుకుంటాయని హ్యుందాయ్ తెలిపింది. 2022–23లో భారత్‌లో అన్ని కంపెనీలవి కలిపి 48,104 యూనిట్ల ఎలక్ట్రిక్ కార్లు అమ్ముడయ్యాయి.

**భవిష్యత్ వ్యూహంపై..**

'భారత విపణిలో కంపెనీ కార్ల విక్రయాలు పెరిగేందుకు హైదరాబాద్ కేంద్రం కీలక పాత్ర పోషించనుంది. అలాగే కొరియాలోని హుందాయ్–కియా నమ్యాంగ్ ఆర్అండ్‌డీ సెంటర్‌తో కలిసి భారత మార్కెట్ కోసం వాహనాలను అభివృద్ధి చేస్తుంది. ఇందులో భాగంగా టెస్టింగ్ కోసం కొత్త సదుపాయం నిర్మాణం గత సంవత్సరం ప్రారంభమైంది' అని కంపెనీ తెలిపింది. హ్యుందాయ్ మోటార్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్ యూసన్ ఛంగ్ భారత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లోని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజనీరింగ్‌తోపాటు చెన్నైలోని తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భవిష్యత్ వ్యూహంపై కంపెనీకి చెందిన కీలక అధికారులతో చర్చించారు.

**భారీ లక్ష్యంతో..**

ఎస్‌యూవీలలో నాయకత్వ స్థానాన్ని బలోపేతం చేయడం, ఈవీ మోడళ్లను విస్తరించడం ద్వారా పరిమాణాత్మకంగా వృద్ధి చెందాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు హ్యుందాయ్ వెల్లడించింది. 'నాలుగేళ్లలో ఈవీ చార్జింగ్ సెంటర్ల సంఖ్యను 439కి చేర్చనున్నాం. గ్రూప్ కంపెనీ అయిన కియా 2025 నుండి భారత కోసం చిన్న ఈవీలను ఉత్పత్తి చేస్తుంది. ఇతర ఈవీ మోడళ్లతోపాటు వినియోగదార్లు కోరినట్టు కస్టమైజ్డ్ (పర్పస్ బిల్ట్ వెహికల్స్) అందిస్తుంది. కొత్త మోడళ్ల పరిచయం, ప్రస్తుతం ఉన్న 300 షోరూమ్‌లను రెండింతలు చేయాలన్నది కియా ప్రణాళిక. ప్రస్తుతం కియా మార్కెట్ వాటా 6.7% ఉంది. సమీప కాలంలో దీన్ని 10%కి చేర్చాలన్నది కియా 2.0 వ్యూహం' అని హ్యుందాయ్ తెలిపింది.

## భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# జాబ్ పాయింట్

### ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 100 టెక్నికల్ ఆఫీసర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
» **విభాగాలు:** మెకానికల్/ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
» **పని అనుభవం:** కనీసం ఒక ఏడాది పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.25,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **ఇంటర్వ్యూ వేదిక:** కార్పొరేట్ లెర్నింగ్–డెవలప్‌మెంట్ సెంటర్, నలందా కాంప్లెక్స్, టీఐఎఫ్ఆర్ రోడ్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఈసీఐఎల్ పోస్ట్, హైదరాబాద్–500062.
» **ఇంటర్వ్యూ తేది:** 10.08.2023, 11.08.2023.
» **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 10 గంటలు.
» **వెబ్‌సైట్:** www.ecil.co.in

### షార్ శ్రీహరికోటలో 56 పారా మెడికల్ పోస్టులు

తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్.. వివిధ కేటగిరీ/విభాగాల్లో పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 56
» **పోస్టుల వివరాలు:** క్యాటరింగ్ సూపర్‌వైజర్–01, నర్స్–బి–07, ఫార్మసిస్ట్ ఎ–02, రేడియోగ్రాఫర్ ఎ–04, ల్యాబ్ టెక్నీషియన్ ఎ–01, ల్యాబ్ టెక్నీషియన్ ఎ(డెంటల్ హైజీనిస్ట్)–01, అసిస్టెంట్(రాజ్‌భాష)–01, కుక్–04, లైట్ వెహికల్ డ్రైవర్ ఎ–13, హెవీ వెహికల డ్రైవర్ ఎ–14, ఫైర్‌మ్యాన్ ఎ–08.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. డిగ్రీ, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
» **వయసు:** 24.08.2023 నాటికి అసిస్టెంట్ పోస్టులకు 28 నుంచి 28 ఏళ్లు, ఫైర్‌మ్యాన్ పోస్టులకు 18 నుంచి 25 ఏళ్లు, ఇతర పోస్టులకు 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, హైదరాబాద్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 24.08.2023.
» **ఫీజు చెల్లింపునకు చివరితేది:** 25.08.2023.
» **వెబ్‌సైట్:** https://www.shar.gov.in

### ఇండియన్ నేవీలో 35 ఎస్ఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఇండియన్ నేవీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్)లో షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. ఎగ్జిక్యూటివ్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. కేరళ రాష్ట్రం ఎజిమలలోని ఇండియన్ నావల్ అకాడమీ(ఐఎన్ఏ)లో జనవరి 2024 నుంచి స్పెషల్ నేవల్ ఓరియంటేషన్ కోర్సు ప్రారంభం కానుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 35
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్,ఎంఎస్సీ,ఎంసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 02.01.1999 నుంచి 01.07.2004 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.08.2023.
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

### ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో 172 సీబీసీ అండ్ ఎస్క్యూ మానిటర్ పోస్టులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్).. కాంట్రాక్టు ప్రాతిపదికన సీబీసీ అండ్ ఎస్క్యూ మానిటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 172
» **పోస్టుల వివరాలు:** సీనియర్ కెపాసిటీ బిల్డింగ్ కన్సల్టెంట్ అండ్ స్టేట్ క్వాలిటీ మానిటర్–24, కెపాసిటీ బిల్డింగ్ కన్సల్టెంట్ అండ్ స్టేట్ క్వాలిటీ మానిటర్–148.
» **అర్హత:** ఏదైనా విభాగంలో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 17.08.2023 నాటికి 62 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు సీనియర్ కెపాసిటీ బిల్డింగ్ కన్సల్టెంట్ అండ్ స్టేట్ క్వాలిటీ మానిటర్‌కు రూ.75,000, కెపాసిటీ బిల్డింగ్ కన్సల్టెంట్ అండ్ స్టేట్ క్వాలిటీ మానిటర్‌కు రూ.60,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.08.2023.
» **వెబ్‌సైట్:** http://career.nirdpr.in

# నాణ్యమైన విద్యకు.. నవోదయం

» 2024 ప్రవేశ ప్రక్రియ ప్రారంభించిన జేఎన్‌వీలు
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఆరో తరగతిలో ప్రవేశం
» జాతీయ స్థాయిలో.. మొత్తం 649 జేఎన్‌వీలు
» లెర్నింగ్ బై డూయింగ్ విధానంలో బోధన

**జవహర్ నవోదయ విద్యాలయాలు.. సంక్షిప్తంగా జేఎన్‌వీలు. సృజనాత్మక పద్ధతుల్లో బోధన, ఆహ్లాదకర వాతావరణంలో లెర్నింగ్ బై డూయింగ్ విధానంలో నాణ్యమైన విద్యను అందిస్తున్న పాఠశాలలు. స్కూల్ స్థాయిలోనే విద్యార్థుల్లో వాస్తవ దృక్పథం పెంపొందిస్తూ.. ఉన్నతంగా రాణించేలా దోహదపడుతున్నాయి ఈ విద్యాలయాలు!! ఇలా ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న జేఎన్‌వీల్లో.. 2024 విద్యా సంవత్సరంలో.. ఆరో తరగతిలో ప్రవేశాలకు ప్రకటన విడుదలైంది. ఈ నేపథ్యంలో.. జేఎన్‌వీల ప్రత్యేకత, ప్రవేశ ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..**




విద్యార్థి జీవితంలో పాఠశాల విద్య ఎంతో కీలకమైంది. ఈ దశలో వినూత్న బోధన విధానాన్ని అమలు చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటైనవే.. జవహర్ నవోదయ విద్యాలయాలు. ఇందుకోసం కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా జవహర్ నవోదయ విద్యాలయ సమితి పేరిట ప్రత్యేక సంస్థను కూడా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ప్రధాన లక్ష్యంగా జేఎన్‌వీలు కృషి చేస్తున్నాయి.

**జాతీయ స్థాయిలో.. 649 జేఎన్‌వీలు**

- జవహర్ నవోదయ విద్యాలయ సమితి పర్యవేక్షణలో దేశ వ్యాప్తంగా 649 నవోదయ పాఠశాలలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 ఉన్నాయి. ఏపీలోని 15 పాఠశాలల్లో 2 పాఠశాలలను ఎస్సీ/ఎస్టీ జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో అదనంగా ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు.
- ప్రతి నవోదయలో ఆరో తరగతిలో గరిష్ఠంగా 80 సీట్లు, కనిష్ఠంగా 40 సీట్లు ఉంటాయి. 2022 వరకు వరకు గరిష్ఠ సీట్ల సంఖ్య ప్రతి పాఠశాలలో 60గా మాత్రమే ఉండేది. 2023 నుంచి 80కి పెరగడంతో మరింతమంది విద్యార్థులకు నవోదయ విద్య అవకాశం లభించనుంది.

**ఉచిత విద్య.. ఉన్నత బోధన**

జేఎన్‌వీల మరో ప్రత్యేకత.. ఉచితంగా విద్యను అందించడం. రెసిడెన్షియల్ విధానంలో ఉండే ఈ జేఎన్‌వీల్లో వసతి, భోజన సదుపాయం, యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు అన్నింటినీ ఉచితంగా అందిస్తారు. విద్యా వికాస్ నిధి పేరిట ఏర్పాటు చేసిన నిధికి నెలకు రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. ఈ చెల్లింపు నుంచి ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళా విద్యార్థులు, బీపీఎల్ వర్గాల(దారిద్ర్య రేఖ దిగువ ఉన్న) పిల్లలకు మినహాయింపునిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు మాత్రం నెలకు రూ. 1500 చెల్లించాల్సి ఉంటుంది.

**ఆరో తరగతి ప్రవేశాలు–అర్హతలు**

- విద్యార్థులు 2023–24లో అయిదో తరగతి చదువుతుండాలి.
- గ్రామీణ విద్యార్థుల కోటాకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు.. మూడు నుంచి అయిదో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ,ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల్లో చదువుతుండాలి.
- విద్యార్థులు దరఖాస్తులో పేర్కొన్న జేఎన్‌వీ నెలకొన్న జిల్లాలకు చెందిన వారై ఉండాలి. జిల్లాల పునర్విభజన జరిగితే.. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా సంబంధిత జిల్లాకు చెంది ఉండాలి.
- **వయసు:** మే 1, 2012– జూలై 31, 2014 మధ్యలో జన్మించి ఉండాలి.

**100 మార్కులకు ప్రవేశ పరీక్ష**

- ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఆరో తరగతిలో అడ్మిషన్స్ కల్పిస్తారు.
- దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జాతీయ స్థాయిలో.. జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ)ను నిర్వహిస్తారు. పరీక్ష మూడు విభాగాలుగా మొత్తం 100 మార్కులకు జరుగుతుంది.
- ఈ ప్రవేశ పరీక్షలో మెంటల్ ఎబిలిటీ టెస్ట్ 40 ప్రశ్నలు–50 మార్కులు, అర్థమెటిక్ టెస్ట్ 20 ప్రశ్నలు–25 మార్కులు, లాంగ్వేజ్ టెస్ట్ 20 ప్రశ్నలు–25 మార్కులు.. ఇలా మొత్తం 80 ప్రశ్నలు–100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతోనే ఉంటుంది.
- ఆయా రాష్ట్రాల మాతృభాషల్లోనూ పరీక్ష నిర్వహిస్తారు.
- విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న మాధ్యమాన్ని దరఖాస్తు సమయంలోనే పేర్కొనాలి.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, మరాఠీ, ఉర్దూ, కన్నడ భాషల్లో పరీక్ష రాసే అవకాశముంది. ఏపీ విద్యార్థులు అదనంగా ఒరియా మాధ్యమంలోనూ పరీక్షకు హాజరయ్యే వీలుంది.
- తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి కూడా పరీక్ష ఉంటుంది. తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లను మాత్రమే దీని ద్వారా భర్తీ చేస్తారు.

**పరీక్షలో మంచి మార్కులకు**

జేఎన్‌వీఎస్‌టీ పరీక్షలో మంచి మార్కులు పొందేందుకు విద్యార్థులు.. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు అకాడమీ పుస్తకాలు, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదవాలి. ప్రధానంగా నాలుగు, అయిదు తరగతుల మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ పుస్తకాలను అభ్యసనం చేయాలి.

**జిల్లా స్థాయిలో ఎంపిక**

ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అంటే.. విద్యార్థులను ఆయా రాష్ట్రాల్లోని జిల్లాలో నెలకొన్న జేఎన్‌వీల్లో ప్రవేశం కల్పిస్తారు. అభ్యర్థులు సదరు జేఎన్‌వీ నెలకొన్న జిల్లాకు చెందిన వారై ఉండాలి.జేఎన్‌వీఎస్‌టీ పరీక్షలో సాధించిన మార్కులు, దరఖాస్తు చేసుకున్న జిల్లా.. సదరు జిల్లాలోని జేఎన్‌వీలో ఉన్న సీట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని.. రిజర్వేషన్లు తదితరాల ఆధారంగా జిల్లా స్థాయిలో మెరిట్ జాబితా ప్రకటించి ప్రవేశం కల్పిస్తారు.

**పల్లె విద్యార్థులకు ప్రాధాన్యం**

జేఎన్‌వీలలోని సీట్లలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. మొత్తం సీట్లలో 75 శాతం సీట్లను పల్లె ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తున్నారు. అదే విధంగా బాలికలను ప్రోత్సహించేలా మొత్తం సీట్లలో విద్యార్థినులకు 33 శాతం(1/3 వంతు) సీట్లను కేటాయిస్తున్నారు.

**గురుకుల విధానం**

జవహర్ నవోదయ విద్యాలయాల్లో పూర్తిగా రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేస్తున్నారు. వీటిలో ప్రవేశం పొందిన విద్యార్థులు సదరు పాఠశాలల వసతి గృహాల్లోనే ఉండి చదువు కోవాల్సి ఉంటుంది. క్లాస్ రూమ్ బోధనతోపాటు.. అది పూర్తయిన తర్వాత హాస్టల్స్‌లో మెంటార్స్ సదుపాయం సైతం అందుబాటులో ఉంటుంది.

**ఎనిమిది నుంచి ఇంగ్లిష్**

ఆరో తరగతి వరకు విద్యార్థులు తమ మాతృభాష లేదా తమ ప్రాంతీయ భాషలో చదివే అవకాశం కల్పిస్తున్నారు. ఎనిమిదో తరగతి నుంచి మాత్రం ఇంగ్లిష్ మీడియంలో చదవాల్సి ఉంటుంది. ఎనిమిదో తరగతి నుంచి మ్యాథమెటిక్స్, సైన్స్ సబ్జెక్ట్‌లను ఇంగ్లిష్ మీడియంలో, సోషల్ సైన్స్ సబ్జెక్ట్‌ను హిందీ మీడియంలో చదవాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

**యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్**

జవహర్ నోవదయ విద్యాలయాల్లో ప్రాక్టికాలిటీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. లెర్నింగ్ బై డూయింగ్ విధానాన్ని అనుసరిస్తారు. అంటే.. ఏదైనా అంశాన్ని బోధించినప్పుడు దానికి సంబంధించి ప్రాక్టికల్స్ లేదా పజిల్స్, క్విజ్‌లు వంటివి నిర్వహిస్తారు. తద్వారా సదరు అంశంపై విద్యార్థికి పూర్తి స్థాయి అవగాహన, ఆసక్తి కలిగేలా బోధన ఉంటుంది. విద్యార్థుల్లో వాస్తవ దృక్పథం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

అందుకోసం యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ముఖ్యంగా సైన్స్, మ్యాథమెటిక్స్ వంటి సబ్జెక్ట్‌లలో ప్రాక్టికల్ బోధనకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రాజెక్ట్ వర్క్, లేదా ఆయా సబ్జెక్ట్స్‌లో స్కూల్ స్థాయిలో ఎగ్జిబిషన్స్ నిర్వహిస్తూ.. విద్యార్థులకు తాము నేర్చుకున్న అంశాలకు వాస్తవ రూపం ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నారు.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 10.08.2023
- **జేఎన్‌వీఎస్‌టీ పరీక్ష తేదీ:** 20.01.2024
- **వివరాలకు వెబ్‌సైట్:** https://navodaya.gov.in

## క్లుప్తంగా...

### ఆదివాసీలకు అండగా ప్రభుత్వం: సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని (ఆగస్టు 9) పురస్కరించుకుని ఆదివాసీలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. అడవినే నమ్ముకుని జీవించే నిష్కల్మశ హృదయులైన ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. దేశానికే ఆదర్శంగా ఆదీవాసీ అభివృద్ధి కార్యాచరణను అమలు చేస్తున్నామన్నారు.

### పీజీ డెంటల్ యాజమాన్య కోటా సీట్లకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పీజీ దంత విద్య కోర్సుల్లో యాజమాన్య కోటాలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదుకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జాతీయ స్థాయి అర్హత పరీక్ష నీట్ – ఎండీఎస్–2023లో అర్హత సాధించిన అభ్యర్థులు పీజీ ఎండీఎస్ డిగ్రీ సీట్లకు నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు. యాజమాన్య కోటాలో సీట్ల భర్తీకి ఈ నెల 9వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. వివరాలకు www.knruhs.telangana.gov.inలో సంప్రదించాలని యూనివర్సిటీ వర్గాలు సూచించాయి.

### పీజీ మెడికల్ మేనేజ్‌మెంట్ సీట్లకు నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ నాన్–మైనారిటీ, మైనారిటీ మెడికల్ కాలేజీలలో 2023–24 కోసం మేనేజ్‌మెంట్ కోటా కింద పీజీ మెడికల్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి మంగళవారం నోటిఫికేషన్ విడుదలైంది. నీట్ పీజీ–2023లో అర్హత పొందిన అభ్యర్థుల నుంచి కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించింది. ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు ప్రక్రియ బుధవారం ఉదయం 8 గంటల నుంచి ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. https://pvttspgmed.tsche.in వెబ్‌సైట్‌లో స్కాన్ చేసిన ఒరిజినల్ ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలని విశ్వవిద్యాలయం కోరింది. పీజీ, డిప్లొమా కోర్సులకు రిజిస్ట్రేషన్, ధ్రువీకరణ రుసుము రూ.6,300 (బ్యాంక్ లావాదేవీల చార్జీలు అదనం). డెబిట్ కార్డ్ / క్రెడిట్ కార్డ్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించాలి.

# చీమల చట్నీ.. గోంగూర.. తింటారు నోరూర

## విభిన్నంగా ఆదివాసీల ఆహారపు అలవాట్లు

**గోంగూర, చింతపండు ప్రధాన ఆహారం**

**ఎండు మిరప కోసం వందల కిలోమీటర్ల నడక..**

**నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం**

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



గల్లీలో ఉండే చిన్న హోటల్‌లోనే పొద్దున ఇడ్లీ, పూరీ, వడ, ఉప్మా ఇంకా ఎన్నో వెరైటీ టిఫిన్లు దొరుకుతాయి. ఇక మధ్యాహ్నం అన్నం, రెండు మూడు రకాల కూరలు, పప్పు, చారు, పెరుగు ఇవన్నీ లేనిదే ముద్ద దిగదు. ఇక ఏ స్టార్ హోటల్‌కి వెళ్లినా ఏ దేశపు వంటకాలైనా ఆర్డర్‌చేస్తే చాలు టేబుల్‌పై హాజరు... ఇవీ మైదాన ప్రాంత ప్రజల ఆహారపు అలవాట్లు. కానీ అడవుల్లో జీవించే ఆదివాసీలు ఏం తింటారు? సీజన్‌లో దొరికే గోంగూర, చింతపండు, మిరపకాయలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఆహార సేకరణ కష్టంగా మారిన సమయంలో ఎర్రచీమలతో పచ్చడి నూరుకుని కూడా తింటుంటారు. అయితే మారిన పరిస్థితుల్లో విద్య, ఉద్యోగాల కోసం అడవుల నుంచి బయటపడుతున్న వారి ఆహారపు అలవాట్లలో ఇప్పుడిప్పుడే కొంత మార్పు చోటు చేసుకుంటోంది.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, తూర్పు గోదావరి జిల్లాలు రెండు దశాబ్దాలుగా

**వలస ఆదివాసీలు**

ఛత్తీస్‌గఢ్, ఒడిశాకు చెందిన ఆదివాసీలకు ఆశ్రయం ఇస్తున్నాయి. వలస ఆదివాసీల్లో అనేక తెగలు ఉండగా, వీరిలో 90 శాతం మంది రోడ్డు, నీళ్లు, విద్యుత్ సౌకర్యం లేకుండా అటవీ ప్రాంత పల్లెల్లోనే ఉంటున్నారు. పోడు సాగు చేసుకోవడం, ఇంటి ఆవరణలోనే తినే ఆహార పదార్థాలను పండించుకోవడం వీరి జీవనశైలి.

### గోంగూర.. పండుగే..

వానాకాలంలో మొలకెత్తే గోంగూర ఆగస్టులో తినేందుకు అనువుగా ఎదుగుతాయి. ఆ సమయంలో ఆదివాసీలు గోంగూర పండుగ చేసుకుంటారు. చింతకాయలు అందుబాటులోకి వచ్చే వరకు గోంగూరే వీరి ప్రధాన ఆహారం. వానాకాలం ముగిసేలోగా అందుబాటులో ఉన్న గోంగూర ఎండబెట్టుకుని వేసవి వరకు వాడుకుంటారు. ఎండాకాలంలో చింతకాయలు రాగానే పచ్చడి చేసుకుంటారు. గోంగూరతో పాటు పచ్చకూర (చెంచలి), బొద్దు కూర, నాగళి, టిక్కల్ అనే ఆకుకూరలు, కొన్ని రకాలైన దుంపలను కూడా వండుకుంటారు.

### కారం కావాలంటే..

మొదట్లో అటవీ ఫలసాయం తప్ప వ్యవసాయం తెలియని ఆదివాసీలను కారం రుచి మైమరపించింది. గోంగూర, చింతకాయ పచ్చడికి అవసరమైన మిరపకాయలు అపురూపమైన ఆహారంగా మారింది. దీంతో మిరపకాయల కోసమే ఎత్తయిన కొండలు గుట్టలు ఎక్కుతూ దిగుతూ.. వాగులు, వంకలు దాటుతూ రాష్ట్రాల సరిహద్దులు చెరిపేసి గోదావరి తీరానికి చేరుకునేవారు. ప్రారంభంలో భద్రాద్రి ఏజెన్సీలో కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంటను దొంగిలించుకెళ్లేవారట. ఆ తర్వాత ఇక్కడ పనిచేసి, కూలీగా మిర్చి తీసుకెళ్లడం అలవాటు చేసుకున్నారు. ఇక పోడు సాగు కోసం ఆదివాసీలు అడవిని నరికేటప్పుడు ఇప్ప, మద్ది, తునికి, చింత, పాల చెట్లు తారసపడితే ముట్టుకోరు. ఇక ఇప్ప చెట్టునయితే దైవంతో సమానంగా కొలుస్తారు.

### చీమలు... ఆహారంగానే కాదు.. వైద్యానికి కూడా

ఆకు రాలే కాలం మొదలైన తర్వాత వసంతం వచ్చే వరకు ఆదివాసీలకు ఆహార సేకరణ కష్టంగా మారుతుంది. ఈ సమయంలో చీమలను ఆహారంగా తీసుకుంటారు. సర్గీ, సాల్, మామిడి ఆకులపై ఎర్రచీమలను వాటి గుడ్లను సేకరిస్తారు. అనంతరం ఉప్పు, కారం, టమాటా కలిసి రోట్లో వేసి రుబ్బుతారు. ఇలా తయారు చేసిన చట్నీని బస్తరియాగా పిలుస్తారు. ఈ పచ్చడిని వారు ఇష్టంగా తింటారు. ఎర్రచీమల్లో ఔషధ గుణాలు కలిగిన ఫామిక్ యాసిడ్ ఉండడమేకాక ప్రొటీన్, కాల్షియం సమృద్ధిగా ఉండి జ్వరం, జలుబు, దగ్గు, కంటి సంబంధిత సమస్యలు, కీళ్ల నొప్పులు తగ్గుతాయని నమ్ముతారు. అలాగే ఒంట్లో నలతగా ఉన్నా, తలనొప్పి, జ్వరంగా అనిపించినా చీమల చికిత్సకే మొగ్గు చూపుతారు. చెవులు, ముక్కుల ద్వారా చీమలు శరీరంలోకి వెళ్లకుండా ముఖాన్ని వస్త్రంతో కప్పేసుకుని చీమల గూడును ఒంటిపై జల్లుకుంటారు. వందల కొద్దీ చీమలు శరీరాన్ని కుడుతుండగా.. మంట పుట్టి క్షణాల్లో ఒళ్లంతా చెమటలు వస్తాయి. రెండు, మూడు నిమిషాలు ఉన్న తర్వాత చీమలు తీసేస్తారు. తద్వారా ఒంట్లో ఉన్న విష పదార్థాలు చెమట రూపంలో బయటకు వెళ్లి ఉపశమనం కలుగుతుందని వారి నమ్మకం. కాగా, జొన్నలు, సజ్జలు వంటి చిరుధాన్యాలనే పండించి ఆహారంగా తీసుకునేవీరు క్రమంగా బియ్యానికి అలవాటు అవుతున్నారు. వ్యవసాయంలో ఎరువులు సైతం ఉపయోగిస్తున్నారు. గతంలో ఆవు పాలు తీసుకోని వీరు.. ఇప్పుడిప్పుడే పాలను ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. ఇక ప్రభుత్వ గిరిజన పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు నెమ్మదిగా మైదాన ప్రాంత ఆహారపు అలవాట్లు చేసుకుంటున్నారు.



### చీమల చట్నీకి జీఐ ట్యాగ్..

ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలోని ఆదివాసీలు తమ ఆహారంలో చీమల చట్నీకి తొలి ప్రాధాన్యమిస్తున్నారు. ఎర్ర చీమలతో తయారు చేసే ఈ పచ్చడి ఔషధపరంగానూ ఉపయోగపడుతుందని వారు నమ్ముతున్నారు. చీమల చట్నీకి జీఐ ట్యాగ్ సైతం లభించడం గమనార్హం.

### జొన్నలు, సజ్జలు తింటే తొందరగా ఆకలి వేయదు



ఇంతకు ముందు జొన్నలు, సజ్జలు తినేవాళ్లం. పొద్దున తిని అడవికి వెళితే రాత్రి వరకు ఆకలి అనేది ఉండకపోయేది. కానీ బియ్యంతో చేసిన అన్నం అయితే రోజుకు రెండుసార్లు తినాల్సి వస్తోంది. ఇది తప్పితే బియ్యంతో చేసిన అన్నం బాగుంది.

– మామిడి అరవయ్య
(కూలీ, రెడ్డిగూడెం ఎస్టీ కాలనీ, పాల్వంచ మండలం)

## నేడు తుది దశ ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు

**రెండు విడతల్లో మిగిలిన సీట్ల సంఖ్య 19 వేలు**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కన్వీనర్ కోటా కింద తుదిదశ ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు బుధవారం జరగనుంది. ఈ విడతలో వివిధ బ్రాంచీలకు చెందిన 19 వేల సీట్లను కేటాయించాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా కన్వీనర్ కోటా కింద 82,666 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉండగా తొలి విడతలో 70,665 మందికి సీట్లు కేటాయించారు. తొలి విడత కౌన్సెలింగ్‌లో మిగిలిన 12,013 సీట్లతోపాటు ఆ విడతలో సీట్లు లభించినా రిపోర్టు చేయకపోవడంతో మిగిలిపోయిన 18 వేల సీట్లను కలిపి రెండో దశలో 30 వేలకుపైగా సీట్లు కేటాయించారు. రెండో దశలోనూ 12 వేల సీట్లు మిగిలిపోయాయి. ఆ విడతలో సీట్లు లభించినా 7 వేల మంది చేరలేదు. దీంతో తుది విడత కౌన్సెలింగ్‌లో 19 వేల వరకూ సీట్లు కేటాయించనున్నారు.

### 17 నుంచి ప్రత్యేక కౌన్సెలింగ్

- తుది విడత సీట్లు కేటాయించిన అభ్యర్థులు ఈ నెల 10 నుంచి 12లోగా సంబంధిత కాలేజీల్లో రిపోర్టు చేయాలి. లేకుంటే సీటు రద్దవుతుంది.
- ఇందులో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 17 నుంచి ప్రత్యేక కౌన్సెలింగ్ జరగనుంది. ఎన్ఐటీ, ఐఐటీ సీట్ల కేటాయింపునకు సంబంధించిన జోసా కౌన్సెలింగ్ కూడా పూర్తవ్వడంతో వాటిల్లో సీట్లు పొందని వారికి ఇది ఉపయోగపడుతుంది.
- స్పెషల్ కౌన్సెలింగ్ ఆప్షన్ల ప్రక్రియ పూర్తవ్వగానే ఈ నెల 23న సీట్ల కేటాయింపు ఉంటుంది. ఇందులో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 25లోగా కాలేజీల్లో నేరుగా రిపోర్టు చేసి సీటు దక్కించుకోవాలి.
- ఒక కాలేజీలో తుది విడత కౌన్సెలింగ్‌లో ఏదైనా బ్రాంచీలో సీటు వచ్చి ప్రత్యేక కౌన్సెలింగ్‌లో వేరొక బ్రాంచీలో సీటు వస్తే కేటాయింపు పత్రాన్ని సమర్పించి సీటు మార్పిడి చేసుకోవాలి. వేరొక కాలేజీలో సీటు వచ్చిన పక్షంలో అంతకుముందు రిపోర్టు చేసిన కాలేజీలో టీసీ, ఇతర సర్టిఫికెట్లను ఈ నెల 25లోగా తీసుకొని ప్రత్యేక కౌన్సెలింగ్‌లో సీటు వచ్చిన కాలేజీలో రిపోర్టు చేయాలి.

### యాజమాన్య కోటా సీట్ల పరిశీలన

ఎంసెట్ కౌన్సెలింగ్ తుది దశకు చేరుకుంటున్న నేపథ్యంలో యాజమాన్య కోటా సీట్ల కేటాయింపుపై ఉన్నత విద్యామండలి దృష్టి పెట్టింది. ప్రత్యేక కౌన్సెలింగ్ పూర్తయ్యేలోగా ప్రైవేటు కాలేజీలు యాజమాన్య కోటా సీట్ల భర్తీ వివరాలను పంపాలని అధికారులు కోరుతున్నారు. ప్రతి కాలేజీలోనూ 30 శాతం యాజమాన్య కోటా ఉంటుంది. ఇందులో 15 శాతం ఎన్ఆర్ఐ సిఫార్సులకు సీట్లు ఇస్తారు. మిగిలిన 15 శాతం సీట్లను నిబంధనల ప్రకారం భర్తీ చేయాలి. జేఈఈ, ఎంసెట్ ర్యాంకులను, ఇంటర్‌లో వచ్చిన మార్కులను ప్రాతిపదికగా తీసుకోవాలి. ఈ రూల్స్ ఎంతమేర పాటించారనేది అధికారులు పరిశీలిస్తారు.

## ఈసెట్ కౌన్సెలింగ్‌లో 9,680 సీట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: ఈసెట్ ద్వారా ఇంజనీరింగ్, బీఫార్మసీ రెండో సంవత్సరంలో చేరే విద్యార్థులకు మంగళవారం సాంకేతిక విద్యామండలి సీట్లు కేటాయించింది. తొలివిడత కౌన్సెలింగ్‌లో మొత్తం 117 కాలేజీలు పాల్గొనగా, 12,911 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో 11,698, ఫార్మసీలో 1,213 సీట్లు ఉన్నాయి. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసి, ఈసెట్ అర్హత పొందినవారు ఈ ఏడాది 20,895 మంది ఉన్నారు. వీరిలో 12,880 మంది 5,49,766 ఆప్షన్లు ఇచ్చారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సాంకేతిక విద్యామండలి తెలిపింది. కాగా, ఎంసెట్ అర్హులు ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ కోర్సులకే ఎక్కువ ప్రాధాన్యత నిస్తే, ఈసెట్ అర్హులు మాత్రం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, మెకానికల్ కోర్సుల వైపు మొగ్గు చూపారు. పాలిటెక్నిక్ డిప్లొమాలో ఎక్కువగా ఇవే కోర్సులు అందుబాటులో ఉండటమే కారణం. కంప్యూటర్ కోర్సుల్లో 6,900 సీట్లు అందుబాటులో ఉంటే, 5,118 సీట్లు కేటాయించారు. 1,782 సీట్లు మిగిలిపోయాయి. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌లో 2,892 సీట్లు ఉంటే, 2,736 సీట్లు కేటాయించారు. సివిల్, మెకానికల్‌లో అత్యధికంగా 96.60 శాతం సీట్లు భర్తీ అయ్యాయి.

## 12 వరకు హెచ్‌సీయూ పీజీ ప్రవేశాల గడువు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పోస్టు గ్రాడ్యుయేట్, ఐఎంఎస్సీ పీహెచ్‌డీ కోర్సులలో ఈ ఏడాది అడ్మిషన్లకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రవేశాలకు ఈ నెల 12వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొంది. హెచ్‌సీయూలో 43 పోస్టుగాడ్యుయేట్ కోర్సులు, రెండు ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ పీహెచ్‌డీ కోర్సులలో అడ్మిషన్లు కల్పిస్తారు. ఈ కోర్సులలో 1,346 సీట్లు ఉన్నాయి. అందులో జనరల్ 543, ఎస్సీలకు 204, ఎస్టీలకు 100, ఓబీసీలకు 365, ఈడబ్ల్యూఎస్ 134, పీడబ్ల్యూడీలకు 67, ఏఎంపీ, డీపీలకు 67 సీట్లు కేటాయించారు. ఔత్సాహిక అభ్యర్థులు యూనివర్సిటీ అకడమిక్ వెబ్‌సైట్ లింక్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.







72198 21111 | BAJAJ FINANCE LTD - AF | BAJAJ SECURE

Authorised Dealers For Bajaj Auto Ltd.: Karimnagar STANDARD BAJAJ 08782-276545, 9848576545, VENKAT BAJAJ 9703615888, 9390511059 • Mancherial MAHI BAJAJ 9000124645• Adilabad SRR MOTORS 9491249451,9491159452. Nizamabad BIJAY BAJAJ 6302922012, 8885671855, 08462-234013/14 B VIJAYA GANAPATHI AUTOMOTIVES 9030338868, 9849590160. Authorised Service Centre: Jagithyal 8074576439, 9949565692 SIRICILLA 8309314141, METPALLY 9866766607, KORUTLA 9440653412, HUSNABAD 9390511077, HUZURABAD 9440682444, JAMMIKUNTA 9966114435, KALWACHERLA 9550195295, KATARAM 8008793934, VEMULAWADA 9866838847, PEDDAPALLY 9849184700,9849362096, NIRMAL 9059958417, 9010792792, Ichoda 9640138358, Utnoor 7569143884, 9494651329, NIRMAL 9912663515, BHAINSA 8341437171, KHANAPUR 9030750273 , KADEM 9030750273 GAJWEL 9848347349,MEDAK 7702014433,SIDDIPET 7702015577, RAMAGUDAM 9912278650, JANNARAM 9440004495, BELLAMPALLI 9849686258, KAGAZNAGAR 9491344501, ASIFABAD 8074075400, CHENNUR 9949993645, Kamareddy 9849852992, Balkonda 9059412880, Kammarpally 9010686085, PITLAM 9949812745, LUXETTIPET 8074364716

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.